అక్టోబర్ 01-15, 2022
సంపుటి 02, సంచిక 24

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



పూలను పూజించి, ప్రకృతిని ఆరాంధిచే వేడుక...

బతుకమ్మ శుభాకాంక్షలు



ప్రపంచానికి అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన
మహనీయుడు **మహాత్మాగాంధీ జయంతి**
(అక్టోబర్ 2)

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




మాట విలువను మరొకసారి
గుర్తుకు తెచ్చిన **కూర్మాచలం**
04 కవిత **"మురిపాల ఊటలు"**



17

30 ఏళ్ల నవలా పరిణామం
చిత్రించిన **భీంపల్లి** వ్యాసం
**"తెలంగాణ నవలా సాహిత్యం"**



13

సంపద వల్ల అక్కనే మరిచిపోయిన
చెల్లెలి కథ **పెరుమాళ్ళ ఆనంద్**
**"కొత్త చిగురు"**



23

అనుకోకుండా జరిగిన యాక్సిడెంట్‌కి
నేరస్థుడైన యువకుని కథ
**డా॥ ప్యారక కృష్ణమాచారి**... **"అభియోగం"**



27

తెలంగాణ సంస్కృతిని తెలుపుతున్న
**రమావత్ రజిత** వ్యాసం **"మన
తెలంగాణ జాతరలు విశేషాలు"**




35

ఆకురాయి వ్యాస సంపుటిని
విశ్లేషించిన **సాగర్ల "సృజనకు
పదును పెట్టే ఆకురాయి"**



31

ఆడంబరాలకు అలవాటు పడిన నేటి తరం
పిల్లలకు మన సంప్రదాయాలను వివరించిన
**మనోహరాచారి** కథ సంస్కార **"వారధి"**

ఆనందం కోసం
వెతుకుతున్న మనిషి
తపనను చిత్రించిన కవిత...
16 **రమేష్ "తీరం"**

రాళ్లు రప్పలు ఎడారిలో
కలువలను గోరుట
సాధ్యమా అంటున్న
02 **రాజ్‌కుమార్ 'గజల్'**

విమర్శ పైన విమర్శను
విశ్లేషించిన **లక్షణ చక్రవర్తి** వ్యాసం...
**"తెలంగాణలో అధి విమర్శ"**.....పేజీ 09

వీరుల బలిదానం వృథా కాదు అని
చెబుతున్న **రాజకుమార్** కవిత...
**"వెయ్యి ఊరుల మర్రి"**....పేజీ 12

**రేడియం** చిత్రించిన రాత్రి మత్తు
**"రాత్రి ధాత్రి"** కవిత.. ....పేజీ 33

అక్షరాల ఉత్సవం అల అని తెలుపుతున్న
**ఎలనాగ** అనువాద కవిత **"గురి"**....పేజీ 34

కొండి మల్లారెడ్డి ప్రేమలేఖ **"భాగమతి ఓ
ప్రేమ లేఖ"** కవిత... పేజీ 40

విఫలమైన ప్రేమను చిత్రించిన **"ఆరని
జ్యోతి"** కె.వై. గిరి నాటి కథ... పేజీ 05

మురిపాల పసితనం కోసం రాసిన **"చంద్ర
కిరణాలు"** కవితలను పరామర్శించిన
**గోపగాని రవీందర్**... పేజీ 39

బుద్ధులు చెప్పిన **"బద్దెన లోకోక్తులు"**
నాటి కవిత... పేజీ 08

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత

# గజల్...!



**మడిపల్లి రాజ్‌కుమార్**, 99496 99215

మూసి తలుపులు ఎన్ని నాళ్ళని నీళ్ళనాపుట సాధ్యమా!
కంటి కొలకులు దాటునని కన్నీళ్ళు దాచుట సాధ్యమా!!

కొంటెగాలికి ఏటి బింబమె, నింగి జాబిలి కదులునా!
కత్తి కళ్ళను పొడచు నేమో! కలలు తెంచుట సాధ్యమా!!

తుమ్మెదలకే పంచు పూవులు తీపి వలపుల మధువులు!
ఎపుడు వీచే కొంటెగాలిని పూలు నమ్ముట సాధ్యమా!!

మాత్ర పెరిగిన దంటు ఎందుకు తలన భారపు వేదన!
మనసు పలికే మధుర భావం కత్తిరించుట సాధ్యమా!!

నిన్ను దోషిగ నిలుపు వారే దోచితిరి నీ సంపద!
న్యాయమూర్తిగ నిలువ మనసే మోసగించుట సాధ్యమా!!

మూసపోతల బొమ్మలెన్నో చేసి అమ్ముట సహజమే!
రదీఫు కాఫియాలు దొరికిన గజలు నల్లుట సాధ్యమా!!

లెక్కపెట్టుట డప్పుకొట్టుట అంగడిలోని అవసరం!
కండలుగ కావ్యాలు చూపుతు తొడలు గొట్టుట సాధ్యమా!!

దుఃఖవీణను మీటి పలికే విరహగీతం చెలియకే!
పూలపడవను యుద్ధనౌకగ తరలి వెళ్ళుట సాధ్యమా!!

పూలగంధపు మోత 'రాకుమార'హోరు గాలికి భారమా!
రాళ్ళురప్పలు ఎడారుల కలువలను కోరుట సాధ్యమా!!



సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

1-15 అక్టోబర్, 2022

సంపుటి 02 సంచిక 24



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్దన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# ఉన్నతీకరణకు ప్రాతిపాదికలు ఉత్సవాలు

చాలా ఉత్సాహంతో పరాయిపాలన శృంఖలాల నుంచి దేశం విముక్తమయిందని ఉత్సవాలు జరుపుకున్నాం. ఆ సందర్భంగా 75 ఏళ్ళ వసంతాలను తలచుకొని పులకించిపోయాం. అదేవిధంగా తెలంగాణ దినోత్సవాలను కూడా సెప్టెంబర్ 17 సందర్భంగా జరుపుకున్నాం. మనకు ఏ రకంగా స్వేచ్ఛ లభించినా స్మరించుకోవాల్సిందే. మన ఉన్నతికి పాటుపడిన పోరాటవీరులను, అహింసామూర్తులను తలచుకోవల్సిందే. ఈ ఉత్సవాల సందర్భంగా మనల్ని మనం పునర్మూల్యాంకనం చేసుకోవాల్సిందే. జాతికి పునరంకితం కావల్సిందే.

కాని మనకు నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించిందా? భిన్నవర్గాలలో విభేదాల స్థానంలో సమైక్యత పొడసూపే ఆనవాళ్ళు కనబడుతున్నాయా? స్వాతంత్ర్య ఫలాలు అనుభవించే సమానావకాశాలు ఇప్పటికైనా ఏర్పడ్డాయా? ఉదార ఆర్థిక విధానాల వల్ల ఏర్పడ్డ అంతరాలను గురించి ఏమైనా ఆలోచన సాగుతున్నదా? స్త్రీలు దళితవర్గాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నారు? వాళ్ళ అక్షరాస్యత ఎంత? భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న కులం ఇంకా ఎన్నాళ్ళు కొనసాగుతుంది? అన్నీ ప్రశ్నలే. మార్కెట్లోని విభిన్న వస్తుసముదాయానికి మధ్యతరగతి ఆకాంక్షిస్తున్నది. ఆరాటపడుతున్నది. రెక్కలు వచ్చిన యువత విదేశాలకు ఎగిరిపోయే యావలోనే ఉన్నారు. డాలరు అన్ని వర్గాలకు లక్ష్యమైంది.

ఈ సందర్భంగా సాహిత్యం ఏం చేస్తున్నది. ఈ అంతరాల బేధాన్ని నిర్మూలించడానికి తనవంతు కృషి కొనసాగిస్తున్నదా? తన చేతుల్లో శక్తివంతమైన అక్షరాయుధం పట్టుకున్న సృజనకారుల లక్ష్యం ఎటు వెడుతున్నది? ఇవన్నీ పునరాలోచన చేసుకోవాల్సిన సందర్భం ఇది. తెలుగు సాహిత్యం విషయానికి వస్తే సమాంతర సాహిత్యం కూడా వర్గాలుగా, గ్రూపులుగా విడిపోయి కనిపిస్తున్నది. అయితే ఇది ఖండించవలసిన విషయంగా కాకుండా తత్కాలీన స్థితికి ప్రతిఫలనంగానే తీసుకోవాలి. వికేంద్రీకృత సాహిత్య నిర్మాణం కూడా అభిలషించదగిన పరిణామమే. భిన్నత్వం సరే... కాని అందులో ఏకత్వం ఉందా? సృజనకారుల మధ్య సహజంగా ఉండవలసిన సయోధ్య ఉందా? అభిప్రాయభేదాలు సైద్ధాంతిక భిన్నత్వాలు ఉన్నా మౌలికంగా తాము ఈ జాతికి, సమాజానికి అప్రకటిత ప్రతినిధులం అనే సోయితో ఉన్నారా? దీన్ని గాఢంగా వివేచించవలసిన సందర్భం ఇది. కునారిల్లుతున్న జాతి భావం సృజనకారుని నిర్మాణ దృక్పథం వల్ల పునర్వికాసం చెందాల్సిన స్థితి ఇప్పటిది.

ఇక తెలంగాణ విషయానికి వస్తే మన సాంస్కృతిక మూలాలకు ఉపాదేయమైన బతుకమ్మ పండుగ రానే వచ్చింది. సంగీత సాహిత్యాల మేలవింపుతో నిసర్గ మాధుర్యంతో స్త్రీలు జరుపుకునే పండుగ ఇది. మన రాష్ట్రానికి మాత్రమే చెందిన ఈ ఉత్సవం ఉన్నతీకరణ చెందిన జీవితాలకు ఒక ప్రామాణిక అంశం. పూలతో పూజచేసే మనం ఆ పూలనే పూజించే గొప్ప పండుగ ఇది. బొడ్డెమ్మ, బతుకమ్మ, సద్దుల బతుకమ్మ ఇట్లా మనల్ని మనం తడిమిచూసుకునే సావకాశం ఇది. ఉత్సవం సంరంభం మాత్రమే కాకుండా స్వాతంత్ర్య ఫలాలను అన్ని వర్గాలకు చెందేలా మనం చేయాల్సిన కృషిని గుర్తుచేసుకుందాం. సృజనకారుల ఆత్మావలోకానికి బతుకమ్మ ఒక కరదీపిక అని భావిద్దాం.

జై తెలంగాణ, జై జాగృతి.

క
వి
త

# మురిపాల ఊటలు



- డా॥ కూర్మాచలం, 7702435110



మనిషికి దేవుడిచ్చిన దివ్యవరమిది!
జంతువుకు మనుషులకు గుర్తింపు నిచ్చేది
మనుషుల్ని కలిపేది విడగొట్టేది
మనస్సుల్లో కరుణను కురిపించేది
కల్మషాన్ని నింపేది మాటే!

కఠినపు మాటలు, కల్లోలపు కోటలు
తప్పుడు మాటలు, తిప్పల కుంపట్లు
చెప్పుడు మాటలు, ముప్పుల మురికి కూపాలు
కల్లబొల్లి మాటలు, కలహాలకు నిలయాలు
పెద్దల మాటలు, పెరుగన్నపు మూటలు
పెన్నిధి రాశులు, మృదుమధుర మాటలు
మనుగడకు సోపానాలు!

సంసారం చిగురించేది,
సంస్కారం పెంపొందేది మాటతోనే
విజయం దక్కేది గమ్యం చిక్కేది మాటతోనే
సంఘం ఐక్యమయ్యేది
సమాజం సుస్థిరంగా వర్ధిల్లేది మాటతోనే!

గెలుపుకైనా ఓటమికైనా, శాంతికైనా అశాంతికైనా
సహనానికైనా అసహనానికైనా, సమానతకైనా అసమానతకైనా
కలివిడికైనా కల్లోలానికైనా, మూలమంత్రం మాటే!

పోయిన మూటలు మళ్ళీ దొరకవచ్చునేమో
ఒకసారి నోరు జారిపోతే తిరిగిరానివి మాటలే
ప్రయోగించాక ఉపసంహరణ లేని
తూటాల్లాంటివే మాటలు!

ఇచ్చిన మాటను నిలుపుకోని మనిషికి
ఇహపరాల్లో నరకమే
మహామహితాత్ముడౌను
మాటకు కట్టుబడిన మనిషి!

కాటికాపరిగా మారాడు
హరిశ్చంద్రుడు ఇచ్చిన మాట కోసమే!

అధఃపాతాళానికి నెట్టబడ్డాడు బలిచక్రవర్తి
వామనునికి ఇచ్చిన మాటకోసమే!

శ్రీరామున్ని అడవులకు
పంపాడు దశరథమహారాజు
కైకకు ఇచ్చిన మాట కోసమే!

అన్నయైన ధర్మరాజు మాటకు కట్టుబడి
అడవులపాలయ్యారు పాండవులు!

అందుకే నేనంటాను మంచి చెడ్డలను
నిర్దేశించే మాటలు ముత్యాల మూటలు
భవిష్యత్తుకు బంగారు బాటలు
చైతన్యపు పూదోటలు
ముద్దు మురిపాల ఊటలు!

నాటి కథ

# ఆరని జ్యోతి

పెలవు తీసుకున్న ప్రేయసి వేదన...

కె.వై. గిరి

**రచయిత గురించి...**

*కె.వై. గిరి సిద్ధిపేట మండలం తోర్నాల గ్రామంలో 1945లో జన్మించారు. తొలి కథానిక 'ఆరనిజ్యోతి' ప్రజామాత పత్రికలో ప్రచురింపబడింది. పదికి పైగా కథలు, యాభైకి పైగా కవితలు రచించారు. చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ వీరి అభిరుచులు. ఉపాధ్యాయులుగా పదవీవిరమణ పొంది సొంత గ్రామంలో నివసిస్తున్నారు.*

"చిట్టీ... యిలారా!" అని పిలుస్తూ పచ్చని కాగితంపై పరుగులు తీస్తున్న కలాన్ని ఆపుజేసి లేచి కుర్చీని వెనక్కి లాగుతూ ఉత్తరాన్ని మడచి రెండడుగులు ముందుకు వేశాడు శేఖర్.

అంతలోనే "ఏం మాస్టారూ! పిలిచారు" అంటూ అతని చేతిలోని పచ్చ కాగితం చూడగానే అర్థం చేసుకొన్నది ఆ చిన్నారి. ఎనిమిదేళ్ళు ఆ అమ్మాయికి. తెల్లగా మెరుస్తూ అంచుల వెంబడి సూర్యుని కాంతిని రెట్టింపు చేయుచున్న లంగాకున్న అద్దముల వరస, పచ్చని బ్లౌజుతో లత (చిట్టి) శేఖర్ దగ్గరకు చేరింది.

తన చేతిలో ఉన్న కాగితాన్నందిస్తూ ఆమె చెవిలో ఏదో రహస్యం చెప్పాడు. తన స్నేహితురాలింటికి పరుగుదీసింది. ఏం చిట్టీ అంటూ తన స్నేహితురాలు బుజ్జి తడబడుతూ వస్తున్న లతను అడిగింది. "ఇదిగో బుజ్జీ! ఈ కాగితాన్ని మీ అక్కయ్యకి ఇవ్వమని మా మాష్టారు పంపించారు".

"మీ అక్కయ్య ఉందా?" అని మల్లె పువ్వులా నవ్వుతూ అంది.

అంతలోనే లేత గులాబి రంగులో మిలమిల మెరుస్తున్న ఆమె ముఖానికి మెరుగులు దిద్దుతూ ఒక పూలతోటలా వికసిస్తున్న టెర్లీన్ చీర, ఆ చీరకు దగ్గ వెల్వెట్ జాకెట్టు చంద్రబింబంలా మెరుస్తున్న ముఖంతో పిల్లలనుకుంటున్న మాటలు విని వారిదగ్గరికొచ్చి చేరింది సరోజ.

"అక్కయ్యా చిట్టి నీకేదోకాగితం తెచ్చింది" అని మెల్లిగా వాళ్ళ ముగ్గురి మట్టుకే వినబడేలాగున బుజ్జి అనడంతో లత చేతిలో వున్న ఆ ఉత్తరమును ఊడబెరుక్కుని జాకెట్లోకి దోపుకుంటూ లోనికి వెళ్ళింది సరోజ.

లత వెళ్ళిపోతుంటే "నేను నిన్న రాలేదు కదా! మరి మన లెక్కల మాష్టారు ఏం చెప్పారో కొంచెం కాపీ ఇస్తావా? వ్రాసికొని ఇస్తాను" అని బుజ్జి లతనాపి అడిగింది. "సరే ఇస్తా"నంటూ తలాడించింది లత.

ఇంతలోనే సరోజ రెండు కాఫీ కప్పులతో వస్తూ ఆ కాపీ సరేగాని మొదట ఈ కాఫీ తీసుకోండి" అంటూ తన చెల్లెలికో కప్పు లతకో కప్పు అందించింది. ఇద్దరమ్మాయిలతో పాటు సరోజ కూడా కాఫీ తాగింది. లత తిరిగి ఇంటికెళ్ళిపోయింది.

* * *

సరోజ ఉత్తరం విప్పింది. చుట్టుపక్కల ఏ శబ్దం కూడా లేదు. గదంతా ప్రశాంతంగా వుంది. వాళ్ళ వంటింట్లో సుబ్బులు ఏదో పనిచేస్తున్న శబ్దం మాత్రం అప్పుడప్పుడు వినబడుతోంది. బుజ్జి అప్పుడే బడికి వెళుతుంది కాబోలు పుస్తకాలు సర్దుకుంటోంది. తనకు కూడా బడికి టైమయిందని తెలిసింది. మళ్ళీ ఆ పుస్తకాన్ని మడుస్తూ గోడ గడియారం వంక చూసింది. గడియారం టిక్కు టిక్కుమంటూ ఆ గదిలోని నిశ్శబ్దాన్ని బ్రద్దలు చేస్తూ అయిదు నిమిషాలు తక్కువ తొమ్మిదిని చూపెడుతోంది.

సరోజ లేచి పుస్తకాల అల్మారా దగ్గరకు నడిచింది. ఒక పుస్తకం మాత్రం తీసికొని పెన్నును చేతబట్టుకొని పుస్తకాన్ని వక్షమునకత్తుకొని "అమ్మా! బడికెళ్తున్నా" అంటూ బయటికొచ్చింది.

సరోజ బడికొచ్చేసరికి బళ్ళోని పిల్లలంతా బారులుతీరి ప్రార్థన గీతాలాపనకు నిలబడియున్నారు. సరోజ కూడా వెళ్ళి ఆ గుంపులో కల్సిపోయింది.

ఉత్తరం వచ్చిన సంగతి తన స్నేహితురాలికి చెప్పొద్దనుకున్నా తన

ఉత్సాహమనేది చెప్పుకోక మాననీయలేదు. ఇద్దరూ వుత్తరం విప్పి చూస్తున్నారు. ముత్యాల్లాంటి అక్షర బారుల గుండా పరుగెడుతున్నాయి సరోజ, స్నేహితురాలు పద్మల కండ్లు.

ఇంట్లో వాళ్ళ అమ్మ ఒక్కతే ఉన్నది. ఆ ఇంట్లో ఏ అలజడి. పిల్లల చప్పుళ్ళు గానీ, ఏ ఇతర ఆటంకాలు గాని లేవు. వారి బీద ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

ప్రియమైన సరూ!

రేపు ఆదివారం కదూ! రేపు సాయంకాలం సిటీ బయట దేవాలయం వెనక నది తీరం దగ్గరున్న ఇసుక తిన్నెల దగ్గర నిన్ను కలుసుకోవాలని తహతహలాడుతున్నాను. నీవు వచ్చింతర్వాత అన్నీ మాట్లాడొచ్చు. తప్పక వస్తావు కదూ!

నీ ప్రియమైన శేఖర్

★ ★ ★

సరోజ శరీరం ధరించిన సన్నని వస్త్రము పాయలుపాయలుగా కదులుతున్నది. వీటన్నింటితో సవాలు చేస్తూ ఆనందంతో చిందులు తొక్కుతున్న ఆమె హృదయం దాన్ని ఇనుమడింపజేస్తుంది.

ఆశతో నిరీక్షణ చేస్తున్న శేఖర్‌కు ఈ దృశ్యం కంటపడింది. సరోజనే కదూ... నిజంగా సరోజనే ఇంత అందంగా ఉన్న ఈమెను పొందే భాగ్యం నాకుందా? అని ఆలోచిస్తున్నాడు. ఇంకా ఏవేవో ఆలోచనలు సుడులు త్రిప్పుతూ నీలి ఆకాశంలో సౌధాలు నిర్మిస్తున్నాడు శేఖర్. సరోజ ఆకారం ఇంకా దగ్గరగా శేఖర్ వద్దకు చేరింది.

★ ★ ★

శేఖర్ రెండేళ్ళ వయస్సులో తండ్రి కాలచక్రంలో నలిగి పరలోకయానం చేశాడు. ఆనాటినుండి తన తల్లి లక్ష్మి నానా అవస్థలు పడి కుమారునికి విద్యాబుద్ధులు చెప్పించింది. శేఖర్ కూడా ఎన్నో కష్టాలు అనుభవించి స్కూల్ ఫస్ట్ క్లాసులో పాసయి హైదరాబాద్‌లో పి.యు.సి. చదువుతున్నాడు.

తన తల్లి కుట్టుమిషన్ పనులు చేసి ఎలాగో అతన్ని ఇపుడొక మనిషిగా తయారు చేసినందుకు తల్లికి తన హృదయంలోనే కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాడు.

శేఖర్ చాలా తెలివైనవాడు. మాట, సాంప్రదాయం కలవాడు. నీతిగా బ్రతుకుతాడు. శేఖర్‌కు ఆడవారంటే అమిత ప్రేమ, గౌరవం, భక్తి, ఆప్యాయత, అనురాగం నిండుగా వుండేవి. కొందరిపై జాలి కలిగేది. ఎవర్ని ఎలా చూడాలో అలాగే చూసేవాడు.

అంచేత లాయర్ జగన్నాథరావు గారింట్లో ట్యూషన్ చెప్పటానికి కుదిరాడు. భోజనవసతి ఏర్పాటు ఉండడంతో లాయర్ ఇంట్లోనే వుంటూ వస్తున్నాడు. జగన్నాథరావ్ కూతురు లతకు ట్యూషన్ చెప్పుతూ తను కాలేజికి వెళ్లుతుంటాడు. ఆ అమ్మాయికి అతనంటే ఎంతో అభిమానం, గౌరవ భావన ఉట్టిపడేవి. తన కాలేజీ లత స్కూలుకి దగ్గరగానే ఉన్నందున ఇద్దరూ ఒకేసారి బయలుదేరి వెళ్ళేవారు. మరల ఇద్దరూ ఒకేసారి వచ్చేవారు. శేఖర్ ఆ అమ్మాయి పట్ల ఎంతో శ్రద్ధతో వస్తూ పోతుండే సమయంలో కూడా ఏదో బోధిస్తుండేవాడు.

శేఖర్ తల్లికి ఒక్కగానొక్క కుమారుడు. తోబుట్టువెవరూ లేరు. లతకు కూడా తన మూడు సంవత్సరాల వయసులనే తల్లి మరణించింది. తండ్రి జగన్నాథరావుకు లతే ప్రాణం.

శేఖర్‌కు ఆమెను చూడగానే ఎన్నో అనుభూతులు దొర్లుతుండేవి. ముక్కు పచ్చలారని ఆ అమ్మాయిని చూసి తల్లిలేని లోటు స్మృతిలో తిరుగుతుంటే అతని హృదయంలో లావా ప్రవహించేది. మనస్సు దుఃఖంతో నిండి చికాకుగా ఉండేది. శేఖర్ లతను చూడనిదే ఒక్క క్షణం కూడా ఉండలేకుండా పోయేవాడు. తల్లిపోయిన నాటినుండి ఆ చిన్నారి దాదుల ఒడిలో పెరిగింది. ఇప్పటికీ వారి సేవలోనే వుంటుంది.

ఆ కుమారిని దాదులు కొన్నిసార్లు చీవాట్లు కూడా పెట్టేవారు. ఎంతయినా తన స్వంత బిడ్డను చూచినట్టు చూస్తారా? అప్పుడప్పుడు అమ్మాయి కూడా చిందరవందరగా ఉండేది. ఆమె పరిస్థితిని జూసి, తల్లి ప్రేమకు నోచుకోలేని ఆ కోమలిని చేరదీసి ఆమె జుట్టు దువ్వి కోమని ముస్తాబు చేయించి బడికి తీసుకెళ్తుండేవాడు శేఖర్. ఇవన్నీ కేసుల గొడవల్లో ఉన్న జగన్నాథరావు పట్టించుకునేవాడు కాడు.

ఈ పరిస్థితి మూలాన శేఖర్ లతని తన స్వంత చెల్లెలిగా ప్రేమించేవాడు. తనకు తండ్రి లేడు. లతకు తల్లి లేదు.

లతను ఇంట్లో వాళ్ళ నాన్న మొదలుకొని అంతా ముద్దుతో చిట్టీ! అని పిలుస్తుండేవారు. లత శేఖర్‌ను ఆప్యాయంగా మాష్టారూ అని పిలిచేది. వాళ్ళిద్దరి హృదయాల్లో ప్రేమ నిండుగా పొంగిపొర్లేది. వాళ్ళ సంభాషణల్లో ఆప్యాయత అనురాగం జనించేవి. ఒకరు లేనిదే ఒకరు ఉండలేకపోయేవారు.

మేమిద్దరం అన్నాచెల్లెలయి పుడితే ఎంత బావుండేది. అది మనస్సులో అనుకుంటుంటాడు శేఖర్. ఇదంతా



ఆలోచనల్లో సుడులు త్రిప్పుకుంటాడు.

* * *

తన సన్నని టెర్లీన్ చీర దులుపు కుంటూ శేఖర్ అని పలుకరించింది సరోజ. కలలో ఉలిక్కిపడ్డట్టుగా "ఆ'' అంటూ గతంలోంచి వర్తమానంలోకి వస్తూ ఆమె వంక చూసాడు శేఖర్.

"మనమిద్దరం"

"ఆ.. మనమిద్దరం''

"ఎక్కడున్నాం''

మసకమసకగా చీకటిపడుతోంది. సూర్యుడు తన ప్రయాణాన్ని చాలిస్తు న్నాడు. పడమటి కొండలు భానునికి స్వాగతమిస్తున్నాయి. వాటి స్వాగతాన్ని అందుకుంటూ సాగిపోతున్నాడు సూర్యుడు.

చంద్రుని ప్రతిరూపం నీటి కెరటాలపై పరుచుకుంటున్నది.

పిట్ట కీచుమనడంలేదు. ప్రకృతంతా ప్రశాంతంగా నిద్రపోతున్నది. ఆ ప్రసన్న దీపం వెల్తుర్లో శేఖర్, సరోజలు మెరిసిపోతున్నారు.

సరోజ లేచి నిలబడింది. శేఖర్ సరోజ దగ్గరకు చిన్నగా ఇసుకను చూసుకుంటూ జరిగాడు. సరోజ చేయినందుకుని తనూ లేచి నిలబడ్డాడు. ఇద్దరూ లేచి నిలబడ్డారు. ఇద్దరూ ఒకరి ముఖాలొకరు బాగా చూసుకున్నారు.

అక్కడ పరిసరాల్లో చెట్లు, గుట్టలు, తరంగాల హోరు, ఆకాశం, నక్షత్రాలు, ప్రకృతి తప్ప ఏ ఇతర మానవమాత్రు లెవరూ లేరు. చందమామకు నవ్వొస్తున్నట్లుగా వుంది కాబోలు. ఆ ఇద్దర్నీ చూడలేక మబ్బుల చాటున దాక్కున్నాడు.

ఇద్దరి హృదయాల్లోని అంతరాత్మలు, పవిత్ర ఆత్మలు తప్పని లీలగా ఘోషిస్తున్నవి. ఆవేశంలో తెలియక వాళ్ళ పవిత్రప్రేమ ముందుకు తోస్తుంది. ఇద్దరికి "యుక్తాయుక్త పరిజ్ఞానం సున్న'' అయింది.

"శేఖర్ అందమేనా నీకు ప్రాధాన్యం'' అడిగింది సరోజ. "కాదు సరూ! అందం, రూపురేఖే కాదు, నీ ఆప్యాయత, ఆదరణ నీ పవిత్రప్రేమ నాలో ఇమిడిపోయినవి. నా హృదయంలో నీ వదనం ముద్రవేసు కుంది. నువ్వు నా మనసులో కూకటివేళ్ళతో నాటుకుపోయావు. మన హృదయాలు ఒక్కటైనవి. మనస్సులు ఏకమైనవి. నిన్ను విడిచి నేనుండలేను అని ఆమెదిక్కు తిరిగి భుజం మీద చేయివేసి దగ్గరకు తీసుకున్నాడు.

* * *

శేఖర్ రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్నాడు.

శేఖర్ ఇంటి దర్వాజా తీసిన శబ్దం విని లత వచ్చి "మాస్టారూ! నీకు సాయంత్రం ఒక ఉత్తరం వచ్చింది అని చేతిలో పెట్టి వెళ్ళిపోయింది.

ఉత్తరం విప్పి చదువుతున్న శేఖర్ కండ్లల్లో తల్లి రూపం కదలాడింది. "నా ఆరోగ్యం బాగాలేదు ఒకసారి వస్తావా నాయనా! వస్తావు కదూ!!''

ప్రేమతో....

- మీ అమ్మ (లక్ష్మి)

శేఖర్ తల గిర్రున తిరిగింది. అవును మా అమ్మకు ఇన్ని రోజులనుండి జాబు రాయకపోయానే అని మథనపడ్డాడు. సరే వెళ్ళాలి. అమ్మను చూసుకోవాలి. తన మనస్సంతా అమ్మమీదకే పరుగులు తొక్కింది. అమ్మ ఆరోగ్యం కుదుటపడాలి దేవా. అమ్మను చూచి మురవాలి. అమ్మ నాతోపాటు మురిసిపోవాలి.

* * *

కొన్ని రోజులు అమ్మ దగ్గరనే గడిపి, ఆమె ఆరోగ్యం కుదుటపడ్డాక ఊరుకు బయలుదేరాడు శేఖర్. బిరాబిరా ఇంటికి చేరాడు.

"మాస్టారు?''

"ఏం చిట్టీ''

"సరోజ ఈ వుత్తరం మీకిమ్మనది''

అని దాన్ని శేఖర్‌కు అందించింది లత. అతని చేతులు ఆతురతతో ఉత్తరాన్ని విప్పాయి. కళ్ళు ఆ ఉత్తరంలో ఉన్న కన్నీటి ముత్యాల అక్షరాల బారుల గుండా పరుగిడసాగినవి.

ప్రియమైన మీకు,

ఆఖరిసారిగా నా అమృత దివ్యాంజలులు.

శేఖర్ నా మనసులోని ఆశలన్నీ మసి అయిపోయినవి. నేను నిర్మించిన ఆశాసౌధము కూలిపోయింది. ఏవేవో కలలు కన్నాను. కలలన్నీ కల్లలు అని తేలిపోయినవి. మీతో ఇక దాంపత్యానికి నోచుకోను. నిన్నే దైవంగా భావించు కున్నాను. మీరే నా సర్వస్వం అనుకున్నాను. నా శరీరంలోని ప్రతి అణువు మీది. భౌతికంగా మీకు దూరమైతున్న. నీవు నేను ఏకమైనాము. హృదయాలు ఒక్కటైనవి. పున్నమి చంద్రుని వెలుతురు సాక్షిగా ఒక్కటైన మన జీవితంలో అమావాస్య చీకట్లు అలుముకున్నాయి.

మా నాన్నను శాయశక్తుల ఒప్పించుటకు ప్రయత్నించాను. కాని మా నాన్న మొండిపట్టు పట్టాడు. ప్రతి విషయంలోనూ స్వేచ్ఛనిచ్చిన అతను మన పెళ్ళికి మాత్రం ఒప్పుకోలేదు. పూర్తిగా కఠినపాషాణంగా మారాడు. ఇంట్లోనుంచి వెళ్ళొద్దని శాసించాడు. పెళ్ళి మీతో జరగడానికి మాత్రం వీల్లేదన్నాడు. నీ మనసులో చెరగని ముద్ర వేసుకున్న నేను బ్రతికివుండి మీ కళ్ళముందు ఇంకొకరితో నా దాంపత్యం సాగించడమంటే గుండె బ్రద్దలవుతుంది. కాని జన్మజన్మలకీ నిన్నే దైవంగా ఎంచుకుని చిన్ననాడే దూరమైనా అమ్మను కలుసుకోబోతున్నందుకు సంతోషంగా వుంది. మీకు తీరని బాధ కలిగినందుకు నన్ను క్షమించండి. ఆఖరుసారిగా మీకు నమస్కరిస్తున్నాను.

శేఖర్ నేను సుమంగళిని. ఇక మీకు అదృశ్యంగా వుంటాను. మన జీవితంలో ఇదే నా ఆఖరి బాధాక్షర సమాహ్యాళి. కన్నీళ్ళతో మిమ్ము విడిపోతున్నా.

మీ
సరోజ...

*8 ప్రజామాత, 11 సెప్టెంబర్, 1966*
*8 మెతుకు కథలు కథాసంపుటి, 2016*
(సంపాదకులు : వేముగంటి మురళీకృష్ణ & డా॥ బెల్లంకొండ సంపత్‌కుమార్)

# బద్దెన లోకోక్తులు

**కవి బద్దెన**



చిరకాలంగా తెలుగు ప్రజల నాలుకల మీద నానుచూ వారి అంతశ్చేతనలో భాగంగా కరిగిపోయిన సుమతీ శతకము పద్యాలను, సరసమూ, సరళమూ, సామాన్యులకు సైతం సూటిగా, సులభంగా అర్థమయ్యే శైలిలో రాసిన గొప్ప పద్యకారుడు బద్దెన.

162 పద్యాలు గల మరో లఘుకృతి నీతిశాస్త్ర ముక్తావళి వీరి రచనే.

ఈయన కాకతీయ రాజ్యంలో ఒకచిన్న సామంతరాజు. సా.శ. 1260 ప్రాంతంలో జీవించి ఉంటారని భావిస్తున్నారు. తిక్కనకు శిష్యునిగా భావిస్తున్నారు.

కమలాసన, కవిబ్రహ్మ అను బిరుదులు కలవు. ఆయన లోకోక్తుల వంటి పద్యాలు మా పాఠకుల కోసం..

క. శ్రీవిభుడు గర్వితారి
క్ష్మావర దళనోపలబ్ధ జయలక్ష్మి సం
భావితుడు సుమతి శతకముఁ
గావించిన ప్రోడఁ గార్యకమలాసనుడన్

సుతుకడకును దనకూర్చిన
సతికడకును వేల్పుకడకు సద్గురు కడకున్
బతికడకు రిత్త చేతుల
మతిమంతుల కేగజనదు మహి బద్దెనృపా!

నయమన్నఁ బాలు ద్రావరు
భయమన్న నమేధ్యమైన భక్షింతురు నా
నయము భయంబుల లోపల
భయమే నయమండ్రు బుధులు బద్దె నరేంద్రా!

రిపుపొత్తు పాము పొత్తును
గపటుండగు విప్రుపొత్తు గడుసరి పొత్తున్
విపరీత భార్యపొత్తును
నెపమునఁదా విడువకున్న నేరము వచ్చున్

ఆయంబు వ్యయమునొడిచిన
శ్రీయగు సమమైన దళము చెడకుండు వ్యయం
బాయమున కధికమైనను
పాయదు పేదఱిమి సార్వభౌమునికైనన్

వ్యాసం

# తెలంగాణలో అధివిమర్శ

మెటా క్రిటిసిజం పరిధిని తెలిపిన వ్యాసం...



సి. హెచ్. లక్ష్మణ చక్రవర్తి
98497 14261

సాహిత్యవిమర్శను సిద్ధాంతం/ అన్వయం, వస్తువు/ శిల్పం, లక్షణం / లక్ష్యం, విషయం-విధానం అన్న రీతులలో విభజించుకున్నట్లే , సృజనాత్మక సాహిత్యం పై వచ్చిన సాహిత్య విమర్శ, సాహిత్య విమర్శపై వచ్చిన విమర్శ అని రెండు రీతులుగా కూడా చెప్పవచ్చు. తెలుగులో సాహిత్య విమర్శ ఎంత ఉంది అధి విమర్శ ఎంత ఉంది అన్న చర్చ కూడా ఉంది. సాహిత్య విమర్శే పెద్దగా లేదంటే అందులో సాహిత్య విమర్శను మూల్యాంకనం, పునర్ మూల్యాంకనం చేసే అధి విమర్శ గురించి చెప్పవలసిన పనిలేదు. సృజన ఎట్లా విమర్శకు గురి అయి రాటు తేలుతుందో విమర్శ కూడా అలా రాటు తేలాలి. సాహిత్య విమర్శ ఎదగడానికి అది కూడా ఒక మార్గం. పద్ధతి. తెలుగు సాహిత్య విమర్శలో 'అధివిమర్శ' విమర్శరీతులను, ప్రాచ్య పాశ్చాత్య ప్రభావాలను, విమర్శ లక్షణాలను చర్చించింది. తెలంగాణలోని సాహిత్య విమర్శలోనూ ఇదే రీతి కన్పిస్తుంది. దానిని చర్చించడమే ఈ వ్యాస పరిధి.

Meta అనే పదాన్ని సంబంధించిన/ అధిగమించిన అనే అర్థాలలో విశేషంగా చేర్చి ఉపయోగిస్తారు. ఇది గ్రీకు భాష పదం. Meta criticism అంటే విమర్శకు సంబంధించిన విమర్శ అని అర్థం. సాహిత్య విమర్శ పై విమర్శ, అధివిమర్శ అన్న మాటలను Meta criticism అన్నమాటకు సమానార్థకంగా ఉపయోగిస్తున్నారు. ఇక్కడ అధి విమర్శ అంటే సాహిత్య విమర్శపై విమర్శ అని అర్థం.

**అధివిమర్శ ప్రధానంగా నాలుగు రీతులుగా ప్రవర్తిస్తుంది.**

1) విమర్శకు సంబంధించిన పరిభాషల /నిర్వచనాల విశ్లేషణల సారమే మెటాక్రిటిసిజం.

2) విమర్శకు సంబంధించిన విధానాల పూర్వ సిద్ధాంతాల విమర్శనాత్మక పరిశీలనమే మెటాక్రిటిసిజం

3) ఒక సాధారణ విమర్శను గాని ఒక ప్రత్యేక విమర్శ విధానాన్ని కానీ పరిశీలించడం మెటాక్రిటిసిజం

4) విమర్శను విమర్శించడం/ విమర్శకులను అధ్యయనం చేయడం. కాగా విమర్శన మార్గాల అధ్యయనాన్ని మనం అధివిమర్శ అంటున్నాం. ఈ పై రీతులు అధి విమర్శలో కనిపిస్తాయి.

సమస్త సాహిత్య సిద్ధాంతాలను, సమస్యలను ఇందులో చర్చిస్తారు. సాహిత్యగ్రంథాలను, సాంస్కృతిక కళా రూపాలను విలువ కట్టే ప్రామాణిక గ్రంథాలను విమర్శించే విధానాలను, పాఠ్యాన్ని వివరించే మార్గాలను సిద్ధాంతాలను 'అధి విమర్శ' మార్గం పరిశీలిస్తుంది.

సాహిత్యాన్ని సాహిత్య విలువలతో పరిశీలించడం అంతరంగ విమర్శ అనీ, సాహిత్యేతర విలువలతో విలువ కట్టడం అధివిమర్శ అనీ, సాహిత్య సృజనలోనూ విమర్శ ఉంటుందని దాన్ని చర్చించడం అధివిమర్శ అంటారని మరో అభిప్రాయం కూడా ఉంది. ఇలా ఏది అధివిమర్శ అన్న విషయంలో ఒకటి రెండు అభిప్రాయాలు ఉన్నా స్థూలంగా సాహిత్య విమర్శ పై విమర్శ అధివిమర్శ అని చెప్పవచ్చు. ఇంగ్లీషులో Meta Drama, Meta Novel, వంటి మాటలు నవలను గురించిన నవల, నాటకం గురించిన నాటకం అన్న

**సాహిత్యాన్ని సాహిత్య విలువలతో పరిశీలించడం అంతరంగ విమర్శ అనీ, సాహిత్యేతర విలువలతో విలువ కట్టడం అధివిమర్శ అనీ, సాహిత్య సృజనలోనూ విమర్శ ఉంటుందని దాన్ని చర్చించడం అధివిమర్శ అంటారని మరో అభిప్రాయం కూడా ఉంది. ఇలా ఏది అధివిమర్శ అన్న విషయంలో ఒకటి రెండు అభిప్రాయాలు ఉన్నా స్థూలంగా సాహిత్య విమర్శ పై విమర్శ అధివిమర్శ అని చెప్పవచ్చు.**

వ్యాసం

అర్థాలలో ఉపయోగిస్తున్నారు. అదే రీతిని Meta criticism అన్న దానికి అన్వయించుకుని సాహిత్య విమర్శ పై విమర్శ అని అర్థం చేసుకోవడం సమంజసమైనది.

1

సృజనాత్మక సాహిత్యాన్ని విమర్శించడానికి సాహిత్య విమర్శకులు కొన్ని భావనలను/ రీతులను ప్రతిపాదిస్తారు. అది ఆ భావనను సైద్ధాంతికంగా నిరూపించే రీతిలోనో, ఒక రచనను విమర్శకు ఎన్నుకుని చర్చిస్తున్న సందర్భంలోనో జరగవచ్చు. ఆ పరిభాషను నిర్వచించి దాన్ని ఒక భావనగా నిలబెడుతూ, సాహిత్య విమర్శ సూత్రంగా దానిని ప్రతిపాదించడం ఈ రీతిలో కనిపిస్తుంది.

ఆధునికాంతరవాదం గురించి సీతారాం (విఘటన వాదం) కె.కె.ఆర్. పుట్టుకలోనే మరణం ఉన్న సిద్ధాంతం, వేణుగోపాల్ పోస్ట్ మాడర్నిజం, నవీన్ పోస్ట్ మాడర్నిజం అవగాహన వంటి వ్యాసాలు రచించారు. నవీన్ చైతన్య స్రవంతి, నందిని సిధారెడ్డి అనుభూతివాదం వంటి విమర్శరీతులను వాదాలను పరిచయం చేస్తూ రచించిన వ్యాసాలు ఈ పరిధిలోకి చేరుతాయి. ముదిగొండ వీరభద్రయ్య 'సూత్రం అన్వయం' అన్న గ్రంథంలో భావచిత్రం ప్రతీక ఎలెగొరీ (అంతరార్థ కథనం, రహస్య కథన సంప్రదాయం) వంటి సాహిత్య భావనలను వాటి లక్షణాలను సూత్రాన్వయ పద్ధతిలో చర్చించి మన ముందుంచారు. నందిని సిధారెడ్డి వాస్తవికత - అధి 'వాస్తవికత' అన్న సిద్ధాంత గ్రంథం, ముదిగొండ వీరభద్రయ్య 'విమర్శ మౌలిక లక్షణాలు', 'కళాతత్వశాస్త్ర పరిచయం' ఇటువంటి ధోరణికి చెందినవే.

**కోవెల సంపత్కుమారాచార్య ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ -సాంప్రదాయిక రీతి అన్న సిద్ధాంత గ్రంథం ఈ పద్ధతిలో వచ్చినదే. ఆలంకారిక దృక్పథం లేదా రస సిద్ధాంతం ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో కొనసాగిన రీతిని ఒక పది మంది విమర్శకుల విమర్శ రచనల ఆధారంగా చర్చించారు. 'దేశేయత 'సాహిత్య విమర్శ పరికరంగా ఉండవలసిన రీతిని వివరించారు. 'ఆలంకారిక విమర్శ' అన్న ఒక విమర్శ విధానాన్ని అది తెలుగులో ఎదిగిన రీతిని చర్చిస్తూ వ్యాసాలు రచించారు.**

2

సాహిత్య విమర్శరీతులను భావనలను అర్థం చేసుకోవడం, అర్థం చేయించడం ఒక పద్ధతి అయితే పూర్వ సిద్ధాంతాలను, భావనలను (అవి ప్రాచ్య పాశ్చాత్య రీతులు ఏవైనా) చర్చించడం అధివిమర్శలో మరోరీతి. ముదిగొండ వీరభద్రయ్య 'అనువర్తిత విమర్శ విలువల నిర్ణయం' అన్న గ్రంథంలో అనువర్తిత విమర్శ లక్షణాలను తెల్పి ధ్వని, వక్రోక్తి, అలంకారం వంటివి ఆధునిక సాహిత్యానికి ఎట్లా అన్వయించవచ్చునో చెప్పారు. ఇందులో ఆయా అలంకారిక సిద్ధాంతాలను ఆధునిక దృష్టితో వివరించడం కనిపిస్తుంది. ఒక సాహిత్య, సాహిత్యేతర విమర్శ భావనను ఒక రచనకు అన్వయించి చర్చించే క్రమంలో ఆ పూర్వ సిద్ధాంతాన్ని తన కాలపు దృష్టితో చర్చిస్తాడు. ఆ పూర్వ సిద్ధాంతాన్ని గురించి తన కాలం వరకు జరిగిన చర్చోపచర్చలను, ఆ సిద్ధాంత వికాసాన్ని వివరిస్తాడు. కే. రాజన్న శాస్త్రి 'ధ్వని మను చరిత్రము', ముకురాల రామారెడ్డి 'తెలుగు కవుల కవిత్వాదర్శాలు' వంటి సిద్ధాంత గ్రంథాలు ఈ రీతిలో వచ్చాయి. కోవెల సుప్రసన్నాచార్య 'ప్రాగ్రూపాలు', 'ఎలెగొరీ', అలంకారిక సిద్ధాంతాలను, భావనలను చర్చిస్తూనే వాటి మౌలికతను వివరించే వ్యాసాలను రచించారు.

3

సాహిత్య విమర్శకుడు సిద్ధాంతాలను భావనల అర్థం చేయించడం అన్వయించడంతో బాటు ఏదైనా ఒక విమర్శ విధానాన్ని, దాని వికాసాన్ని పరిశీలించడం కూడా చేస్తుంటాడు. చేకూరి రామారావు వ్రాసిన 'ప్రాచీన కావ్యాల్లో విమర్శ', 'మార్క్సు సాహిత్య విమర్శకు పరిమితులున్నాయా' వంటి వ్యాసాలు ఒక విమర్శ విధానాన్ని చర్చించేవి. కోవెల సంపత్కుమారాచార్య ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ -సాంప్రదాయిక రీతి అన్న సిద్ధాంత గ్రంథం ఈ పద్ధతిలో వచ్చినదే. ఆలంకారిక దృక్పథం లేదా రస సిద్ధాంతం ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో కొనసాగిన రీతిని ఒక పది మంది విమర్శకుల విమర్శ రచనల ఆధారంగా చర్చించారు. 'దేశీయత' సాహిత్య విమర్శ పరికరంగా ఉండవలసిన రీతిని వివరించారు. 'ఆలంకారిక విమర్శ' అన్న ఒక విమర్శ విధానాన్ని అది తెలుగులో ఎదిగిన రీతిని చర్చిస్తూ వ్యాసాలు రచించారు. పిల్లల మర్రి రాములు 'తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ' అన్న ఎంఫిల్ సిద్ధాంతగ్రంథమూ ఇటువంటిదే. జి. బాలశ్రీనివాసమూర్తి 'సమకాలీన వాదాలు - సాహిత్య విమర్శ' అన్న రచనలో స్త్రీ, దళిత, ప్రాంతీయ వాదాల స్వరూప స్వభావాలను సాహిత్యవిమర్శ రంగంలో ఆయా వాదాల పరిణామ వికాసాలను చర్చించారు. పసునూరి రవీందర్ ప్రపంచీకరణ సాహిత్య విమర్శను

**ఒక సాహిత్య, సాహిత్యేతర విమర్శ భావనను ఒక రచనకు అన్వయించి చర్చించే క్రమంలో ఆ పూర్వ సిద్ధాంతాన్ని తన కాలపు దృష్టితో చర్చిస్తాడు. ఆ పూర్వ సిద్ధాంతాన్ని గురించి తన కాలం వరకు జరిగిన చర్చోపచర్చలను, ఆ సిద్ధాంత వికాసాన్ని వివరిస్తాడు. కే. రాజన్న శాస్త్రి 'ధ్వని మను చరిత్రము', ముకురాల రామారెడ్డి 'తెలుగు కవుల కవిత్వాదర్శాలు' వంటి సిద్ధాంత గ్రంథాలు ఈ రీతిలో వచ్చాయి.**

వ్యాసం

అధ్యయనం చేస్తూ ఎంఫిల్ సాధించారు.
ఎస్వీ రామారావు తెలుగులో 'సాహిత్య విమర్శ వికాసం' సిద్ధాంత గ్రంథం, కాత్యాయనీ విద్మహే స్త్రీవాద సాహిత్య విమర్శ రీతులు - పరిణామ వికాసాలను చర్చించిన వ్యాసాలూ, ఎన్. వేణుగోపాల్ విప్లవ సాహిత్య విమర్శ గురించి చేసిన రచనలు, కె.కె.ఆర్. 'ఆధునిక సాహిత్య విమర్శలో ఆత్మాశ్రయ భావవాద ధోరణులు' వంటివి ఈ రీతిలో వచ్చిన వ్యాసాలు, పుస్తకాలు. ఇవి ప్రధానంగా ఆయా విమర్శల వికాసాన్ని వాటి మంచి చెడులను మన ముందు నిలుపుతాయి. సంగిశెట్టి శ్రీనివాస్, లక్ష్మణ చక్రవర్తి తెలంగాణ సాహిత్య విమర్శ పై వ్రాసినవి ఈ కోవలోకే వస్తాయి.

4

సాహిత్య విమర్శ భావనలను, వాటి పరిణామ వికాసాలను, అనువర్తిత రీతులను చర్చించడం అధివిమర్శ అయినట్లే విమర్శకులను /విమర్శను అధ్యయనం చేయడం కూడా అధివిమర్శ మార్గంలోకే వస్తుంది. ఈ పద్ధతిలో చాలా పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథాలు కనిపిస్తాయి. కొల్లు వెంకటేశ్వరరావు 'విమర్శకుడిగా కెవి రమణారెడ్డి', వెంకటరమణ 'విమర్శకుడిగా చేరా' వంటివి ఈ రీతిలో కనిపించేవే. ముదిగొండ వీరభద్రయ్య 'నవల -నవలా విమర్శకులు', మూసీ పత్రికలో నిర్వహించిన 'ఈ తరం విమర్శకులు' శీర్షిక, అనుమాండ్ల భూమయ్య 'ఆద్యుడు కట్టమంచి'లో కట్టమంచి సాహిత్య విమర్శపై చేసిన చర్చ, ఎస్వీ రామారావు 'విమర్శక వతంసులు', మరికొందరు విమర్శకులపై వ్రాసిన వ్యాసాలు ఈ పద్ధతి అధివిమర్శలో చేరుతాయి. ముదిగొండ వీరభద్రయ్య విశ్వనాథ, జీవియస్, కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారచార్యలపై వ్రాసిన పుస్తకాలు, కోవెల సంపత్‌కుమారాచార్య శేషేంద్ర, విశ్వనాథ, శ్రీ శ్రీ, జీవియస్, చేరా వంటి విమర్శకులపై వ్రాసిన వ్యాసాలు ఈ ధోరణిలో వచ్చినవే. లక్ష్మణ చక్రవర్తి, చేరా, డి. చంద్రశేఖర రెడ్డి, దేవులపల్లి రామానుజ రావు, కోవెల సంపత్కుమార, అద్దేపల్లి రామమోహన రావు, నవీన్, సిధారెడ్డి, సీతారాం వంటి విమర్శకులపై వ్రాసిన వ్యాసాలు, సంగిశెట్టి శ్రీనివాస్ కె గోపాలకృష్ణారావు వంటి వారిపై వ్రాసినవి ఈ కోవలోనే చేరుతాయి. ఇంతకు ముందే చెప్పినట్లు ఈ పద్ధతిలో అధి విమర్శ మార్గం విస్తృతంగానే పయనించింది. కాత్యాయనీ విద్మహే పాములపర్తి సదాశివరావు, వరవరరావు, రంగనాయకమ్మల విమర్శ రచనలను గూర్చి వ్యాసాలను రచించారు.

విమర్శకులను విమర్శించినట్లుగానే విమర్శను విమర్శించటము అధివిమర్శనే అవుతుంది. విమర్శను విమర్శించడం ఒక్కోసారి వాదోపవాదాల రూపంలో

**విమర్శకులను విమర్శించి నట్లుగానే విమర్శను విమర్శించటము అధివిమర్శనే అవుతుంది. విమర్శను విమర్శించడం ఒక్కోసారి వాదోపవాదాల రూపంలో చర్చోపచర్చల రూపంలో ఉండవచ్చు. ఇంకోసారి ఆ విమర్శను సమీక్షించే దృష్టితో ఉండవచ్చు. సురవరం ప్రతాపరెడ్డి రచించిన వ్యాసాలలో కొంత ఈ దృష్టి కనిపిస్తుంది. కర్తృత్వ చర్చలు, కాల నిర్ణయ చర్చలు, ప్రాంత చర్చలు ఈ పరిధిలోవి కావు.**

చర్చోపచర్చల రూపంలో ఉండవచ్చు. ఇంకోసారి ఆ విమర్శను సమీక్షించే దృష్టితో ఉండవచ్చు. సురవరం ప్రతాపరెడ్డి రచించిన వ్యాసాలలో కొంత ఈ దృష్టి కనిపిస్తుంది. కర్తృత్వ చర్చలు, కాల నిర్ణయ చర్చలు, ప్రాంత చర్చలు ఈ పరిధిలోవి కావు. అవి సాహిత్య చరిత్రకు సంబంధించినవి. ఒక పదం విషయంలో, ప్రక్రియ విషయంలో, భావన విషయంలో, ఇద్దరు సాహిత్య విమర్శకుల మధ్య జరిగే సాహిత్య విమర్శ వివాదం ఈ పద్ధతిలోకి వస్తుంది. చేకూరి రామారావు, కోవెల సంపత్కుమారచార్య వచన కవిత్వం- లక్షణ చర్చ ప్రక్రియ విషయంలో దాని లక్షణ వివేచన సందర్భంలో జరిగిన చర్చ అంతా అధి విమర్శ పద్ధతికి సంబంధించిందే. దళిత వాదం, స్త్రీ వాదం విషయంలో జరిగిన వాద ప్రతివాదాలు, వివాదాలు, జ్వాలాముఖి, ఎస్వీ సత్యనారాయణ వంటి వారు చేసిన చర్చలు ఇందులో భాగమే.

లక్ష్మణ చక్రవర్తి 'తెలుగు సాహిత్య విమర్శ - తెలంగాణ తోవ' అన్న వ్యాసం పై దక్కన్ ల్యాండ్ పత్రికలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి వ్రాసిన వ్యాసాలు ఈ పద్ధతిలో చేరేవే. చేరా, కోవెల ద్వయం, మరికొందరు విమర్శకులు వివిధ వ్యాస సంకలనాలకు, వ్యాస సంపుటులకు వ్రాసిన పీఠికలు, ముందుమాటలు ఈ అధివిమర్శ పరిధిలోకే చేరుతాయి.

ఈ పై పద్ధతులలోకి చేరని 'అధి విమర్శ' రీతి కూడా ఒకటి ఉంది. తన రచనలను తానే వ్యాఖ్యానించుకునే 'స్వీయరచనా విమర్శ'. విశ్వనాథ సత్యనారాయణ 'కల్పవృక్ష రహస్యములు' పద్ధతి అంత విస్తృతం కాకపోయినా సినారె "పాటలో ఏముంది నా మాటలో ఏముంది'' అన్న రెండు భాగాలు స్వీయ కవితా రీతిని సమీక్షించే జ్ఞాపకాల దొంతర. ఒక సినిమా పాట నేపథ్యం, సందర్భం, అందులో కొన్ని పదాల ప్రయోగానికి గల కారణాలు పదౌచిత్యం, ఆ పాట తనకు ఇచ్చిన సంతృప్తి వంటి అంశాలను ఈ రచన వివరిస్తుంది.

సృజనాత్మక సాహిత్యాన్ని విమర్శించడానికి అవసరమైన పరికరాలను అందించడం ఆయా భావనల స్వరూప స్వభావాలను వివరించడం, వాటి పరిణామ వికాసాలను, అర్థం చేయించడం, ఆయా విమర్శ మార్గాల అన్వయ రీతిని వివరించడం వంటి రీతులలో తెలంగాణలో అధివిమర్శ రీతి కొనసాగింది. దాని మూల్యాంకనం, పునర్మూల్యాంకనమూ జరగవలసి ఉంది.

కవిత



# వెయ్యి ఉరుల మర్రి!



కరిపె రాజ్ కుమార్, 81251 44729

అమ్మ పాలు తాగి
రొమ్ము గుద్దిన చందాన
వ్యాపారం సాకుతో
వలస వచ్చిన విదేశీయులు
బంగారు పిచ్చుకను
పంజరాన బంధించిరి!

స్వదేశీ సంస్థానాధీశులను
నిస్సంతులనే సాకుతో
దత్తతలను నిరాకరించి
సామదానభేద దండోపాయాలతో
రాజ్యాలను చెరపట్టిరి
ప్రజలను లూటీ చేయతలపెట్టిరి!

పాలితుల అష్టకష్టాలను భరించలేని
సౌభ్రాతృత్వ పాలకులు
సిపాయిల సహకారంతో
తిరుగుబాటు తలపెట్టిరి
ఝాన్సీ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో
తాంతియాతోపే తదితరులు
ఆంగ్లేయులను అదిమిపట్టిరి!
ఆధునిక ఆయుధాల తాబేదారులు
గెలుపు వైపు మొగ్గుచూపిరి!!

అయినను వెనుదీయక
తెలంగాణ ప్రాంతంలో రోహిల్లాలు గోండులు
ఆంగ్లేయ నిజాము సైన్యాలను
ముప్పుతిప్పలు పెట్టి
మూడు చెరువుల నీళ్లు తాగించిరి!

బళ్ళారి ఇన్ ఫాంట్రీ
నిజాము సైనికుల నీడన నిలువగ
కుట్రలు కుయుక్తులు పన్ని
హాజీని రాంజీ గోండును
మరి వెయ్యి మంది వీరులను
మర్రిచెట్టుకు వేలాడదీసి
విగతజీవులను చేసిరి!

అమరులారా! మీ బలిదానం
వృథాకాలేదు!!
అమరులారా! మీ త్యాగం
వృథా పోలేదు!! చూడు
తెలంగాణ జెండా స్వేచ్ఛాగతమై
జాతి సమైక్యతా నినాదంతో
వజ్రోత్సవ సంబరాలను
వైభవంగా జరుపుకొంటున్నది నేడు!!

*(వెయ్యి ఉరుల మర్రి నేటికీ నిర్మల్ పట్టణానికి సమీపంలో ఉనికిలో ఉంది)*

కథ

# కొత్త చిగురు

మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న వైనాన్ని చిత్రించిన కథ...



పెరుమాళ్ళ ఆనంద్
99853 89506

"ఓ దేవుడా! ఎంత అన్యాయం చేసినవు? నీకు న్యాయమెట్ల అవుతది. నీకు నేనే దొరికిన్నా" అంటూ గుండెలు బాదుకుంటూ చంద్రకళ వేగంగా వాళ్ల పొలంకెళ్ళి పరుగులు పెడుతున్నది.

పక్క పొలమాయిన వచ్చి పెద్దులు పురుగుల మందు తాగిండని చెప్పిండు.

"అయ్యో... ఎంత ఘోరం జరిగింది దేవుడా! నన్ను పగబట్టినవా..! ఓ భగవంతుడా! ఇట్లెందుకు చేసినవ్ నన్ను" అంటూ ఆగకుండా రోదిస్తున్నది.

ఎదురొమ్ములు గుద్దుకుంటూ, నోరు సర్పుకుంటు గబగబ ఉరుకుతున్నది. చంద్రకళ అక్కడికి వెళ్ళంగనే పెద్దులు పొలం గట్టుమీద గిలగిల కొట్టుకుంటున్నడు. కడుపులో పేగులు కాలిపోతున్నయేమో సుడులు తిరుగుతున్నడు.

ఊళ్ళో ఉన్న ఆర్ఎంపీ వచ్చి చూసి సూర్యాపేటకు తీసుకపోవాలని చెప్పిండు. రోడ్డు పక్కనున్న ఆటోను పిలిచి వెంటనే హాస్పటల్ తీసుకెళ్లాలని అందరు చెప్పింద్రు.

సూర్యాపేట దావఖానలో కొంత చికిత్స జరిగింది. కానీ హైద్రాబాద్ తీసుకపోతేనే మంచిదని అక్కడి డాక్టర్లు సలహా ఇచ్చారు. వెంటనే అంబులెన్స్ మాట్లాడుకున్నరు. చంద్రకళ వేయి దేవుళ్ళను మొక్కుకున్నది.

నా భర్త మంచిగా ఉండాలె దేవుడా.... అంటూ మనసులోనే పూజలు చేసుకుంది.

హాస్పిటల్ చేరుకున్నరు. అంబులెన్స్ నుంచి మెల్లగా దించి స్ట్రెచర్‌పై పడుకోబెట్టారు. డాక్టర్లు అంతా చెక్అప్ చేసి రెండు లక్షల రూపాయలు అవుతాయని, ఇప్పుడు మాత్రం యాభై వేల రూపాయలు ముందుగా చెల్లించాలని, అట్లయితెనే ట్రీట్మెంట్ స్టార్ట్ చేస్తామని చెప్పంగనే ఏం చేయాలో చంద్రకళకు అర్థం కావట్లేదు. సరే అని ఒప్పుకుంది.

వాళ్ల చెల్లె ఇందిరకు ఫోన్ చేసింది.

"హలో అక్క బాగున్నారా.......?" అంది.

"లేదు చెల్లె మీ బావ పురుగుల మందు తాగిండు" యశోద హాస్పిటల్‌కు తీసుకొచ్చినం.

అయ్యో...! అంతపని చేసిండా బావ.

ఆఁ... గట్ల చేసిండు మీ బావ. ఏం చెయ్యను... యాభై వేల రూపాయలు జల్దీగా కావాలె చెల్లె ముందుగా ఇస్తేనే హాస్పటల్లో శెరీక చేసుకుంటరట. తొందరగ రావే ఇందిర. మీ బావ సచ్చిపోతడే అంది.

"నా దగ్గర డబ్బులు లేవక్క" ఉన్న డబ్బులతోని ఈ మధ్యనే భూమి కొన్న అక్క.

"అది కాదే చెల్లె, నేను ఒట్టి చేతులతోనే ఆదలబాదల వచ్చిన మీ బావను ఎట్లయిన బతికించుకోవాల్నే" అంది.

నేను మీటింగ్‌లో ఉన్నాను అక్క మళ్లీ తర్వాత ఫోన్ చేస్తానని పెట్టేసింది.

చంద్రకళ కళ్ళలో కన్నీళ్ళు ఆగట్లేదు. దుఃఖం పొంగుకొస్తుంది. ఏం చేయాలో అర్థం కావట్లేదు. పెద్దులు స్పృహలో లేడు. ఎలాగైనా తన భర్త ప్రాణాలను కాపాడుకోవాలని చంద్రకళ ఆరాటపడుతుంది.

కానీ, అంతా అయోమయంగా ఉంది ఆమెకు. ఆలోచించాక వాళ్ల ఊళ్లోనే నారాయణ సేటు గుర్తొచ్చిండు. నెంబర్ సంపాయించి వెంటనే ఫోన్ చేసింది.

ఫోన్ ఆగకుండా చేస్తూనే ఉంది. కొత్త నెంబర్ కావడంతో లిఫ్ట్ చేయడం లేదు. చంద్రకళలో టెన్షన్ పెరుగుతోంది. మూడోసారికి లిఫ్ట్ చేయంగనే ప్రాణం వచ్చినంత పనైంది.

కొత్త నెంబర్ కావడంతో హలో ఎవరండీ? అనగానే... "నేను నారాయణ సేటు పెద్దులు భార్యను. నా పేరు చంద్రకళ"

ఏందే చంద్రకళ? ఎన్నడు లేంది ఫోన్ చేసినవు. ఏం లేదు సేటు మా ఆయనను హాస్పటల్‌కు తీసుకొచ్చినం. మందు తాగిండు. చావుబతుకుల మధ్య ఉన్నడు సేటు. యాభై వేల రూపాయలు అర్జెంటుగా కావాలే.

నీ కాళ్ళు మొక్కుతనయ్యా మా మీద

కథ

కొద్దిగ దయుంచి పంపండి సేటు. నీకు పుణ్యం ఉంటది. నీ అప్పు ఏం ఎగ్గొట్టం అయ్యా.

కాదే చంద్రకళ ఇది వరకే మీ చెల్లె పెళ్లికని రెండు లక్షల అప్పు చేసినరు. గప్పుడెప్పుడో వడ్డీ డబ్బులు మీ ఆయన ఇచ్చిండు. అసలు అట్లనే ఉంది. ఈ ఆరు నెలల నుంచి మిత్తి పెరుగుతనే ఉంది. అది తీర్చకుండనే ఎట్ల ఇయ్యాలనే? నువ్వే చెప్పు.

"ఆయన ప్రాణం పోయేటట్టుంది సేటు" మా చెల్క అమ్మి అప్పంతా తీర్చుతంగని ఇప్పుడైతే జర పంపు నాయనా.

పెద్దులు కుటుంబం మాట తప్పని మంచి మనుషులని అనుకొని ఒకసారి ఆలోచించిండు.

"సరెనే చంద్రకళ పంపిస్తానులే" అని యాభై వేలు ఫోన్ పే ద్వారా పంపించిండు.

హాస్పిటల్ వాళ్ళు డబ్బు అందగానే ట్రీట్మెంట్ స్టార్ట్ చేశారు.

"చంద్రకళ వాళ్ల ఊరికెల్లి ఎకరం చెల్క అమ్మింది" వచ్చిన డబ్బుతో హాస్పటల్లో డబ్బు కట్టి భర్తను డిశ్చార్జ్ చేయించుకుని తీసుకెళ్ళింది.

ఇందిర మధ్యలో ఒక రోజు వచ్చి చూసి వెళ్ళింది అంతే.

* * *

చెల్క అమ్మిన డబ్బులతో హాస్పిటల్ ఖర్చులు, ఇందిర పెళ్లికి చేసిన అప్పు పంట పెట్టుబడికి చేసిన అప్పు అన్నీ తీర్చేశారు.

"ఇంకొక్క ఎకరమే మిగిలింది"

రేణుక వాళ్ళ నాన్న ఎలా ఉన్నాడో అని పిల్లలను తీసుకుని వచ్చింది.

"వాళ్ళ నాన్నను చూసి దుఃఖం ఆపుకోలేకపోయింది"

"ఏంది నాయిన గిట్ల చేసినవు మేమందరం గుర్తుకు రాలేదా?"

ఏం చెయ్యను బిడ్డ పత్తి చేనేస్తే ఈ వర్షాలకు అంతా మునిగిపోయింది. పెట్టుబడి కూడా రావట్లేదు. మీ పిన్ని ఇందిర పెళ్లికి చేసిన అప్పుకు వడ్డీలే కడుతున్నం. అసలు అట్లనే ఉంటుంది బిడ్డా.

చంద్రకళ ఊళ్లోకి పోయి అప్పుడే వచ్చింది. తల్లీబిడ్డలు ఒకర్నొకరు పట్టుకుని ఏడ్చారు.



చంద్రకళ ఇది వరకే మీ చెల్లె పెళ్లికని రెండు లక్షల అప్పు చేసినరు. గప్పుడెప్పుడో వడ్డీ డబ్బులు మీ ఆయన ఇచ్చిండు. అసలు అట్లనే ఉంది. ఈ ఆరు నెలల నుంచి మిత్తి పెరుగుతనే ఉంది. అది తీర్చకుండనే ఎట్ల ఇయ్యాలనే? నువ్వే చెప్పు. "ఆయన ప్రాణం పోయేటట్టుంది సేటు" మా చెల్క అమ్మి అప్పంతా తీర్చుతంగని ఇప్పుడైతే జర పంపు నాయనా. పెద్దులు కుటుంబం మాట తప్పని మంచి మనుషులని అనుకొని ఒకసారి ఆలోచించిండు.

"అల్లుడు బాగున్నడానే రేణుక...?

ఆఁ... ఆయనకేమయింది. మంచిగనే ఉన్నడమ్మా. వాళ్ల పెద్దమ్మను హాస్పిటల్‌కు తీసుకు పోయినరు. రేపు వస్తనన్నడు.

రేణుక మీ పిన్ని చూడే ఒక రోజొచ్చింది. "ఒక్క పూట మాత్రం అన్నం తెచ్చింది." మల్ల ముఖం చూయించ లేదు.

మీరు పిన్నికి చెప్పకుండనే వచ్చినరంట కదమ్మా.

"దానికి ఇప్పుడు మనమంటే ఏం లెక్కనే".

"అమ్మమ్మ, తాత కన్నరు, భూమ్మీద వదిలిపోయిండ్రు." దాన్ని కూడా నిన్ను చూసినట్లే చూసుకున్నం కదా!

"పెండ్లి చేసి కాళ్లు కడిగి కన్యాదానం కూడా చేసినం" పెండ్లికి అప్పు కూడా చేస్తిమి. నీ పెళ్లికి మాత్రం అప్పు కాలేదు. ఇప్పుడు అవన్నీ దానికి గుర్తుంటే కదా! గడిచి గట్టెక్కింది. మాతో ఏం పని ఉంటది.

పట్నంలో ఇంకొక ఇల్లు కూడా కొన్నదట కదమ్మా....

ఇల్లేందే యాడనో భూమి కూడా కొని అక్కడ చిన్న ఇల్లు కట్టిందట.... !

ఇందిరకు ఏం తక్కువ ఆమ్దాన్ బాగొస్తది. ఇంటినిండా బంగారం, రెండు కార్లు. ఇప్పుడు దాని కండ్లకు మనం

కనబడతామే రేణుక.

"ఆమె ఇప్పుడు పెద్ద ఆఫీసరమ్మాయే"

"ఇందిర చదువు కోసం నీ జీవితాన్ని చేతులారా మేమే నాశనం చేసినం బిడ్డా....

"ఎంతైనా కడుపున పుట్టినోళ్లే కావాలే"

"కాదే రేణుక ఆమెనే ఫోన్ చేసి ఎప్పుడు పోతున్నరు అక్క, అని అడగొచ్చు గదా...!

"ఆ మాత్రం గౌరవం మా మీద లేకపాయె"

ఇంత విశ్వాసం లేని మనుషులు కూడా ఉంటారా...!

"లోకమంతా మారిపోతుంది"

నేను ఎక్కువ చదువుకోకపోయినా...

"ఇట్లాంటోళ్ల గురించి బాగా చదువుతున్న, ఇంకా ఎన్నెన్నో నేర్చుకుంటున్న వెనకటి యన్నీ మర్చిపోయిందేమో"

అంతా ఆ పైనున్నోడు చూస్తాడులె అనుకుంటూ చంద్రకళ ఆలోచనల్లో మునిగిపోయింది. మా సొంత బిడ్డకన్న ఎక్కువగా చూసుకున్నం. ఇందిరను బాగా చదివించాలని రేణుక చదువును ఆపేసినం "ఏ అప్పు లేకుండా పెళ్లి చేసినం. కానీ నా బిడ్డ జీవితాన్ని గిట్ల చేసుకుంటిమి"

* * *

పెద్దులు ఆరోగ్యం కాస్తంత మెరుగైంది. లేసి అటు ఇటు తిరుగుతున్నడు. మంచంలో కూర్చొని "రేణుక గిన్ని మంచి నీళ్లు తీసుకరామ్మా" అని, నీరసమైన గొంతుతో చెప్పాడు.

వంట చేయాలని కూరగాయలు కోస్తూ లేసి మంచినీళ్లు అందించింది రేణుక.

మీ పిన్ని ఇంటి మొకాన రాలేదమ్మా.

మాకు ఇద్దరు బిడ్డలు ఉన్నరను కున్నం. మమ్ములను ఇట్ల మర్చిపోతదని ఎప్పుడు అనుకోలేదు బిడ్డా.

మీ అమ్మ, నేను ఒక విధంగా నీకు అన్యాయమే చేసినం. ఎంత తప్పు చేశామో ఇప్పుడర్థమవుతుంది.

"ఏమొలేవె ఆయిన ఎవరి పాపాన ఆల్లే పోతరు. బతకనియ్యి బిడ్డ మన బతుకును నలుగురు మెచ్చుకోవాలె".

అమ్మా.. అమ్మా... టీవీలో వార్తలు సూడండి. పిన్ని లంచం తీసుకుంటుంటే ఏసీబీ వాళ్లు పట్టుకున్నరంట. ఇప్పుడే వార్తలు ఒస్తున్నయే....

దీని ఆశ పాడుగాను. ఇంటి నిండా బంగారం బంగ్లాలు భూములు అన్నీ ఉన్నయి.

"దురాశ అంటే ఇదే." పాడు కాలం ఒచ్చింది. మనుషుల్ని పీక్కు తినే కాలం ఇది.

ఇందిర అరెస్టయింది. ఆమె భర్త సున్నిత మనస్కుడు. ఏది తట్టుకోలేడు. హార్ట్ స్ట్రోక్ వచ్చింది. హాస్పిటల్ తీసుకెళ్లారు.

ఇందిర ఎంతైనా చెల్లె కదా! చంద్రకళ మనస్సు కరిగిపోయింది. పెంచిన ప్రేమ విడువలేక పోతుంది. కళ్ళెంట నీళ్లు కారుతూనే ఉన్నాయి.

తెల్లారి పయనమై హైదరాబాద్ వెళ్లి మర్దిని చూసి బోరున విలపించింది. కష్టాలు సుఖాలు ఎప్పుడూ ఒకే తీరుగా ఉండవని, కాలం అప్పుడప్పుడు పాఠాలు నేర్పుతుందని చంద్రకళకు అర్థమవుతుంది.

ఇందిర పిల్లలను చూసుకునే వాళ్ళు ఎవరూ లేకపోవడంతో ఇంటికి తీసుకొచ్చింది.

> **గత ప్రవర్తనకు ఇందిర పశ్చాత్తాపం తో కుమిలిపోతున్నది. అధికారం, డబ్బు నన్ను మనిషిగా ఉండ నివ్వలేదు. నేను ఎన్నో జీవిత చరిత్రలు చదివాను. కానీ ఎంత చదివినా ఏం ప్రయోజనం? ఏమీ నేర్చుకోలేకపోయాను. అక్క బావలు పెద్ద చదువులు చదువు కోలేదు. అయినా సాటి మనిషి బాధల్లో ఉన్నప్పుడు ఆదుకోవడమే. మనిషి జీవితానికి అర్థం ఉంటుంది కదా. నా ఇంట్లో ఏ దేవుని ఫోటో అవసరం లేదు.**

కొద్ది రోజుల తర్వాత ఇందిర బెయిల్‌పై బయటకొచ్చింది. వాళ్ల అక్క ఇంటికి రావాలంటే మొఖం చూపించా లంటే ఇబ్బందిగా ఉంది.

గత ప్రవర్తనకు ఇందిర పశ్చాత్తాపం తో కుమిలిపోతున్నది. అధికారం, డబ్బు నన్ను మనిషిగా ఉండనివ్వలేదు. నేను ఎన్నో జీవిత చరిత్రలు చదివాను. కానీ ఎంత చదివినా ఏం ప్రయోజనం? ఏమీ నేర్చుకోలేకపోయాను.

అక్కబావలు పెద్ద చదువులు చదువుకోలేదు. అయినా సాటి మనిషి బాధల్లో ఉన్నప్పుడు ఆదుకోవడమే.

మనిషి జీవితానికి అర్థం ఉంటుంది కదా. నా ఇంట్లో ఏ దేవుని ఫోటో అవసరం లేదు.

అక్క బావ ఫోటోలు ఉంటే చాలు.

ఇకనుంచి వాళ్ళే నాకు సర్వస్వము.

అక్క బావలకు తెలియకుండానే చెల్క అమ్మిన వ్యక్తి దగ్గరకు వెళ్లి ఆ డబ్బునంతా తానే ఇచ్చేసింది. ఆ పేపర్స్ తీసుకుని వచ్చి వాళ్ల చేతుల్లో పెట్టింది. ఇన్నాళ్లు నా చుట్టూ చీకటినే కప్పేసుకున్న. నాలో సూర్యోదయమయింది. ఇన్నాళ్లు డబ్బు, అధికారం నాలోని మనుషత్వాన్ని పీల్చేశాయి.

అక్క బావను మించిన ప్రపంచం నాకు మరొకటి లేదు. వాళ్ల జీవితాలు కొన్నివేల పుస్తకాలతో సమానం. మా పిల్లలను చదివి ఆచరించాలని చెబుతాను. ఎప్పటికైనా అందరికి ఆదర్శ జీవితమే.

నా రూట్స్ ఎక్కడున్నాయో. వాటిని నేను తెంపుకున్నాను. నేను పచ్చగాఎలా ఉండలేను కదా! నేను ఆకాశమంత ఎత్తుకు ఎదిగినా నా మూలాన్ని మర్చిపోకూడదు.

ఎండిపోతున్న చెట్టు తన వేర్లను సరిదిద్దుకోవడంతో మళ్లీ చిగురించడం ప్రారంభమైంది. జీవితంలో ఉండాల్సిన విలువల్ని ఇందిర ఇప్పుడు తెచ్చుకుంది.

"కాలం నేర్పిన పాఠం ఇది" ఇందిర లోని పాత ఆలోచనలన్నీ రాలిపోయాయి. వసంతకాలమోలే నూతన ఆలోచనల్తో చిగురించడం ఆరంభమైంది.

కథ

# ఆనంద తీరం!



రమేశ్ నల్లగొండ, 83084 5179

పొద్దు పొడుపుల్ని, పొడిచే అందాల్ని
చుక్కల్ని, దిక్కుల్ని అందాల ఆ ఆకాశాన్ని
విహరించే పక్షుల్ని, సీతాకోక చిలుకల్ని వాటి విన్యాసాల్ని
తోటల్లోని రంగురంగుల పువ్వుల్ని, వాటి పసినవ్వుల్ని
దుమికే జలపాతాల్ని, గలగలపారే సెలయేళ్ళని, అలల్ని
లేత ఎండల్ని, కొండల్ని, వాటిమీది మంచు రాశుల్ని
వంపుల దారుల్ని, దారివార చెట్ల సొబగుల్ని
చూడడం మరిచిపోతున్నాడు మనిషి

తలలో అక్కెరకురాని టన్నుల ఆవేశం
తొంగిచూసే దిగులు దిగుడు బావులు
నిరాశలఎడారి ఎండమావులు
ఒంటరితనపు ఆలోచనల సమయాలు
సమస్యల సాలెగూటి చిక్కుల వలయాలు
వీటన్నిటి మధ్య నలుగుతున్న నరుడి విలవిలలు
కలగనడం మరిచిపోతున్నాడు ఆద్మీ అసలు కలలు
ఆదిమానవుడిగా అడవుల్లో,
కొండగుహల్లో వన్యమృగాల మధ్య సంచారం
రాళ్ళను రాపిడిచేసి కనుగొన్న అంగారం
మితిమీరిన మేధతో తన గుండెల్లోనే కుంపటిని
రాజేసుకోవడం బహు ఆశ్చర్యం!

విడువని మోహంతో, దాహం దాహమంటూ
వీధివీధిలో తిరుగుతున్న మనిషే ఇపుడు మృగం
ప్రేమ, సున్నిత హృదయంగల మనిషి
డబ్బుల దట్టమైన అడవుల్లోకి ప్రవేశించాక
ఆశాపాశాలు, మమతానురాగాలు, ఆకలినిద్రలు విడిచాక
వచ్చిన దారిజాడలు మరిచి అవుతున్నాడు ఆగమాగం
దారసలు దొరుకుతుందో లేదోమరి?

దీర్ఘ ఆలోచనల్లో, వేదనల్లో
గాయపడ్డ మనసుతో, బాధల బరువు రెప్పల కళ్ళతో
స్వార్థపు సాగరాల్లో, ఎగిసే ఆందోళనల అలల గుండా
కాలపు తుఫాన్ గాలుల్లో కొట్టుమిట్టాడుతూ
చుక్కాని లేని రోజు అనే పడవలో ప్రయాణం
అధికారం, అహంకారమనే మహానగరాలు
మధ్యమధ్యలో కొన్ని ఆనంద దీవులు
ఆనందం వెతుకుతూ సాగుతున్నవాడికి
అసలైన ఆనందతీరం దొరుకుతుందా చివరికి?



వ్యాసం

# తెలంగాణ నవలా సాహిత్యం (1900-1932)

**నవల పరిణామంలో సామాజిక క్రమం...**




భీంపల్లి శ్రీకాంత్
79818 12260


ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత తెలంగాణ సాహిత్యం కూడా తన అస్తిత్వాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నది. ఆంధ్ర వలసవాద పాలనలో మన తెలంగాణ సాహిత్యం కూడా మరుగున పడిపోయింది. ఆంధ్రవాళ్ళు రాసిందే అసలైన సాహిత్యమన్నంతగా ప్రచారంలోకి వచ్చింది. కారణం లేకపోలేదు. అప్పటి పత్రికా సంపాదకులంతా ఆంధ్రవాళ్ళే కావడంతో ఆంధ్ర రచయితలు ఏది రాసినా ప్రామాణికతగా చాటిచెప్పడంలో విజయం సాధించారు. అయితే అదే సమయంలో తెలంగాణ కవులు, రచయితలు రాసిన సాహిత్యం మాత్రం ఏ పత్రికా సంపాదకుడు పట్టించుకున్న పాపానపోలేదు. వాళ్ళు ఏది రాసినా సదివి మురిసిపోయినం. అదే సాహిత్యమనుకుని సంబురపడినం. మనకు మన సోయి వచ్చిన తర్వాత మన సాహిత్యాన్ని తవ్వితీసుకునే ప్రయత్నంలో పడినం. అప్పుడు మనకు జ్ఞానోదయమై మన సాహిత్యం లోతుపాతులు తెలుసుకోవడంలో మునిగిపోయినం. మన ఉనికిని చాటుకునే ప్రయత్నంలో పడినం. అప్పుడు తెలిసింది మనకు మన తెలంగాణ సాహిత్యం సముద్రమంత సంపదని. తనివితీరని జ్ఞానభాండాగారమని. మూలాలను తొంగిచూసేకొద్దీ అనర్ఘ రత్నాలు, ఆణిముత్యాలు, మేలిమి ముత్యాలు వంటి అద్భుతమైన సాహిత్యం వెలుగుచూసింది. మన సాహిత్యం ఏమిటో ప్రపంచానికి తేటపరిచింది. అయితే మనం ఇంతకుముందే సదువుకున్నట్లు ఆంధ్రవాళ్ళు రాసిందే సదివి సప్పట్లు కొట్టినం. వాళ్ళు ఏదంటే అది నమ్మి బోల్తాపడినం. తెలంగాణ వచ్చినంకనే మన సాహిత్యం మీద పడినం. మన సాహిత్యాన్ని తవ్వుతున్నాకొద్దీ ఎన్నో విలువైన రచనలు వెలుగు చూసినవి. తెలుగు సాహిత్యానికి బాటలు వేసినవి.

వాస్తవానికి తెలంగాణ కవులు, రచయితలు ఎంతోమంది స్వాతంత్ర్యానికి పూర్వమే పద్యం, కవిత్వం, కథలు, నవలలు రాసి వాసికెక్కారు. ఆంధ్ర రచయితలకు ధీటుగా తెలంగాణ రచయితలు అన్ని ప్రక్రియలలో రాణించి తమతమ ప్రతిభను చాటుకున్నారు. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నేపథ్యంలో మన తెలంగాణ సాహిత్యాన్ని మరోసారి మననం చేసుకోవాల్సిన సందర్భం ఏర్పడ్డది. మన తెలంగాణ సాహిత్య వైభవాన్ని తరతరాలకు అందజేయాల్సిన అవసరం మన రచయితలపైన, పరిశోధకులపైన పడ్డది. తెలుగు సాహిత్యంలో పురుడు పోసుకున్న అనేక సాహిత్య ప్రక్రియలు ఈ తెలంగాణ గడ్డ నుంచే ఆవిష్కరించబడ్డయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

తెలుగు సాహిత్యంలో వెలుగుచూసిన, చూస్తున్న అనేక ప్రక్రియలపై వాదోపవాదాలు, చర్చలు ఇంకా జరుగుతూనే ఉన్నవి. తెలుగు సాహిత్యాన్ని కూలంకషంగా పరిశోధిస్తున్న పరిశోధకులు కూడా ఏది ముందుగా, ఏది తర్వాత వెలువడిందో అన్న విషయంపై ఇంకా పరిశోధనలు చేస్తూనే ఉన్నరు. అయితే తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత మన అస్తిత్వాన్ని మరోసారి లిఖించుకుంటున్న తరుణంలో మన తెలంగాణ సాహిత్యం ఎక్కడ అనే చర్చ జరుగుతున్నది. తెలంగాణలో వచ్చినటువంటి అనేకానేక సాహిత్య ప్రక్రియలు ఆంధ్ర సాహిత్యం లోనూ వెలువడలేదు. అది నవల కావచ్చు. కథ కావచ్చు. అయితే తెలంగాణ సాహిత్యంలో తొలి తెలంగాణ నవల ఏదీ అన్న అంశంపై ఇంకా చర్చ కొనసాగడం దురదృష్టకరం. తెలంగాణలో వచ్చిన మొట్టమొదటి నవల "ఆశాదోషం". దీనిని తెలంగాణలో మొట్టమొదటిసారిగా "హితబోధిని" పత్రికను నడిపిన బరారు శ్రీనివాసశర్మ రచించిండు.

తెలంగాణ సాహిత్యంలో మొట్టమొదటి నవల ఏది అన్న ప్రశ్న ఇటీవల సాహిత్య ప్రపంచంలో చర్చ జరుగుతున్నది. కొందరు తడకమళ్ళ కృష్ణారావు

వ్యాసం

రచించిన "కంబుకంధర చరిత్ర'' అని, వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన "ప్రజల మనిషి'' అని ఇలా ప్రచారంలోకి తెచ్చింద్రు. వాస్తవానికి తెలంగాణలో మొట్టమొదటి నవల రాసింది బరారు శ్రీనివాస్ శర్మ. ఆ నవల పేరు "ఆశాదోషం''. దీనిని ఆయన **1910** సంవత్సరంలోనే రాసిండు. ఈయన మరెవరో కాదు, తెలంగాణలో మొట్టమొదటి పత్రిక అయిన "హితబోధిని'' పత్రికను నడిపిన వ్యక్తి. ఈయన మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి. అయితే మొట్ట మొదటి తెలంగాణ నవలను రికార్డు చేసే సందర్భంలో అనేక భిన్నవాదనలు కూడా ప్రచారంలోకి వచ్చినవి. తెలంగాణ సాహిత్యాన్ని తవ్వితీస్తున్న సందర్భంలో ఎన్నో ఆణిముత్యాలు వెలుగు చూసినవి. అట్లా వెలుగుచూసిందే తెలంగాణ మొట్టమొదటి నవల "ఆశాదోషం''.

అయితే తెలుగు సాహిత్యంలో కర్నూలుకు చెందిన నరహరి గోపాల కృష్ణమశెట్టి రాసిన "రంగరాజ చరిత్ర''ను మొట్టమొదటి నవల అన్నరు. ఈ నవల **1872** సంవత్సరంలో రచించబడ్డది. మరికొందరు కొక్కొండ వేంకటరత్నం రాసిన "మహాశ్వేత''ను వెలుగులోకి తెచ్చింద్రు. అంతేకాదు కందుకూరి వీరేశలింగం రచించిన "రాజశేఖరచరిత్ర'' ను తొలినవలగా ప్రచారం చేసి విజయం సాధించింద్రు. ఇది **1878** సంవత్సరంలో రాయబడ్డది. ఈ నవల ఆలివర్ గోల్డ్ స్మిత్ రాసిన "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్'' నవలకు అనువాదం. అయితే ఇవి నవలలు కావని వచన ప్రబంధాలనీ తెలుగు సాహిత్య విమర్శకులు ఎంతో మంది అభిప్రాయపడ్డరు. కానీ అంతకు ముందే తెలంగాణలో నవలను పోలిన వచన ప్రబంధాలు చాలా వచ్చినవి. నల్గొండ జిల్లాకు చెందిన తడకమళ్ళ వెంకటకృష్ణారావు "కంబుకంధర చరిత్ర'' అనే రచన చేసిండు. ఇది ఆయన **1866** లో రాసిండు. వాస్తవానికి ఇది వచన ప్రబంధం. కానీ ఇదే తొలి తెలంగాణ నవల అని పరిశోధకులు వెలుగులోకి తెచ్చింద్రు. కొంతమంది పరిశోధకులు మాత్రం ఇందులో చాలా పద్యాలున్నవని, ఇది యక్షగానరూపమని కూడా అంటున్నరు. కాబట్టి ఇది నవల కాదనేది మనం తెలుసుకోదగిన విషయం. తడకమళ్ళ **1868** లో రాసిన మరో రచన "కామరూప కథ''. కమ్మీర నగర రాజైన రాజరాజప్రవరుని కుమారుడైన కామరూపుని చరిత్రనే కామరూప కథ. కంబుకంధర చరిత్రను పోలిన రచనగా దీనిని ప్రసిద్ధ పరిశోధకులు నిడదవోలు వేంకటరావు అభిప్రాయపడ్డరు. ఇతని ఇంకో రచన "తెలుగు వెలుగు ముగుద కథ'' కూడా వచనప్రబంధమే. రచయిత చంపూ కావ్యమని పేర్కొన్నడు. ఇది **1879** సంవత్సరంలో ప్రచురించబడ్డది. దీనికి "శ్రీమదాంధ్ర కవితావేదిని విలాసము'' అని పేరు కూడా ఉందని ముంగిలిలో ప్రసిద్ధ పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నడు.

### తొలి తెలంగాణ నవల 'ఆశాదోషం'...

తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రాంత సాహిత్యం అగ్రభాగమనేది ఒక చారిత్రకమైన సత్యం. తెలుగు సాహిత్యంలో వచ్చినటువంటి అనేక సాహిత్యప్రక్రియలు వెలుగుచూసింది




> **సాహిత్యంలో తెలంగాణ ప్రాంతం నుంచే అనేక తొలి ప్రక్రియలు ఆవిర్భవించాయని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఆ కోవలోనే తొలి తెలంగాణ నవల కూడా మహబూబ్ నగర్ నుంచి వెలుగుచూసింది. ఆ నవల పేరు 'ఆశాదోషం'. రచయిత బరారు శ్రీనివాసశర్మ. ఇతడు పత్రికా సంపాదకుడే కాదు రచయిత, ఆయుర్వేద పండితుడు కూడా. ఈ నవలను శ్రీనివాసశర్మ 1910 లో రచించిండు.**

ఒక్క తెలంగాణలోనే కావడం మరో విశేషం. ఒక ప్రాంత అస్తిత్వాన్ని చాటుకునే సందర్భంలో మొట్టమొదటిసారిగా శాసనాలు దివిటీలై ప్రకాశించినవి. మన ఘనమైన చరిత్రను చాటిచెప్పేవే శాసనాలు. ఆ శాసనాల ఆధారంగానే మన చరిత్ర లోకానికి తెలుస్తుంది. ఇక్కడ తెలుగు భాష పుట్టకముందు పైశాచిక, ప్రాకృత భాషల్లోనే రచనలు వెలువడ్డవి. అనంతరం తెలుగుభాష వెలుగుచూడడంతో తెలుగు సాహిత్యం ఇక్కడ పురుడుపోసుకుంది. పాల్కురికి సోమనాథునితో తెలంగాణ సాహిత్యానికి పునాదులు పడ్డవి. తొలిసారిగా స్వతంత్ర రచనలు చేసినవాడు పాల్కురికి సోమనాథుడు. అనంతరం శ్రీకంఠం కృష్ణమాచార్యులు, గోన బుద్దారెడ్డి, వేములవాడ భీమకవి వంటి కవులతో తెలంగాణ సాహిత్యం గట్టిగా పునాదులు వేసుకుంది.

సాహిత్యంలో తెలంగాణ ప్రాంతం నుంచే అనేక తొలి ప్రక్రియలు ఆవిర్భవించాయని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఆ కోవలోనే తొలి తెలంగాణ నవల కూడా మహబూబ్ నగర్ నుంచి వెలుగుచూసింది. ఆ నవల పేరు 'ఆశాదోషం'. రచయిత బరారు శ్రీనివాసశర్మ. ఇతడు పత్రికా సంపాదకుడే

వ్యాసం

కాదు రచయిత, ఆయుర్వేద పండితుడు కూడా. ఈ నవలను శ్రీనివాసశర్మ 1910 లో రచించిండు. 16 వ శతాబ్దానికి చెందిన చారిత్రక నేపథ్యంలో దీనిని నవలగా తీర్చిదిద్దిండు. దీనిని మొట్టమొదటిసారిగా వెలుగులోకి తీసుకువచ్చింది ప్రసిద్ధ తాళపత్ర, రాతపత్ర పరిశోధకుడు నాగలింగ శివయోగి. ఇతడు మహబూబ్ నగర్ జిల్లా మొత్తం తిరిగి 600కు పైగా తాళపత్రాలను, రాతప్రతులను సేకరించిన పరిశోధకుడు. సేకరించిన అన్ని ప్రతులను తార్నాకలోని ప్రాచ్య లిఖిత భాండాగారానికి ఉచితంగా అందజేయడం విశేషం. ఈ సేకరణ వల్ల మనదైన అస్తిత్వసంపద ఎంతో వెలుగుచూసింది. ఎంతోమంది చేయాల్సిన పనిని నాగలింగ శివయోగి ఒక్కడే చేయడం గమనార్హం. తన జీవితకాలంలో తెలంగాణలో వందలకొద్దీ తాళపత్ర గ్రంథాలను, రాతప్రతులను సేకరించిన ఏకైక వ్యక్తి. ఈ సేకరణలో అనేక ఆణిముత్యాలవదగ్గ రాతప్రతులు వెలుగుచూసినవి. అలాంటి రాతప్రతులలో "ఆశాదోషం'' నవల ఒకటి. ఎన్నో ఏళ్లుగా భద్రపరచిన "ఆశాదోషం'' నవల చాలా ఏళ్ళకు వెలుగు చూసింది. ఇది తెలంగాణ తొలి నవల కావడం విశేషం. దీని రచయిత బరారు శ్రీనివాస శర్మ. కోయిలకొండ ప్రాంతం వాడు కావడంతో కోయిలకొండ చరిత్రను "ఆశాదోషం'' నవలగా అక్షరబద్ధం చేసిండు. ఇంకా తెలుగులో ఇలాంటి మరుగునపడిన కావ్యాలెన్నో ఉన్నవి. వాటిని తెలంగాణ పరిశోధకులు వెలికితీసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఈ నవల వెలుగుచూడడం మరో విశేషం.

నాగలింగ శివయోగి పరిశోధనలోనే తొలి తెలంగాణ నవల అయిన "ఆశాదోషం'' వెలుగుచూసింది. ఇది పూర్తిగా కోయలకొండ దుర్గం చరిత్ర. సరళగ్రాంథికంలో రచించబడ్డ తొలి తెలంగాణ నవల. అయితే తెలంగాణ పరిశోధకులు మాత్రం నల్లగొండ జిల్లాకు చెందిన తడకమల్ల కృష్ణారావు రచించిన "కంబుకంధర చరిత్ర'' అనే రచనను తొలి నవలగా పేర్కొంటున్నరు. ఇది 1866 లోనే రచించినట్లుగా భావిస్తున్నరు. అయితే రచయిత స్వయంగా దీనిని వచన ప్రబంధమన్నడు. కానీ నవల అని ఎక్కడా పేర్కొనలేదు. కందుకూరి వీరేశలింగం కూడా తాను రాసిన "రాజశేఖర చరిత్ర'' ను కూడా వచన ప్రబంధమనే పేర్కొన్నడు. నవల అని పేర్కొనలేదు. నేటి పరిశోధకులు మాత్రం వచన ప్రబంధమని పేర్కొంటున్నరు.

1910లో బరారు శ్రీనివాసశర్మ "ఆశాదోషం'' అనే నవలను రచించాడని, అది అలభ్యమని, అలబ్దమని తెలంగాణ సాహిత్యం గురించి రాస్తున్న పరిశోధకులు పేర్కొన్నరు. అయితే నవల లభ్యం కానీ, అముద్రితంగా ఉండిపోయింది. తెలంగాణ తన అస్తిత్వాన్ని చాటుకుం టున్న సందర్భంలో ఈ నవల వెలుగు చూసింది. ఇదొక చారిత్రక నవల. కోయి లకొండ దుర్గాన్ని కుతుబ్ షాహీ ఎలా హస్తగతం చేసుకోవాలనే తాపత్రయ పడ్డాడో, ఎలా యుద్ధాలు చేశాడో ఈ నవల మనకళ్ళకు కడుతుంది. ఆనాటి కోయిలకొండ చరిత్రను కళ్ళకు కట్టినట్లు రచయిత దీనిని రచించిండు. నవల ప్రారంభం నుంచి చివరివరకు ఎంతో ఉత్కంఠతతో ఇది చదివిస్తుంది. నవల ఎత్తుగడ మొదలుకొని ముగింపు వరకు ఊకబట్టి చదివిస్తుంది. ఇందులో కోయిల కొండ వర్ణన, అంతఃపుర మహిళల సంభాషణలు, గూఢచర్యం, ముస్లిం రాజుల కుట్రలు, యుద్ధనీతి, సాహెబు ముసుగులో వలీ కుతంత్రాలు వంటివెన్నో రచయిత చక్కగా ఆవిష్కరించిండు. కోయిలకొండ రాజైన బసవరాజుతో తొమ్మిది నెలలపాటు పోరాడి చివరకు లాభం లేకపోవడంతో కుట్రపూరితంగా మేనాల (పల్లకి) మహిళల వేషంలో అంతఃపురంలో ప్రవేశించి బసవరాజును హత్య చేయడం, కోయిలకొండ దుర్గాన్ని కుతుబ్ షాహీలు ఆధీనంలోకి తీసుకోవ డంతో ఈ నవల ముగుస్తుంది. అనేకానేక మలుపులతో సాగిన ఈ నవల నాటకీయ తతో కొనసాగి పాఠకులను ఉత్కంఠతకు గురిచేస్తుంది. అంతేకాదు ఆనాటి పండుగలు, ఉత్సవాలు, ఆచారాలు ఎట్లా జరుపుకుంటరో ఈ నవలలో రచయిత చక్కగా మన కళ్ళముందుంచాడు.

> **ఈ "ఆశాదోషం" సరళ గ్రాంథికంలో రచించబడిన నవల అయినప్పటికీ అది అందరిని అలవోకగా చదివి స్తుంది. ఈ నవల చదువుతుంటే పాత్రలు, సంఘట నలు, సన్నివేశాలు మన కళ్లముందు మెదులుతవి. అంత అద్భుతంగా ఈ నవల చదివిస్తుంది. తెలంగాణ సాహిత్య పెద్దలందరూ తప్పకుండా చదవాల్సిన నవల ఇది. తెలంగాణలో నవలా లక్షణాలతో వెలువడిన మొట్టమొదటి నవల ఆశాదోషం.**

ఈ "ఆశాదోషం'' సరళగ్రాంథికంలో రచించబడిన నవల అయినప్పటికీ అది అందరిని అలవోకగా చదివిస్తుంది. ఈ నవల చదువుతుంటే పాత్రలు, సంఘట నలు, సన్నివేశాలు మన కళ్లముందు మెదులుతవి. అంత అద్భుతంగా ఈ నవల చదివిస్తుంది. తెలంగాణ సాహిత్య పెద్దలందరూ తప్పకుండా చదవాల్సిన నవల ఇది. తెలంగాణలో నవలా లక్షణాలతో వెలువడిన మొట్టమొదటి నవల ఆశాదోషం.

తెలంగాణలో "ఆశాదోషం'' నవల తర్వాత ఎన్నో నవలలు వెలువడ్డవి. అవి చారిత్రక, సాంఘిక నవలలు. రాజకీయ చైతన్యంతో కూడిన నవలలు కూడా వెలువడినవి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి సోమరాజు రామానుజరావు కథలు, నాటకాలు, పాటలే గాక నవలలు కూడా రచించిండు. ఈయన ఒక

**వ్యాసం**

జమీందారు కుటుంబానికి చెందినా ఒకపక్క గ్రంథాలయోద్యమానికి కృషి చేస్తూనే మరోపక్క గాంధీ ప్రభావంతో జాతీయోద్యమంలో పాల్గొన్నడు. అనేక జాతీయోద్యమ నాటకాలను రాసిండు. తన 18వ ఏట నుంచే రచనలు చేసిన మేధావి. రామానుజరావు రాసిన “స్వతంత్ర రథం” అనే నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వం నుంచి అరెస్టు వారెంటు రావడంతో రంగూన్‌కు పారిపోయి అక్కడే తన 38వ ఏట చనిపోయిండు. రామానుజరావు 1914 లో “మంజుమతి, జగన్మోహిని” అనే చారిత్రక నవలలను రాసిండు. “జగన్మోహిని” నవలలో ఆర్కాటు ముట్టడికి సంబంధిం చిన చరిత్ర ఉన్నది. ఈ నవలను నెల్లూరుకు చెందిన సుబోధిని గ్రంథమాల వారు ప్రచురించిండ్రు. సరళ గ్రాంథికంలో రచించబడ్డ నవలలివి. 1916 లో “హైమావతి, విషవాహిని” అనే సాంఘిక నవలలను రచించిండు. ఈ నవలలను నిడదవోలులో ఆంధ్ర ప్రచారిణీ ముద్రాక్షరశాల వారు ప్రచురించిండ్రు. రామానుజరావు రాసిన మరో చారిత్రక నవల “దోమాడ యుద్ధం”. ఇది 1921లో ప్రచురింప బడింది. ఇంకా “శిశుహత్య, వనదుర్గము, తపోవనము, జపమాలిక, రక్తజ్వాల, కరుణ” మొదలైన 21 నవలలను సోమరాజు రామానుజరావు రచించిండు. ఈ నవలలు సరళమైన భాషలో ఉంటూ చదివించేవిగా ఉంటవి. బహుళ ప్రజాదరణ పొందినవి.




వరంగల్‌కు చెందిన దూపాటి వేంకటరమణాచార్యులు “వసుంధర, కొండపల్లి ముట్టడి, అన్నయమంత్రి” అనే చారిత్రక నవలలు రాసిండు. “వసుంధర” చారిత్రక నవలను 1914లో రాయగా, 1922లో దేవులపల్లి వేంకటాచలపతిరావు స్థాపించిన కాకతీయ గ్రంథమాల తరపున వెలువరించిండు. ఈ నవలను మొదటి ప్రతాపరుద్రుడికి సంబంధించిన వస్తువును తీసుకుని రాసిండు. “కొండపల్లి ముట్టడి” నవల 1929లో మొదటిసారిగా ప్రచురించబడింది. శ్రీకృష్ణదేవ రాయల కాలానికి సంబంధించిన ఇతివృత్తంతో ఈ నవల రాయబడ్డది. జాతీయతోద్యమ ప్రబోధమే ధ్యేయంగా రాసిన నవల ఇది. మరో చారిత్రక నవల “అన్నయమంత్రి” 1951 లో వెలువడింది. రుద్రమదేవి సోదరి గణపాంబకు సంబంధించిన చారిత్రకాంశాలతో ఈ నవల రచించబడ్డది.

ప్రసిద్ధ పరిశోధకుడు, పత్రికా సంపాదకుడు, తెలంగాణ జాతి వైతాళికుడు, తెలుగు భాషోద్ధారకుడు, రచయిత, కవి, ఉద్యమకారుడు అయిన సురవరం ప్రతాపరెడ్డి 1917లో “శుద్ధాంతకాంత” అనే నవలను రాసిండు. హైదరాబాద్ నవాబుల విలాసవంతమైన జీవితాలను ఇతివృత్తంగా తీసుకొని ఈ నవలను రాయడం విశేషం. ఆనాటి హైదరాబాద్ నగరంలోని ముస్లింల సాంఘిక ఆచారాలను, జీవన స్థితి గతులను కళ్ళకు కట్టిండు. అయితే ఇది ప్రస్తుతం అందుబాటులో లేదు. ఇది హైదరాబాద్ నవాబుల అంతఃపుర విలాసవంతమైన రహస్యాలను తెలిపే నవల. ఈ నవలను సురవరం తన 20వ ఏట రాయడం విశేషం. సురవరం మరో చారిత్రక నవల “ఆరె వీరులు”. దీనిని ఆయన 1932లో రాసిండు. ఈ నవలకు ఆధారం “ఆరెమరాఠీ” కథ. ఇదొక చిన్న సంస్థానాధీశుని కథ. ఇందులో గోల్కొండ నవాబుల కింద సామంతుడిగా ఉన్న బాజీరావు కథ ఇది. ఇతని కొడుకులు నారాయణరావు, సిద్ధోజీ, ఖండేరావు. వీరు కమలసానకోట, మాలేగాం కోట, బడేగాం కోట పాలించేవారు. బాజీరావు చనిపోయిన కొన్నాళ్లకు నారాయణరావు కూడా మరణిస్తడు. దీంతో సిద్ధోజీ, ఖండేరావులకు రాజ్యకాంక్ష పెరగడంతో నారాయణరావు కొడుకులైన సోమోజి రావు, వీరోజీ, సుబంధలను హతమార్చాలని పథకం వేస్తరు. సిద్ధోజీ ఈ ముగ్గురిని హతమార్చాలని అప్రపు సోదరులను పిలిపిస్తడు. వారు సోమోజి సోదరులను హతమార్చాలనే ప్రయత్నం చేస్తరు. ఈ చారిత్రక నవల మొదటి భాగం ఇది. ఇది అసంపూర్తి నవల. రెండవ భాగం రాయలేదు. ఇందులోని దాయాదుల వైరమే నవల ఇతివృత్తం. సంస్థానాధీశుడికి రెండు కోటలు ఉంటవి. అతనికి ముగ్గురు కొడుకులు. సంస్థానాధీశుడికి ముసలితనం కారణంగా

**నాగలింగ** శివయోగి పరిశోధనలోనే తొలి తెలంగాణ నవల అయిన “ఆశాదోషం” వెలుగుచూసింది. ఇది పూర్తిగా కోయలకొండ దుర్గం చరిత్ర. సరళగ్రాంథికంలో రచించబడ్డ తొలి తెలంగాణ నవల. అయితే తెలంగాణ పరిశోధకులు మాత్రం నల్లగొండ జిల్లాకు చెందిన తడకమల్ల కృష్ణారావు రచించిన “కంబుకంధర చరిత్ర” అనే రచనను తొలి నవలగా పేర్కొంటున్నరు. ఇది 1866 లోనే రచించినట్లుగా భావిస్తున్నరు.

పెద్ద కొడుకు తండ్రి వారసత్వాన్ని స్వీకరించి కొనసాగిస్తుంటడు. ఒకసారి బందిపోట్లు దారికాచి అతని వద్ద ఉన్న భూమిశిస్తు ధనాన్ని దోచుకుంటరు. దాన్ని సాకుగా తీసుకుని అన్న పాలనలోని లోపాలను, డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ ఆస్తి పంపకాలు చేయాలని ముసలితండ్రిపై చిన్నకొడుకులైన ఇద్దరు ఒత్తిడి పెడుతరు. దాంతో రెండింటిలో ఒక కోటను తప్పనిసరి పరిస్థితుల్లో వారికి ఇస్తడు. కాలక్రమంలో మొదట తండ్రి, తర్వాత పెద్దకొడుకు మరణిస్తరు. దీంతో ఆ కోటకు పెద్దకొడుకు కొడుకు పరిపాలన చేస్తుంటడు. సమయం కోసం వేచిచూస్తున్న తమ్ముళ్ళిద్దరూ అన్న కోటపై దాడి చేసి, కొల్లగొట్టి అన్న కుమారుడిని పదవీచ్యుతుడిని చేస్తరు. ఆ యువరాజు విధిలేని పరిస్థితుల్లో తన సంస్థానాన్ని, కోటను వదిలిపెట్టి గొల్లపల్లిలో కాపురం పెడతడు. కొంతకాలానికి తన తాత దాచుకున్న గుప్తధనాన్ని కోట శిథిలాల నుంచి తవ్వి రహస్యంగా తెచ్చుకుని మరో కోటను నిర్మించుకుంటడు. అనంతరం ఆ కోటలోనే నివాసం ఏర్పరచుకుంటడు. ఆ తర్వాత చిన్నాయనలపై దాడి చేసి విజయం సాధిస్తడు. తిరిగి కోటను స్వాధీనం చేసుకుని తన రాజ్యాన్ని పాలిస్తడు. స్థూలంగా ఇది నవలా వస్తువు. అనేకానేక మలుపులతో ఈ చారిత్రక నవల రచించబడ్డది.

తెలంగాణలో ఒద్దిరాజు సోదరులు ప్రముఖులు. వీరు వరంగల్ జిల్లాకు చెందినవారు. 1922లో తెనుగు పత్రికను స్థాపించి నడిపినవారు. ఈ పత్రిక తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వికాసానికి విశేషంగా కృషి చేసింది. ఈ ఒద్దిరాజు సోదరుల్లో ఒకరైన సీతారామచంద్రారావు "రుద్రమదేవి" అనే చారిత్రక నవలను రచించిండు. దీనిని ఆయన 1918లో ప్రచురించిండు. మళ్ళీ 1922లో పునర్ముద్రణ పొందింది. ఈ నవలలో కాకతీయుల విశిష్టపాలన గురించి, రుద్రమదేవి యుద్ధవిద్య ధీరత్వాన్ని, శౌర్యపరాక్రమం గురించి, గోన గన్నారెడ్డి వీరత్వం గురించి, దేవగిరి యాదవరాజును జయించిన తీరును గురించి ఆసక్తికరంగా తెలుపబడింది. యుద్ధనీతిలో ఆరితేరిన రుద్రమదేవి పాలనకు సంబంధించిన ప్రధాన కథ ఇది. రుద్రమదేవి తండ్రి గణపతిరాజు జైనులను హింసించి హతమార్చడంతో జైనులలో ఒకడైన ధర్మవర్ధనుడు ఓరుగల్లు రాజులపై కక్ష పెంచుకుంటడు. దీంతో ధర్మవర్ధనుడు దేవగిరి రాజైన మహాదేవరాజు దగ్గరకు బయల్దేరడంతో కథ మొదలవుతుంది. ఆయనకు మార్గమధ్యంలో హరిహర, మురారి దేవులు కలుస్తరు. వారు కూడా కాకతీయ రాజులకు వ్యతిరేకులై దేవగిరికి బయల్దేరి ధర్మవర్ధనుడికి మద్దతు పలుకుతరు. ఈ ముగ్గురూ కలిసి రుద్రమదేవిని సింహాసనం నుంచి దింపడానికి చేసిన ప్రయత్నాలను, కుట్రలను, కుతంత్రాలను ఇందులో చక్కగా చిత్రీకరించిండు రచయిత సీతారామచంద్రారావు. ఈ "రుద్రమదేవి" నవల విజ్ఞానచంద్రిక మండలి వారి బంగారు బహుమతి కూడా పొందింది.

సీతారామచంద్రరావు రాసిన మరో నవల "శౌర్యశక్తి". ఇదొక విభిన్నమైన నవల అని చెప్పవచ్చు. ఈ నవల ఒద్దిరాజు సోదరులు స్థాపించిన విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాలచే ఆరవ పుస్తకంగా వెలువడింది. చక్రకూట రాజ్యాన్ని ధారావర్ష మహారాజు అనే రాజు పాలిస్తుండేవాడు. అతనిని భ్రమర కోట మండలాధిపతియైన మధురాంతక దేవుడు యుద్ధంలో సంహరించి చక్రకూట రాజ్యాన్ని కైవసం చేసుకుంటడు. ధారావర్ష మహారాజు భార్య గుండమ సాహసవంతురాలు. అంతేకాదు వీరపత్ని, వీరమాత. పొత్తిళ్లలో ఉన్న తన ఏకైక కుమారుడు సోమేశ్వరుని తీసుకుని శత్రువ్యూహాన్ని ఛేదించి దగ్గరే ఉన్న ఒక కోయపల్లెకు చేరి, అక్కడే సోమేశ్వరుని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. అన్ని విద్యలు నేర్పి తానే గురువై అద్వితీయ వీరమూర్తిగా దిద్దుతుంది. ఇది ఈ నవల ప్రధాన ఇతివృత్తం. పేరుకు తగ్గట్టుగానే ఈ నవలలో రాణి గుండమహాదేవి తన ఏడాది కుమారున్ని అజ్ఞాతవాసంలో ఉంటూ చేసిన హితబోధ, ఇచ్చిన శౌర్య శిక్షణ ఇందులో విపులంగా రచయిత వివరించిండు. ఇతని మరో నవల "భ్రమర". ద్రోహులచే చిక్కుబడిన భ్రమర తన బుద్ధి చాకచక్యంతో ఎట్లా తప్పించుకుందో చెప్పే కథ. మరో నవల "రక్తాంజలి" నిజాం రాష్ట్రాంధ్ర వీర చరిత్రను తెలిపే నవల. ఇతడు ఇంకా "బ్రాహ్మణ సాహసం, వరాహముద్ర" వంటి చారిత్రక నవలలను, "స్త్రీ సాహసము, ముక్త వలస" వంటి సామాజిక నవలలను రచించిండు. అలాగే మరో సోదరుడైన ఒద్దిరాజు రాఘవ రంగారావు "వీరావేశం, వరాహముద్ర" అనే చారిత్రక నవలలను రచించిండు. "వీరావేశం" చిన్న నవల. నెల్లూరు మనుమసిద్ధి రాజు తన రాజ్యాన్ని కోల్పోవడంతో తన ఆస్థాన కవి అయిన తిక్కన గణపతి దేవుని సహాయంతో తిరిగి సింహాసనాన్ని ఎలా చేజిక్కించుకున్నడో తెలిపే కథ. "వరాహముద్ర" నవల కాకతీయులకు సంబంధించినది. గణపతిదేవుని కాలం నాటిది. గణపతి దేవుని గూఢాచారులే రాజద్రోహం చేయడంతో వారిని ఎలా శిక్షించారో

**సీతారామ చంద్రరావు రాసిన మరో నవల "శౌర్యశక్తి". ఇదొక విభిన్నమైన నవల అని చెప్పవచ్చు. ఈ నవలను ఒద్దిరాజు సోదరులు స్థాపించిన విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాలచే ఆరవ పుస్తకంగా వెలువడింది. చక్రకూట రాజ్యాన్ని ధారావర్ష మహారాజు అనే రాజు పాలిస్తుండేవాడు. అతనిని భ్రమర కోట మండలాధిపతియైన మధురాంతక దేవుడు యుద్ధంలో సంహరించి చక్రకూట రాజ్యాన్నికైవసం చేసుకుంటడు.**

వ్యాసం

తెలిపే కథనే ఈ నవలలోని ఇతివృత్తం.

1922లో శేషభట్టరు వేంకట రామానుజాచార్యులు "ప్రాకృత దాంపత్యం'' అనే పేరుతో ఒక నవలను రాసిండు. ఇందులో ప్రకృతిలో ఉన్న చెట్లు, చేమలు, నదులే పాత్రలుగా చేసుకుని ఈ నవలను రచించడం విశేషం. ఇంకా ఈ నవలలో ప్రకృతి, ఈశ్వరుడు, పర్వతం, ఆకాశం, భూమి, వృక్షాలు, వాయువు, అగ్ని, మేఘం, నీటిచుక్క, చంద్రుడు, వెన్నెల, సూర్యుడు, కొలను తదితర పాత్రలతో నవల రాయడం విశేషం. అసలు ప్రకృతిలోని పంచభూతాలతో పాటు పర్యావరణహితమైన పాత్రలతో నవల రాయడం అనేది ఊహకు అందని విషయం. అందుకే ఇది తొలి పర్యాటక నవల కావడం మరో విశేషం. ఇది 1922 లో నల్లగొండలోని ఉస్మానియా ముద్రణాలయంలో ప్రచురించబడింది. ఈయన "బ్రహ్మనూర్'' అనే మరో నవల కూడా రచించిండు.

నల్లగొండ జిల్లాకు చెందిన చారిత్రక పరిశోధకులు, జాతీయవాది అయిన చిల్లర శ్రీనివాసరావు 1923లో "శ్రీధర విజయము'' అనే నవలను రాసిండు. ఇది అపరాధ పరిశోధక నవల. అనంతరం "గాంధీ మహాత్ముని జీవితామృతము'' అనే నవలను రాసిండు. ఇది గాంధీ మహాత్ముని జీవిత చరిత్ర. ఇంకా ఈయన ప్రసిద్ధ బంకించంద్ర ఛటర్జీ బెంగాలీలో రాసిన "కృష్ణకాంతుని మరణశాసనము (1920), శైవలినీ (1910), అభాగిని'' నవలలను తెలుగులోకి అనువాదం చేసిండు. అలాగే పాంచకడీ దేవ్ బెంగాలీ నవలను "ఛద్మవేషి (1924)'' పేరిట తెలుగులోకి అనువాదం చేసిండు. ఇది అపరాధ పరిశోధక నవల కావడం విశేషం. ఊటుకూరి సత్యనారాయణరావు "శశికళ", వనం నర్సింహారావు "పద్మినీ బాయి'' నవలలను రచించిండ్రు. ఈ రెండు నవలలను కృషి ప్రచారిణీ గ్రంథమాల ప్రచురించింది. జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి "జర్మనీ యుద్ధం'' అనే

**నల్లగొండ జిల్లాకు చెందిన చారిత్రక పరిశోధకులు, జాతీయవాది అయిన చిల్లర శ్రీనివాసరావు 1923లో "శ్రీధర విజయము" అనే నవలను రాసిండు. ఇది అపరాధ పరిశోధక నవల. అనంతరం "గాంధీ మహాత్ముని జీవితామృతము" అనే నవలను రాసిండు. ఇది గాంధీ మహాత్ముని జీవిత చరిత్ర. ఇంకా ఈయన ప్రసిద్ధ బంకించంద్ర ఛటర్జీ బెంగాలీలో రాసిన "కృష్ణకాంతుని మరణశాసనము (1920), శైవలినీ (1910), అభాగిని" నవలలను తెలుగులోకి అనువాదం చేసిండు.**

నవలను రచించిండు. 1923 లో వరంగల్ జిల్లాకు చెందిన కోకల సీతారామశర్మ "ఆంధ్రాభ్యుదయం'' అనే పత్రికను నడిపి అందులోనే "పావని నోము'' అనే నవలను రాసిండు.

వరంగల్ జిల్లాకు చెందిన చాట్రాతి లక్ష్మీనరసమాంబ 1924లో "అనురాగ విపాకము'' అనే నవలను రచించింది. విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల సంస్థ దీనిని ప్రచురించింది. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన లక్ష్మీనరసమాంబ మహిళల విద్యకోసం విశేషంగా కృషి చేసింది. మరోపక్క మహిళలను చైతన్యపరుస్తూ ఈ నవలను రచించింది. మెదక్ జిల్లాకు చెందిన బెల్లంకొండ నరసింహాచార్యులు "చీనా సుందరి'' అనే నవలను 1925లో ప్రచురించిండు. సికింద్రాబాద్ కు చెందిన ప్రసిద్ధ సంఘసంస్కర్త టేకుమళ్ల నరసింహం 1927లో "రాధమ్మ'' అనే నవలను రాసిండు. వేశ్యావృత్తి నిర్మూలన కోసం రాసిన ఈ నవలలో కళావంతుల జీవితాలను చక్కగా ఆవిష్కరించిండు. సంఘ సంస్కరణ ఉద్దేశంతో ఈ నవలను రచయిత రచించిండు. దీనిని దక్కన్ మానవ సేవా సమితి వెలువరించింది.

సిరిసిల్లాకు చెందిన ఆవునూరు వేణుగోపాలరావు "జొహరాబాయి'' అనే నవలను రాసిండు. మెదక్ జిల్లాకు చెందిన భాగవతం సీతారామశర్మ "పశ్చాత్తాపం, పుష్పావతి, ఈశ్వర సంకల్పం'' వంటి నవలలను రచించిండు. మాడపాటి హనుమంతరావు "ఆనందమఠము (అనువాదం), గ్యారీబాల్డి జీవితం'' అనే నవలలు రాసిండు. 1920 వ దశకంలో విరివిగా నవలలు వచ్చినవి. వీటిలో అధికంగా చారిత్రక నవలలే కావడం మరో విశేషం.

కరీంనగర్ జిల్లాకు చెందిన ముడుంబాచార్యులు "కాదంబిని, ప్రేమ చాంచల్యం'' అనే నవలలను రాసిండు. నల్లగొండకు జిల్లాకు చెందిన ప్రసిద్ధ ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు 1930లో "కాలభైరవుడు'' అనే నవల రాసిండు. వరంగల్ జిల్లాకు చెందిన అంబటి లక్ష్మీనరసింహారాజు "శాంతాబాయి", వరంగల్ జిల్లాకే చెందిన నల్లంతిఘల్ చక్రవర్తుల రంయ్యాల వేంకట నరసింహాచార్యులు "భయంకర పిశాచము'' నవలను రాసిండ్రు. ఇదే జిల్లాకు చెందిన శొంఠి కృష్ణమూర్తి "మూగ భార్య'' అనే నవలను రాసిండు. ఖమ్మం జిల్లా పెదమడుగుకు చెందిన వనం వెంకట నరసింహారావు "పద్మినీబాయి'' అనే నవలను రాసిండు.

ఇలా 1930 దశకంలో నవలలు రాసినవారు రాశిలో తక్కువగా రాసినప్పటికీ ఎక్కువగా ముద్రణకు నోచుకోలేదు. ఈ కాలపు రచయితలు తెలంగాణను విభిన్న పార్శ్వాలతో చారిత్రక, సామాజిక, రాజకీయ జీవితాలను చక్కగా ఆవిష్కరించారు.

**ఆధార గ్రంథాలు...**

1. తెలంగాణ నవలా చరిత్ర - సంగిశెట్టి శ్రీనివాస్ 2. తెలంగాణ నవలా వికాసం - కాసుల ప్రతాపరెడ్డి 3. తెలంగాణ నవలా సాహిత్యం - డా॥ టి. శ్రీరంగస్వామి 4. ముంగిలి - డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి 5. ఆశాదోషం నవల - డా॥ భీంపల్లి శ్రీకాంత్

# అభియోగం

అనుకోకుండా జరిగిన యాక్సిడెంట్‌కి
నేరస్థుడైన యువకుడు...



డా॥ ప్యారక కృష్ణమాచారి
76750 42763

హైదరాబాదు మహానగరం. ఎప్పుడు రణగొణ ధ్వనులతో వాహనాల హారన్ మోతలతో సందడి సందడిగా ఉంటుంది. ఆ రోజూ అలానే వచ్చే వాహనాలు పోయే వాహనాలు తొందర తొందర.

ఉరుకులు పరుగులతో జనాలు, రోడ్లన్నీ నిండి ఉన్నాయి సడెన్గా ఓ బైకు వచ్చి ముందున్న కారును గుద్దింది. ఆ బైకు వచ్చింది సందులో నుండి ఆపై రాంగ్ సైడ్ ఇంకేముంది ఢీకొట్టడం అక్కడే పడిపోవడం.

వెంటనే కారు ఆపి దిగిన విజయ్ చూసి ముందు భయపడ్డా తర్వాత తేరుకొని ఆ **20** ఏళ్ల యువకుడ్ని **108**కి ఫోన్ చేసి వచ్చిన ఆ వాహనంలోకి ఎక్కించాడు. పౌర బాధ్యతగా తాను కూడా హాస్పిటల్ దాకా వెళ్లి ఫార్మాలిటీస్ పూర్తి అయ్యేదాకా అక్కడే ఉన్నాడు. ఇంతలో పోలీసులు వచ్చి ఎంక్వయిరీ చేశాక విజయ్ తప్పు లేదని తెలుసుకొని వదిలి పెట్టారు. ఆ యువకుడి పరిస్థితిని గురించి డాక్టర్ని అడిగితే అతను ఇప్పుడు కోమాలో ఉన్నాడని చాలా పెద్ద గాయమైందని **48** గంటలు గడిస్తే గాని ఏమీ చెప్పలేమని తెలుసుకున్నాక బాధతో ఇంటికి బయలుదేరాడు.

ఇంటిదగ్గర శృతి విజయ్ కోసం ఎదురు చూడసాగింది. ఆరోజు వారిద్దరూ సెకండ్ షోకి వెళదామనుకున్నారు. చక్కగా తయారై తలలో మల్లెపూలతో ఒంటికి సెంటు వాసనతో రెడీగా ఉంటే విజయ్ మాసిన బట్టలతో జుట్టంతా చెదిరి మెల్లగా డీలాగా ఇంట్లోకి ప్రవేశించాడు.

"ఏమైందండీ! అలా నీరసంగా ఉన్నారు."

"ఏం లేదులే చిన్న ఆక్సిడెంట్."

"యాక్సిడెంటా మీకేం కాలేదు కదా!"

"ఆ ఏం కాలేదు. కాకపోతే నా కారును గుద్దిన ఆ యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు".

"అయ్యో! పోలీస్ కేసేమైన అయిందా!"

"కాదులే నా తప్పేం లేదని పోలీసులు విడిచి పెట్టారు. అయినా వాడు తాగి రాంగ్ సైడ్ లో రావడం ఎందుకు నా కారు ఢీకొట్టడం ఎందుకు ఎలా ఉన్నాడో" అని వాపోయాడు విజయ్.

"మీరేం చేస్తారు తప్పు మీది కాదు కదా! పోనీలెండి మీరు లేవండి స్నానం చేసి రండి. ఈరోజు శనివారం కదా మీకోసం వేడివేడి జీడిపప్పు వేసి ఉప్మా చేశాను లేవండి" అంటూ తొందర పెట్టింది శృతి. అన్య మనస్కంగా ఉన్నందున సినిమా ప్రోగ్రాం క్యాన్సిల్ చేసుకుని టీవీలో చానల్స్ తిప్ప సాగాడు.

ఇంతలో "ఏవండోయ్! మీకు కవర్ వచ్చింది. అక్కడ టేబుల్ మీద ఉంది చూడండి." అని వంటింటిని సర్దుతున్న శృతి అరిచింది "చూద్దాం లే" అంటూ బెడ్ రూమ్‌కి వెళ్లి పడుకొన్నాడు. మర్నాడు ఉదయాన్నే లేచిన విజయ్ "శృతి ఏదో కవర్ వచ్చింది అన్నావుగా ఏది?" అని అడిగాడు.

"అయ్యో రామా! అక్కడే టేబుల్ మీద పెట్టానని చెప్పాను కదా!" అంటూ తనే టేబుల్ కింద పడిన కవర్ను తీసి ఇచ్చింది. తీసి చూడగానే విజయ్ కళ్ళల్లో మెరుపులు, ముఖంలో ఆనందం తట్టుకోలేక పక్కనే ఉన్న శృతిని ఎత్తుకొని గాల్లో తిప్పాడు.

"అయ్యో! దింపండి". భయంగా అంటుంటే ఇంకాసేపు అలానే ఉంచి దించాక ఆమెను కౌగిలించుకొని ముద్దు పెట్టుకుని "ఇదంతా నీ వల్లే" సంబర పడుతూ అన్నాడు. శృతికి ఏమి అర్థం కాలేదు "అసలు ఏమైందండి" అని అడిగింది.

"ఆరోజు ఎందుకు లెద్దు అంటే పట్టుబట్టి అప్లికేషన్ పెట్టించావు కదా! నా రెస్యూమ్ చూసి జాబ్ ఇచ్చారు చూడు దుబాయ్‌కి. ఇక మనం జుయ్...." అంటూ తన చేతితో ఫ్లైట్ లో పోతున్నట్లు సింబాలిక్ గా చూపించాడు. ఆరోజు తన పని చేస్తున్న ఆఫీస్‌కి బంకు కొట్టి వారి అబ్బాయి క్షితీష్‌తో కలిసి రోజంతా హైదరాబాద్ అంతా తిరిగి సినిమాలు హోటల్స్ షాపింగ్‌లు అన్నీ చేసుకొని ఆ

కథ

రాత్రికి ఇంటికి చేరుకున్నారు.

దుబాయ్‌కి వెళ్ళాక శ్రుతి, క్షితీసులను తీసుకురావాలంటే చేయాల్సిన ఫార్మాలిటీస్‌ని పూర్తి చేసుకున్నాడు. పిల్లాడి అడ్మిషన్స్, అకామిడేషన్ అన్ని చూసుకొని ఓ మంచి రోజు చూసి వాళ్ళిద్దరిని తీసుకొచ్చి దుబాయిలో కాపురం పెట్టాడు.

కాలక్రమేణా ఆక్సిడెంట్‌ని మర్చిపోయాడు కాలచక్రం ఐదేళ్లు వెనక్కి వెళ్ళిపోయింది. అంకితభావంతో శ్రద్ధతో చేస్తూ సమస్యలను కూడా తన ప్రతిభా పాటవాలతో, వాక్చాతుర్యంతో చాక చక్యంగా పరిష్కరించి కంపెనీ అభివృద్ధిలో తను భాగస్వామ్యమయ్యాడు. అతని కృషికి సీఈవో పోస్ట్ వరించింది. గిట్టని సీనియర్లు ఉన్నా అతని టాలెంట్ ముందు నిలవలేకపోవడంతో వారి మాట పడిపోయింది. మిడిల్ ఈస్ట్ మొత్తానికి ఇన్చార్జిగా అవటంతో తరచూ దేశ దేశాలన్నీ తిరగవలసి వస్తున్నది. ఇప్పుడు కంపెనీ అంటే విజయ్ అంటే కంపెనీ అనేలా తయారయింది విజయ్ కృషి వల్ల.

ఓ రోజు కంపెనీ అభివృద్ధి పనుల కోసం ఇంతవరకు వెళ్ళని పాకిస్తాన్‌కి వెళ్లాల్సి వచ్చింది. తోడుగా తన అసిస్టెంట్ సదానందాన్ని వెంటబెట్టుకొని కరాచీ (జిన్నా విమానాశ్రయం)లో దిగాడు. ఎయిర్ పోర్టులో అక్కడి సీఈఓ అబ్దుల్ రెహమాన్ స్వాగతం పలికి లియాఖత్ అలీ రోడ్డులో ఉన్న హోటల్ సెకండ్ హోమ్‌లో విడిది ఏర్పాటు చేశాడు రాత్రి అయింది. ఫ్రెష్ అప్ అయ్యాక గదిలోకి అన్ని సరఫరా చేశారు, ఓ రెండు పెగ్గులు విస్కీ తాగాక ఇద్దరు భోంచేసి పడుకున్నారు.

**అంకిత భావంతో శ్రద్ధతో చేస్తూ సమస్యలను కూడా తన ప్రతిభా పాటవాలతో, వాక్చాతుర్యంతో చాక చక్యంగా పరిష్కరించి కంపెనీ అభివృద్ధిలో తను భాగస్వామ్యమయ్యాడు. అతని కృషికి సీఈవో పోస్ట్ వరించింది. గిట్టని సీనియర్లు ఉన్నా అతని టాలెంట్ ముందు నిలవలేక పోవడంతో వారి మాట పడిపోయింది. మిడిల్ ఈస్ట్ మొత్తానికి ఇన్చార్జిగా అవటంతో తరచూ దేశ దేశాలన్నీ తిరగవలసి వస్తున్నది.**

మర్నాడు జైబున్ని స్ట్రీట్‌లో ఉన్న హోటల్ మెట్రో పోల్లో మీటింగ్ ఏర్పాటు అయింది. ఆ రోజంతా కాన్ఫరెన్స్‌లో కంపెనీ అభివృద్ధి విషయాలు చర్చల్లోకి వచ్చాయి. ఎన్నో రిసోలేషన్స్ చేసుకున్నారు రెండు కంపెనీల మధ్య ఎంఓయులు కుదుర్చుకున్నారు. లంచ్ టైంలో ఎవరో పిలిస్తే అబ్దుల్ రహమాన్ బయటికి వెళ్ళాడు. తిరిగి వచ్చిన తర్వాత అతని కళ్ళల్లో, ప్రవర్తనలో అంతకుముందున్న హుషారు మటుమాయమైంది. ముఖంలో సీరియస్‌నెస్ ఆవరించింది. ఇదంతా సదానందం గమనిస్తూనే ఉన్నాడు. కానీ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఆ రాత్రి అబ్దుల్ రెహమాన్ ఇంట్లో విందు ఏర్పాటు చేశారు. పాకిస్తాన్ వంటకాలతో పాటు హైదరాబాద్ బిర్యాని ఇంకా చాలా వెరైటీలు ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రముఖ వ్యక్తులు వీరి బిజినెస్‌తో సంబంధం ఉన్నవారు సెలబ్రిటీలు చాలామంది వచ్చారు. విజయ్ టిక్‌టాక్‌గా తయారయి తాను తెచ్చిన బొకే అబ్దుల్ రెహమాన్ ఇచ్చాడు. పార్టీ మొదలైంది



రకరకాల డ్రింక్స్ సప్లై అవుతున్నాయి. సదానందం విజయ్ ఎందుకైనా మంచిది కాస్త జాగ్రత్తగా ఉండమని హెచ్చరించాడు. వాష్ రూమ్ దగ్గరలోనే డ్రింక్ సప్లై చేసేవారు ఉన్నారు. అందులో ఒకడు లాస్ట్ డ్రింక్‌లో కలిపేస్తా దాంతో ఆ హిందుస్థానీ కతం అని చెప్తుంటే ఆ మాటలు వాష్‌రూమ్ కని వెళ్లిన సదానందం విన్నాడు. తను అనుకున్నట్లే ఏదో కుట్ర జరుగుతోంది అని గ్రహించి వెంటనే వెళ్లి అలర్ట్ చేశాడు.

"విజయ్ మనము మరో మీటింగ్‌కి వెళ్ళాలి కదా! అందులోనూ అతను మన చిరకాల మిత్రుడు కదా! బయలు దేరుదామా తొందరగా" విజయ్ లేవబోతుంటే అక్కడే ఉన్న అబ్దుల్ రహమాన్ "అదేంటి అసలు పార్టీ అరేంజ్ చేసిందే మీ కోసం ఇలా అర్ధాంతరంగా వెళ్ళిపోతే ఎలా?" అని వారిని ఆపాడు. వారి మధ్య సంభాషణ అంతా ఉర్దూ హిందీలో సాగుతోంది.

లేదు భాయీ! మా పాత మిత్రుడు ఇక్కడే ఉన్నాడట ఒకసారి కలిసి వస్తాం. రేపు నైట్‌కి ఫ్లైట్‌కి వెళ్లాలి కదా! టైం లేదు" అంటూ విజయ్ లేచాడు.

ఇక లాభం లేదని తనూ లేచి అబ్దుల్ రెహమాన్ "విజయసాబ్! చార్ సాల్ పహెలే మీ కారు వల్ల ఒక ఆక్సిడెంట్ జరిగింది కదా!" అని అడిగాడు.

"అవును కదా! గుర్తులేదు. అయినా అది మీకు ఎలా తెలుసు?"

ఆ కారును గుద్దింది నా కొడుకు అబ్దుల్ పాషా.

"అవునా! ఇప్పుడు ఎలా ఉన్నాడు?" ఆప్ కీ మెహర్బానీసే అల్లాకే పాస్ చలాగయా".

"అరెరే! అలాగా అయినా నేనేం చేశాను? ఆక్సిడెంట్ అయిన వెంటనే అతన్ని హాస్పిటల్‌లో జాయిన్ చేశాను. ఆ టైంలో అతను బాగా తాగి ఉన్నాడని చెప్పారు".

"కానీ అదంతా అబద్ధం మీరేనా బాబును చంపారు. నాకు అన్నీ తెలుసు మీరే చంపి మీ పలుకుబడితో మేనేజ్ చేసారు కదా!" అని గట్టిగా అన్నాడు అబ్దుల్ రెహమాన్.

"నహి అబ్దుల్ భాయ్ ఆప్కో గలత్ ఫామిన్ హువా. నాకు ఎలాంటి పలుకుబడులు లేవు. నాకు ఎవరు తెలియదు. నిజం నా మాట నమ్మండి. ఎనీ హౌ మై డీప్ కండోలెన్స్ టు యు" అంటూ వస్తానని సదానందంని వెంటేసుకుని హొటల్ బయటికి వచ్చాడు. ప్లాన్ ఎ బెడిసి కొట్టడంతో ప్లాన్ బి అమలు చేయడానికి సన్నద్ధం అయ్యాడు అబ్దుల్ రహమాన్.

కారులో బయలుదేరారు ఇద్దరు మిత్రులు తమున్న హొటల్ సెకండ్ హొమ్స్‌కి. అక్కడికి చేరబోతుంటే వీరి వెనకాలే మరో కారు వీరిని ఫాలో అవుతూ బయలుదేరింది. అప్పటికే సదానందం ఫ్రెండ్‌కి అంతా చెప్పి ఉంచాడు. కాబట్టే అతని ఇంటికి పోవడానికి జీపీఎస్ ద్వారా వెళుతున్నారు. మోడల్ కాలనీ గ్రేవ్ యార్డ్ దగ్గర వారు మరో కారులోకి మారారు. అది పసిగట్టి శత్రువు కారు కూడా వారిని ఫాలో అయింది. వీరి ఫ్రెండు యూసుఫ్ డైరెక్షన్ ప్రకారం కారు హొటల్లో వైపు కాకా గులిస్తాన్ కాలనీ వైపు మళ్ళింది. ఇక్కడే చిన్నగా ఫాలో అవుతున్న కారును బోల్తా కొట్టించారు. ఇంతలో వేరే దారికి మళ్ళించి కర్సాజ్ రోడ్డులో ఉన్న కాలనీకి వెళ్లారు. అక్కడ వీరి ఫ్రెండు యూసుఫ్ కలిసి తన ఇంటికి తీసుకెళ్లాడు. జరిగిందంతా తెలుసుకున్న తర్వాత యూసఫ్ తన ఫ్రెండు సబ్ ఇన్స్పెక్టర్ రషీద్ ఖాన్ ని సంప్రదించి తన ఇంటికి రమ్మని ఆహ్వానించాడు.

తప్పించుకున్నారని తెలుసుకున్న అబ్దుల్ రెహమాన చేతికి చిక్కిన పిట్ట పారిపోయిందని తాను పంపిన వారి మీద ఆగ్రహోదగ్రుడయ్యాడు. ఎక్కడికి పోతారులే ఈ పాకిస్తాన్ వదిలి వెళ్ళగలరా! ఈ అబ్దుల్ రెహమాన్ తన కొడుకును చంపిన హంతకుడిని వదిలిపెడతాడా! అనుకుంటూ తర్వాత పథకరరచన చేయసాగాడు. కరాచీలో అబ్దుల్ రెహ్మాన్‌కి పెద్ద నెట్వర్క్ ఉంది.

> **ఎక్కడికి** పోతారులే ఈ పాకిస్తాన్ వదిలి వెళ్ళగలరా! ఈ అబ్దుల్ రెహమాన్ తన కొడుకును చంపిన హంతకుడిని వదిలి పెడతాడా! అనుకుంటూ తర్వాత పథకరరచన చేయసాగాడు. కరాచీలో అబ్దుల్ రెహ్మాన్ కి పెద్ద నెట్వర్క్ ఉంది. పైకి కంపెనీ సీఈఓ అయినా తెరవెనుక అతనికి టెర్రరిస్టులతో సంబంధాలు ఉన్నాయి. డ్రగ్స్, మాఫియా దందాలు ఉన్నాయి. కానీ మేక వన్నె పులిలాగా చాలా జాగ్రత్తగా మెయింటైన్ చేస్తున్నాడు.

పైకి కంపెనీ సీఈఓ అయినా తెరవెనుక అతనికి టెర్రరిస్టులతో సంబంధాలు ఉన్నాయి. డ్రగ్స్, మాఫియా దందాలు ఉన్నాయి కానీ మేక వన్నె పులిలాగా చాలా జాగ్రత్తగా మెయింటైన్ చేస్తున్నాడు. పోలీసులకు ఇతని గురించి తెలిసినా సరైన సాక్ష్యాధారాలు లేక పట్టుకోలేక పోతున్నారు. ఏ ప్లాన్ చేసినా తన చేతికి మట్టి అంటకుండా పకడ్బందీగా చేస్తాడు. "ఓ మేరా బేటా కా ఖూనీ హై చోడ్నా నహి" అంటూ కరాచీలోని అన్నిముఖ్య ప్రదేశాలలో, ఎయిర్‌పోర్ట్ దగ్గర అనుచరులను కాపలాగా పెట్టి, కనిపిస్తే కాల్చేయమని ఆర్డర్ చేసినాడు.

ఇక్కడ రషీద్ ఖాన్ వచ్చాక అసలు విషయం తెలుసుకున్నాడు.

"ఈ బద్మాష్ అబ్దుల్ రెహమాన్ పైకి బాగా మంచివాడు గానే కనబడతాడు. తను చేసేవన్నీ లంగాదందాలే. ఈ విషయం మాపై ఆఫీసర్లకు ఎన్నోసార్లు చెప్పినా, వారికి కూడా వాడితో కాంటాక్ట్స్ ఉన్నాయి కదా!".

"రషీద్ భాయ్ మై ఇండియన్స్ దోస్తోంకో ఎలాగైనా బచాయించాలి. నువ్వేం చేస్తావో నాకు తెలియదు. వాళ్ళు ఇక్కడి నుండి క్షేమంగా ఇండియా వెళ్ళిపోవాలి. విజయ్ నాకు ఎంత హెల్ప్ చేశాడో నాకే కాదు నీకూ తెలుసు.

క
థ

ఈరోజు నేను ఈ పొజిషన్లో ఉన్నానంటే విజయ్ గదా కారణం'' అని యూసుఫ్ అంటే, రషీద్ ఖాన్ "మీ ఫ్లైట్ ఎన్ని గంటలకి?"

"ఈ రాత్రి 8 గంటలకు''

"ఆ సమయంలో అటు ఇటుగా ఇంకేమైనా ఫ్లైట్స్ ఉన్నాయా''

"మరి ఇది ఆల్రెడీ బుక్ అయింది కదా''

"కానీ! చూద్దాం! రేపు ఉదయం 8 గంటలకు ఇంకో ఫ్లైట్ జెట్ వేస్ వారిది ఉంది''.

"సరే అయితే! ఈ టికెట్లు క్యాన్సిల్ చేయండి లేదా దాన్ని వదిలేసి కొత్తగా టికెట్లు బుక్ చేసుకోండి''.

"మరి ఆ హొటల్లో లగేజ్ ఎలా''?

అబ్దుల్ రెహమాన్ విజయ్ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు. తన వారినందరిని అలర్ట్ చేశాడు. ఎలాగైనా తన కొడుకును చంపిన వాడిని వదలకూడదు. అది కాదని చెప్తున్నా నమ్మలేకుండా ఉన్నాడు. విజయ్ అబద్ధం ఆడుతున్నాడని అతను నమ్మకం. అందుకే ఈ తాపత్రయం.

హొటల్ దగ్గర యూసుఫ్ బిల్ క్లియర్ చేస్తుండగా ఇద్దరు దృఢకాయులు వచ్చారు. అందులో ఒకడు విజయ్ ఎక్కడ అని అడిగాడు. "నాకేం తెలుసు అయినా మీకు ఎందుకు?"అని అడిగాడు యూసుఫ్. వెంటనే ఒకడు పిడికిలితో ఒక్కటిచ్చాడు. అక్కడే ఉన్న రషీద్ ఖాన్ తన కానిస్టేబుల్స్ ద్వారా వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించాడు. లగ్గేజీ తీసుకొని కార్ దగ్గరికి వచ్చేసరికి మరో ఇద్దరు అటకాయించారు. వారి వెనకాలే ఉన్న రషీద్ ఖాన్ తన కానిస్టేబుల్స్ ద్వారా వారిని కూడా. అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించాడు. ఎయిర్ పోర్టులో వెయిట్ చేసి విసిగిపోయిన అబ్దుల్ రహమాన్ సేవకులు అతనికి ఫోన్ చేసి ఫ్లైట్ టైం అవుతుంది వాళ్ళు ఇంకా రాలేదు భాయ్ అని సమాచారం ఇచ్చారు.

"అంటే వారు ఇంకా కరాచీలో ఉన్నారన్న మాట. వారు బసచేసిన ప్రదేశం తెలుసుకోండి. అక్కడే మట్టు పెట్టండి'' అని ఆర్డరేశాడు యూసుఫ్ ఇల్లు తెలుసుకొని ఇంట్లో ఉన్నదంతా ధ్వంసం చేశారు.

విషయం గెస్ చేసిన యూసుఫ్ వారిని ఓల్డ్ గోలీమార్ దగ్గరున్న సింధిముస్లిమ్ సొసైటీ గ్రేవ్ యార్డ్ లోకి తీసుకెళ్లాడు. శ్మశానం చూడగానే సదానందానికి భయం పట్టుకుంది. చిన్నప్పుడు తన తాత చెప్పిన ముస్లింలు ఉంటాయని అనే కథలు జ్ఞాపకం వచ్చింది. వెన్నులో వణుకు మొదలైంది. అంతకుముందే అక్కడ శవాన్ని పూడ్చినట్లున్నారు. ఆ సమాధి మీద పూలు, చద్దర్ పరిచి ఉన్నాయి ఆ రాత్రంతా అక్కడే పడుకునేట్లు ఏర్పాటు చేశాడు యూసుఫ్. అబ్దుల్ రెహమాన్ అనుచరులు గల్లి గల్లి తిరుగుతున్నారు. అనుమానమున్న ప్రతి ఇంటి తలుపును బద్దలు కొడుతు న్నారు. మర్నాడు ఉదయం 8 గంటలకు ఫ్లైట్.

విజయ్, సదానందంలు దుబాయ్ షేక్ ల్లాగా వేషాలేసుకుని మీసాలు గడ్డాలు పెట్టుకొని ఎయిర్‌పోర్టుకు బయలు దేరారు. రషీద్ ఖాన్‌పై ఆఫీసర్లతో డ్రగ్స్ స్మగ్లపుతున్న సమాచారం వచ్చిందని ఎయిపోర్టులో చెకింగ్ పోస్టింగ్ వేయించు కున్నాడు. తన స్ట్రాంగ్ కానిస్టేబుల్స్‌తో ఎయిర్‌పోర్టు అంతా కలియ తిరిగి అనుమానితులు అందర్నీ గుర్తించి వారిలో ఒకరిని ఢీ కొట్టి తన దగ్గరున్న ఓ చిన్న డ్రగ్స్‌ప్యాకెట్‌ని వాడి జేబులో వేశాడు. సరిగ్గా 6:20కి విజయ్ సదానందంలు వచ్చారు. పాస్‌పోర్ట్ చెకింగ్ అయ్యాక బోర్డింగ్ పాస్ తీసుకొని లోపలి లాంజ్ లోకి వెళ్లబోతుండగా ఇద్దరు అబ్దుల్ రెహమాన్ మనుషులు పిస్టల్‌తో అటకాయించారు. ఇదంతా చూస్తున్న రషీద్ ఖాన్ వారిద్దరిని అరెస్ట్ చేశాడు. అలాగే మిగతా వారిని కూడా ఎయిర్‌పోర్ట్ అథారిటీ వారి పోలీసులు సహాయంతో అరెస్టు చేశాడు. తాను డ్రగ్స్ ప్యాకెట్ పెట్టినవాడి దగ్గర్నుండి అందరి ముందు తీసివాడి చెంప పగలగొట్టి వారి మీద కేసు వేశాడు. అలా రషీద్ ఖాన్ యూసుఫ్ ల సహాయంతో విజయ్ సదానందంలు క్షేమంగా ఇంటికి చేరారు.

తర్వాత అబ్దుల్ రెహ్మాన్‌కి విజయ్ మెసేజ్ పెట్టాడు "తన తప్పేమీ లేదని అతని కొడుకు చావుకి తాను కారణం కాదని తన అపోహనుతొలగించుకోమని నిష్కారణమైన అభియోగాన్ని మనసులో నుండి పారద్రోలమని రాశాడు.

క
వి
త

# స్నేహం సత్యం శివం సుందరం



డా.టి.రాధాకృష్ణమాచార్యులు, 98493 05871

స్నేహం మౌనంగా పలకరిస్తుంది
మొదట హృదయమంతా పాకుతుంది
పిదపమనసులో తిరుగాడు
జీవకళ స్నిగ్ధ సౌందర్య విద్యుల్లత
సోపతి ఆనందాల మంజుల మయూఖ
ఆపతి సంపతిలో
నిత్య నిర్మల పూ పొప్పడి పరిమళం
సాహవాసం అరమరికల్లేని నిస్వార్థ మైత్రి
నిజమొక్కటే ఇలలో...

# మన తెలంగాణ జాతరలు - విశేషాలు

తెలంగాణలో జాతరల సంస్కృతి...



రమావత్ రజిత
72076 61130

అనాదిగా తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి, ఆధ్యాత్మిక వారసత్వానికి నిలయంగా భాసిల్లుతూ వస్తుంది. ఇక్కడి ప్రజల జీవన సంస్కృతిలో భక్తి విశ్వాసాలు, దేవతారాధనలూ ఒక భాగమే. ఈ భక్తిలో రెండు కోణాలు కనిపిస్తాయి. ఒకటి భారతదేశమంతటా జరుపుకునే దసరా, దీపావళి, హోలీ, శ్రీకృష్ణాష్టమి వంటివి అందరితో పాటు జరుపుకుంటారు. తెలంగాణకు మాత్రమే సంబంధించిన బతుకమ్మ, బోనాలు వంటి పండుగలను ప్రత్యేకంగా జరుపుకుంటారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న క్షేత్రాల్లో, గద్దెలలో, కొండలలో ప్రత్యేకంగా నిర్ణీత సమయంలో జాతరలు జరుపుకుంటారు. ఈ జాతరలు కొన్నిరోజులపాటు జరుగుతాయి. వీటిల్లో శక్తి ఆరాధనలు, గ్రామదేవతల ఆరాధనలు, శైవ, వైష్ణవ సంబంధిత దేవతారాధనలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆయా జాతుల వెనుక ఉండే చారిత్రక కథనాలు కనిపిస్తాయి. ఆయా జాతరల వెనుక ఉండే చారిత్రక కథనాలు ఎంతో ప్రేరణాత్మకంగా ఉంటాయి. లోక కళ్యాణం కోసం ప్రాణత్యాగం చేసిన దేవతలు కొందరైతే, తమ మహిమలతో, లీలలతో సత్యాన్ని గెలిపించిన దేవతలు కొందరు. మొత్తంగా తెలంగాణ నలుమూలలా అనేక జాతరలు ప్రతి సంవత్సరం జరుగుతుండడం వలన ఇక్కడి ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనలు వికసిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుంటుంది అన్నది సంభాషించదగ్గ విషయం.

భారతీయ హిందూ సంప్రదాయంలో దేవుళ్ళను, దేవతలను, వీరవనితలను, పుణ్యస్త్రీలను, మహిమగల స్త్రీ పురుషులను కొలవడం (మొక్కడం) అనాదిగా వస్తూ ఉంది. ఏదైనా ఒక దేవతను కానీ, దేవున్ని కానీ కొన్ని ప్రత్యేకమైన మాసాలలో నిర్దిష్టమైన రోజులలో పూజించి పండుగ చేయడాన్ని జాతర అంటారు ప్రతి గ్రామానికి ఒక గ్రామదేవత ఉన్న మన తెలంగాణలో ఎన్నో విశేషాలతో కూడిన అనేక జాతరలు జరుగుతూ ఉంటాయి. ఈ జాతరలలో కొన్నింటిని ఆయా ప్రాంతాల ప్రజలే జరుపుకుంటుండగా, మరికొన్నింటిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుంది.

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే జాతరలలో అనేక జాతరలు జానపదుల శైలిని తలపిస్తాయి. ఆచార్య నాయని కృష్ణకుమారి చెప్పినట్లు "జానపదుల ఆచారాలు, విశ్వాసాలు, మొక్కులు, నైవేద్యాలు" అన్ని జానపదమే అని భావించాలి. పరిణామంలో భాగంగా జీవన విధానంలో ఎన్నో మార్పులని చేసుకున్న మనమంతా (మనుషులంతా) ఏదో ఒక విషయంలో జానపదులమేగా. అందుకేనేమో ఇంతటి 4జి ఇంటర్నెట్ హైస్పీడు యుగంలో తెలంగాణలో జరిగే ప్రముఖ జాతరలకు జనం వరదలా పోటెత్తి వస్తుంటారు.

తెలంగాణలో జరిగే ప్రముఖ జాతరలను చూసినట్లయితే... సమ్మక్క సారక్క జాతర, గొల్లగట్టు జాతర, కొండగట్టు జాతర, కొమురవెల్లి మల్లన్న జాతర, ఏడుపాయల జాతర, నాగోబా జాతర, గంగమ్మ జాతర, మల్లూర్ జాతర, వేలాల జాతర, అయినవోలు జాతర, కొరివి జాతర, నల్లగొండ జాతర, తుల్జాభవాని జాతర, గద్వాల్ జాతర, చేవెళ్ళ జాతర, జోగినాథుని జాతర, కేతకి సంగమేశ్వరస్వామి జాతర, సింగరాయ జాతర, తేగడ జాతర, మన్యంకొండ జాతర, గంగాపురం జాతర, కురుమూర్తి జాతర, సలేశ్వరం జాతర, కొటంచ జాతర, కూడెల్లి జాతర, పుల్లూరు జాతర, దుద్దెడ జాతర, చెరువుగట్టు జాతర, మేళ్ళచెరువు జాతర, మునీశ్వరుల జాతర, అర్వపల్లి జాతర, సోమప్ప జాతర, శంభులింగేశ్వర జాతర మొదలైనవి తెలంగాణ రాష్ట్రంలో జరిగే జాతరలు. ఇవి ఒక్కొక్కటి ఒక్కో ప్రత్యేక రోజులలో జరుపబడతాయి. తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాలలో జాతరలు జరుగుతాయి. ప్రతి జిల్లాలోనూ ఏదో ఒక జాతర జరగడం ఇక్కడి ఆధ్యాత్మిక వారసత్వానికి

వ్యా
స
ం

నిదర్శనంగా భావించవచ్చు.

విశేషమేమిటంటే ఈ జాతరలన్నిం టిలో ఎక్కువ జాతరలు శివపార్వతులకు సంబంధించిన జాతరలే ఉన్నాయి. ఇందులోనూ ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో అధికసంఖ్యలో శైవజాతరలున్నాయి. హైదరాబాద్ - విజయవాడ నేషనల్ హైవేకి సమీపంలో నల్లగొండ జిల్లా చెరువుగట్టులో ఆరాధించబడేది శివపార్వతులే. అదేవిధంగా నల్లగొండ జిల్లా పరిధి ముగిసే మేళ్ళచెరువు గుంటూరు, కృష్ణాజిల్లాలు ప్రవేశించే దారిలో ఉంది. ఇక్కడ కూడా శివపార్వతుల కళ్యాణం, జాతర జరుపుతారు. ఒకప్పుడు నల్లగొండ జిల్లాలో బౌద్ధం వెలుగొందిన ఆనవాళ్ళు నాగార్జునసాగర్‌లో ఉన్నాయి. అయితే నల్లగొండలోనే కాక మొత్తం తెలంగాణలో శైవం ఇంతలా వ్యాప్తి చెందడానికి గల చారిత్రక విశేషాలను, ఆధారాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది.

**సమ్మక్క - సారక్క జాతర...**

ఈ జాతరను మాఘశుద్ధ పౌర్ణమికి ముందు వచ్చే బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తారు. ఈ జాతరను ఆసియాలోనే అతిపెద్ద గిరిజనజాతరగా యునెస్కో గుర్తించింది. ఇది పూర్వపు వరంగల్ జిల్లా, నేటి ములుగు జిల్లాలో ఉంది. ఈ జాతరను ప్రతి రెండేళ్ళకోసారి జరుపుతారు. మొదటి ప్రతాపరుద్రుడి కాలంలో పొలవాస అనే గిరిజన ప్రాంతాన్ని పాలించే మేడరాజు కాకతీయులకు సామంతరాజు. అతని కూతురే సమ్మక్క. సమ్మక్క భర్త పగిడిద్ద రాజు. వీరి సంతానం సారలమ్మ, నాగులమ్మ, జంపన్న. సారలమ్మ భర్త గోవిందరాజు. ఈ జాతర నాలుగు రోజుల పాటు జరుగుతుంది. మొదటి రోజు పునుగొండ్ల నుంచి పగిడిద్ద రాజును మేడారానికి తీసుకొచ్చి గద్దెపై నిలుపుతారు. రెండోరోజు సారక్కను, మూడోరోజు సమ్మక్కను తీసుకొస్తారు. నాలుగోరోజు సమ్మక్క, సారక్క తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు దేశం నలుమూలల నుంచి సుమారు 5 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా.

**గొల్లగట్టు జాతర...**

తెలంగాణలో రెండో అతిపెద్ద జాతర గొల్లగట్టు జాతర. దీనినే దురాజ్‌పల్లి జాతర అని కూడా అంటారు. ఈ జాతర రెండు సంవత్సరాలకొకసారి జరుగుతుంది. ఇది నాలుగురోజులపాటు జరుగుతుంది. సూర్యాపేట జిల్లాలోని దురాజ్‌పల్లి గ్రామంలో గుట్టపై ఈ జాతర జరుగుతుంది. నల్లగొండ మరియు ఇతర తెలంగాణ జిల్లాలన్నింటిలోనూ లింగమంతుల జాతరగా దీన్ని వ్యవహరిస్తారు. లింగమంతుల స్వామి సోదరి చౌడమ్మను ఇందులో భాగంగా కొలుస్తారు. సూర్యాపేట పట్టణానికి సమీపంలోని కేసారం గ్రామానికి విగ్రహాలున్న పెట్టెను తీసుకెళ్ళి హక్కు దారులకు చూపించి పూజలు చేస్తారు. పసుపుకొండను యాదవులు అలంకరిస్తారు. బోనం నైవేద్యంగా స్వామికి చెల్లించి మొక్కు తీర్చుకుంటారు భక్తులు. ఇలా నాలుగురోజులు ఈ జాతర వైభవంగా జరుగుతుంది.

> **తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే జాతరలలో అనేక జాతరలు జానపదుల శైలిని తలపిస్తాయి. ఆచార్య నాయని కృష్ణకుమారి చెప్పినట్లు 'జానపదుల ఆచారాలు, విశ్వాసాలు, మొక్కులు, నైవేద్యాలు" అన్ని జానపదమే అని భావించాలి. పరిణామంలో భాగంగా జీవన విధానంలో ఎన్నో మార్పులని చేసుకున్న మనమంతా (మనుషులంతా) ఏదో ఒక విషయంలో జానపదులమేగా.**

**నాగోబా జాతర...**

గోండులు, పర్ధానుల్లో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో జరుగుతుంది ఈ జాతర. గిరిజనుల్లో ఒక తెగ అయిన గోండుల ఆరాధ్యదైవం నాగోబా. ఆయన పేరుమీదే దీనికి నాగోబా జాతరని పేరొచ్చింది. ఇది ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలోని ముత్నూరు గ్రామ పరిసరాల్లో ఉన్న కేస్లాపూర్‌లో జరుపబడుతుంది. పుష్యమాసంలో అమావాస్య రోజున ఈ జాతర జరుపబడుతుంది. తెంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా మొదలైన ప్రాంతాల నుంచి గోండులు, ఇతర భక్తులు పెద్దసంఖ్యలో ఈ జాతరకు వెళ్తుంటారు.



సమ్మక్క - సారక్క జాతర



నాగోబా జాతర


కొమురవెల్లి మల్లన్న జాతర...


కొండగట్టు అంజన్న జాతర...

**కొమురవెల్లి మల్లన్న జాతర...**

ఈ జాతర సిద్దిపేట జిల్లాలోని చేర్యాల మండలంలో గల కొమురవెల్లి గ్రామంలో నిర్వహింపబడుతుంది. ఈ జాతరలో పూజించబడే దేవుడు శివుడు. శివపార్వతుల కళ్యాణం ఇక్కడ కన్నుల పండుగగా ఉంటుంది. ఈ జాతరను ప్రతిసంవత్సరం జరుపుతారు. దీన్ని ప్రతి సంవత్సరం మాఘమాసం నుంచి చైత్రమాసం (ఉగాది) వరకు జరుపుతారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భక్తులంతా ఈ జాతరకు విచ్చేస్తారు. ఇక్కడ కోడెదూడలను విడవడం విశేషం.

**కొండగట్టు అంజన్న జాతర...**

ఈ జాతర కరీంనగర్ జిల్లా ముత్యంపేట పరిసర సమీపంలో నిర్వహిస్తారు. ఆంజనేయస్వామినే కొండగట్టు అంజన్నగా భక్తులు పిలుస్తారు. ఇక్కడ హనుమంతుడు ఒకవైపు ఆంజనేయస్వామి ముఖంతో, ఇంకోవైపు నరసింహస్వామి ముఖంతో రెండు ముఖాలతో దర్శనమిస్తాడు. ఈ జాతరకు ముందే భక్తులు ఆంజనేయస్వామి మాలను ధరిస్తారు. నలభైరోజులపాటు నిష్టగా ఉండి శాఖాహారాన్నే భుజిస్తారు. ఇంటిదగ్గర నుంచి ముడుపు కట్టుకు వచ్చి జాతరలోనే కాక పరిసర రాష్ట్రాల్లోనూ అతిపెద్దగా జరిగే ఆంజనేయస్వామి జాతర ఇదే కావడం విశేషం.

**ఏడుపాయల జాతర...**

ఈ జాతర మెదక్ జిల్లాలోని నాగసానపల్లిలో జరుగుతుంది. మంజీరా నది ఉపనదులైన ఏడునదులు సంగమం చెందుతాయి. ప్రతి సంవత్సరం శివరాత్రి రోజున ఈ జాతర నిర్వహిస్తారు. ఇది మూడురోజులపాటు జరుగుతుంది. గ్రామీణ జీవనంలోని 18 వర్గాల వారు ఈ జాతరలో ప్రతినిధులుగా పాల్గొంటారు. ఇక్కడ అమ్మవారు దుర్గాభవానీదేవి. ఈ జాతరకు రాష్ట్రం నలువైపుల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తారు.

> **భారతదేశంలో**
> **తెలంగాణకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి భాష, ఆచారాలు, సంస్కృతులు అందుకు ప్రధాన కారణాలు. ఎన్నో విషయాల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ప్రజల మనోభావాలకు గౌరవం ఇస్తూ ప్రతియేటా ఈ ప్రాంతం లోని అనేక జాతరలను అధికారికంగా నిర్వహిస్తుండడం వల్ల ఆయా జాతరలకు ప్రపంచస్థాయి గుర్తింపు కలుగుతుంది.**

**చెరువుగట్టు జాతర...**

హైదరాబాద్ వాసులు విశేషంగా వచ్చే చెరువుగట్టు జాతర. హైదరాబాద్ నుండి గుంటూరు వెళ్లేమార్గంలో నల్లగొండ జిల్లాలో కొండమీద దర్శనమిస్తుంది చెరువుగట్టు. ఇక్కడ శివపార్వతులు దైవాలు. ప్రతి శివరాత్రికి ఇక్కడ మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. ఇదేకాకుండా ప్రతి అమావాస్యనాడు భక్తులు ఇక్కడ నిద్రచేసి పోతుంటారు. తెలంగాణలోని చుట్టూరా జిల్లాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ జాతరకు వస్తారు.

ఈ విధంగా తెలంగాణ జాతరల ద్వారా భక్తి, పారవశ్యం, ఆధ్యాత్మిక సౌందర్యాలు వెల్లివిరుస్తున్నాయి. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ'' అని దాశరథి అన్నట్లు, కళల కణాచి తెలంగాణా అని సాహితీకారులు వేనోళ్ళ పొగిడినట్టు ఆధ్యాత్మిక చింతన, చైతన్యాల్లోనూ తెలంగాణ అగ్రగామి అని


ఏడుపాయల జాతర...


చెరువుగట్టు జాతర...

చెప్పవచ్చు. సంవత్సరం పొడుగునా ఏదో ఒక ప్రాంతంలో జరిగే జాతరలే అందుకు నిదర్శనం.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు, పండుగలకు, జాతరలకు పెద్దపీట వేయడం వాటి నిర్వహణ కోసం పెద్దమొత్తంలో నిధులు కేటాయించడం ఆనందించదగ్గ విషయం. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం తెలుగు వారి జాతరలు, గిరిజన జాతరలు, ముస్లిం ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తూండటం దేశానికే ఆదర్శం. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గిరిజన జాతరలు సంతు సేవాలాల్ జయంతి, నాంచారమ్మ జాతర, సమ్మక్క సారక్క జాతర, జంగుబాయి జాతర, కేస్లాపూర్ నాగోబా జాతర, గాంధారి జాతర, పూలాజీ బాబా జాతర. వీటితోపాటు సూర్యాపేట జిల్లా పాలక వీడు మండలంలోని జానపహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలని తెలంగాణ ప్రభుత్వమే నిర్వహిస్తుంది.

భారతదేశంలో తెలంగాణకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి భాష, ఆచారాలు, సంస్కృతులు అందుకు ప్రధాన కారణాలు. ఎన్నో విషయాల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ప్రజల మనోభావాలకు గౌరవం ఇస్తూ ప్రతియేటా ఈ ప్రాంతంలోని అనేక జాతరలను అధికారికంగా నిర్వహిస్తుండడం వల్ల ఆయా జాతరలకు ప్రపంచస్థాయి గుర్తింపు కలుగుతుంది. జాతరల విషయంలో తెలంగాణ ప్రజల మరియు ప్రభుత్వాల సహకారం ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవచ్చు. కులమతాలకు అతీతంగా ఇక్కడి ప్రజలు ఉత్సవాల్లో పాల్గొనడం చూస్తుంటాం. ఏదేమైనా వేల సంవత్సరాల చారిత్రక వారసత్వ నేపథ్యం కలిగిన తెలంగాణ రాష్ట్రానికి ఇక్కడి జాతరలు మరింత శోభాయమానం అవుతున్నాయి అనడంలో సందేహం లేదు.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# సంస్కార వారధి

కొడుకు కుటుంబానికి సంస్కారం నేర్పిన తండ్రి...



కటుకోజ్వల మనోహరాచారి
94410 23599

కొడుకు కోడల్ని చూడక చాలా రోజులయ్యేసరికి రాఘవయ్య, జానకి దంపతులకు పిల్లల మీదకు మనసు పోతోంది. రాఘవయ్య మనసు చిక్కబట్టుకున్నప్పటికీ జానకి మాత్రం ఉండలేక పోయింది. ఎట్లాగైనా భర్తను ఒప్పించి పట్నం బయలుదేర దీయాలనుకొంది.

కొడుకు జీవన్, కోడలు మాధురిలు పట్నంలో బిజీ షెడ్యూల్లలో గడుపుతుంటారని, వాళ్లను ఇబ్బందిపెట్టడం బాగుండదన్నది రాఘవయ్య భావన. సంవత్సరం అవుతుంది పట్నంలో కొడుకింట్లో కాలుపెట్టక. ఆర్నెళ్లక్రితం చుక్కతెగి రాలిపడినట్లు అలావచ్చి ఇలా వెళ్లిపోయారు తప్పితే, ఈ తల్లిదండ్రుల్తో నాల్రోజులు గడుపుదామన్న ధ్యాసలేదు వాళ్లకు. ఎప్పుడు చూసినా పని ఒత్తిడి అంటూ పరుగులుపెడుతుంటాడు జీవన్. అందుకే ఈసారి బలవంతంగానైనా భర్తను ఒప్పించి ఇల్లు కదిలేలా చేసింది జానకి.

పొద్దున్నే పట్నం బస్సెక్కేశారు దంపతులిద్దరూ. పంటపొలాలు, తోటలతో ఈ వయసులోకూడా తీరికలేకుండా గడిపే రాఘవయ్యకు పట్నంబాట తొక్కడమంటే మహా చిరాకు. భార్య మొండి పట్టుకు అసంతృప్తిగానే బయలుదేరాడు. కొడుక్కి ఫోన్ చేస్తే క్యాబ్ బుక్ చేసేవాడు. అయినా అతన్ని మాటిమాటికీ డిస్టర్బ్ చేయొద్దనే ఉద్దేశంతోనే ఫోన్ కూడా చేయకుండా బయలుదేరారు. తెలిసిన అడ్రసే కావడంతో, సిటీలో బస్ దిగడం, ఆటో మాట్లాడుకొని ఇంటికి చేరడం జరిగిపోయింది.

ఎనిమిది అంతస్తులున్న పెద్ద అపార్ట్మెంటు అది. లిఫ్ట్ ఎక్కి ఆరో అంతస్థుకు చేరుకున్నారు. 'సంస్కృతీ నిలయం' అని రాసున్న గదిముందు నిలిచి కాలింగ్ బెల్ నొక్కారు. రెండు మూడు నిముషాలైనా తలుపు తెరుచుకోలేదు. జానకికి ఆతృతగా ఉంది. నాలుగైదు సార్లు బెల్ నొక్కినా తెరుచుకోకపోయేసరికి వాళ్లు ఉన్నారో లేదో అనే సందేహం కూడా కలిగింది రాఘవయ్యకి. మళ్లీ ఓసారి ప్రయత్నించేసరికి జీవన్ కొడుకు చింటూ తలుపు తెరిచాడు. వాళ్లవైపు ఓసారి చూసి తాతయ్య నానమ్మల పలకరింపు కూడా వినిపించుకోకుండా హాల్లోకి పరుగెత్తి తల్లికి చెప్పాడు. "అమ్మా! పల్లెనుండి తాతయ్య, నానమ్మలు వచ్చారు.." అని పడకగదిలో దూరిపోయాడు.

జానకి రాఘవయ్యలు ఇంట్లోకి అడుగుపెట్టారు. "ఇప్పుడేనా రాక మావయ్యా.." అంది మాధురి. టీవి ముందుకెళ్లి లేవకుండానే "ఆరోగ్యం మంచిగుందా అత్తమ్మా!" అంది.

"బాగానే ఉందమ్మా..! చాలా రోజులాయె కదా! నిన్నూ, పిల్లల్ని చూడక. మనసు ఉండబట్టలేక బయలుదేరాము" అంది జానకి. బ్యాగు ఓ మూలన పెట్టి బాత్రూంలోకెళ్లి కాళ్లూ చేతులూ కడుక్కొని వచ్చారు.

"పిల్లలు చదువుకోవడానికి వెళ్తున్నారా...?" అన్నాడు రాఘవయ్య. పల్లెనుండి తెచ్చిన కొబ్బరిబొండాలు, మామిడి కాయలు సంచీ విప్పి బయటపెడుతూ.

"ఆ.. మామయ్య! ఈ రోజు సెలవుకదా... ఇంట్లోనే ఉన్నారు" అంది మాధురి. ఆయన చేస్తున్న పనివైపు ఓ చూపు చూసి మళ్లీ టీవి ఛానల్ లో తలదూర్చింది.

"ఔనవును.. కనిపించగానే మాయమయ్యాడు చింటూ. ఇంతకీ ఎటు పోయాడు..."అంటూ డ్రాయింగ్ రూం లోకి తొంగి చూశాడు రాఘవయ్య.

లోన కొడుకు జీవన్ కంప్యూటర్ తో కుస్తీ పడుతున్నాడు. తలయెత్తి చూసి "ఎప్పుడొచ్చారు నాన్నా.. ఫోనైనా చెయ్యలేదు" అన్నాడు.

"ఇప్పుడే వచ్చాం లే! నువ్వెట్లాగూ పనిలో ఉంటావు. మీ అమ్మ రోజూ పిల్లలు గుర్తుకొస్తున్నారు.. అని నస పెడుతుంది. సెలవురోజు కదా ఓసారి చూసిపోవచ్చని నేరుగా వచ్చేశాం" అన్నాడు రాఘవయ్య.

"అమ్మకూడా వచ్చిందా..!? సరే నాన్నా.. కూర్చోండి, ఇప్పుడే వస్తాను.."

అని తన పనిలో నిమగ్నమైపోయాడు.

రాఘవయ్య జానకిలు 'పిల్లలేమైపోయా రబ్బా..' అనుకుంటూ బెడ్ రూంలోకి వెళ్లారు.

బెడ్ పైన బోర్లా పడుకొని వీడియోగేమ్ లో మునిగితేలుతున్నాడు చింటు.

"ఏరా చింటూ బాగున్నావా.." అంది నాయనమ్మ.

"చిట్టితల్లీ..! మంచి గున్నావా..?" పలకరించాడు రాఘవయ్య. ఆమె తలయెత్తి వాళ్లవైపుచూసి "హాయ్.." అని చెయ్యూపి తిరిగి తన ఛాటింగ్‌లో మునిగి పోయింది. చేసేదిలేక హాల్లోకొచ్చారు దంపతులిద్దరూ. "పొద్దున్నే బయలుదేరాం. మామయ్యకు ఆకలిగా ఉందమ్మా. వంటైనా చేశావా.." అంటూ వంటింట్లోకి నడిచింది జానకి. ఉసూరు మంటూ లేచి వంటింట్లోకి వచ్చింది కోడలు. ఇద్దరూ కలిసి వంట కార్యక్రమానికి దిగారు.

వాడు "అప్పుడే చెప్పాను కదా బాగున్నానని.." అని తన పనిలో నిమగ్నమైపోయాడు. మరో మూలకు చేరగిలపడి వాట్సాప్‌లో స్నేహితులతో ఛాటింగ్ చేస్తుంది మనవరాలు డాలి.

"చిట్టితల్లీ..! మంచిగున్నావా..?" పలకరించాడు రాఘవయ్య. ఆమె తలయెత్తి వాళ్లవైపుచూసి "హాయ్.." అని చెయ్యూపి తిరిగి తన ఛాటింగ్‌లో మునిగిపోయింది.

చేసేదిలేక హాల్లోకొచ్చారు దంపతులిద్దరూ.

"పొద్దున్నే బయలుదేరాం. మామయ్యకు ఆకలిగా ఉందమ్మా. వంటైనా చేశావా.." అంటూ వంటింట్లోకి నడిచింది జానకి. ఉసూరుమంటూ లేచి వంటింట్లోకి వచ్చింది కోడలు. ఇద్దరూ కలిసి వంట కార్యక్రమానికి దిగారు.

గంట తర్వాత వంట పూర్తి చేసి భోజనాలకు లేవనెత్తారు. "నాకు పనుంది మీరు తినండి" అన్నాడు జీవన్. అత్తామామలు ఒకసారి, కోడలు ఒకసారి, కొడుకోసారి, కూతురోసారి.. ఎవరికి తోచినట్లుగా వారు వడ్డించుకొని తిన్నారు. తర్వాత ఎప్పట్లాగే సీరియల్లో ఒకరు, సెల్ ఫోన్లో ఒకరు, కంప్యూటర్లో ఒకరు తలదూర్చారు.

సాయంత్రం వరకు ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు తప్ప ఈ ముసలి దంపతులతో సరదాగా మాట్లాడింది ఎవరూలేరు.

రాఘవయ్యకు అసహనం పెరిగి పోయింది. కుటుంబము, బంధాలు మంటగలిసిపోయి, అప్యాయతలు అణగారిపోయినట్లుగా, మరమనుషుల్లా తయారైన వారిమధ్య యంత్రశాలలో ఉన్న భావన కలుగుతుంది. ఎవర్ని ఏదడిగినా ముక్తసరిగా జవాబు రావడం తప్ప, తన వారితో ఆత్మీయంగా స్పందించాలనే ఆలోచననే కనిపించడం లేదు. జానకమ్మ అయితే పిసై బసెక్కిపోదామన్నంత ఉద్వేగానికి లోనవుతుంది.

రాత్రి భోజనాలయ్యాక పిల్లలిద్దర్నీ పిలిచి బలవంతంగా పక్కన కూచోబెట్టు కున్నాడు రాఘవయ్య. "కాసేపు ఆ సెల్ ఫోన్లు పక్కన బెడితే మిమ్మల్నో ప్రశ్న అడుగుదామనుకుంటున్నా" అన్నాడు.

అయిష్టంగానే అయినా కాసేపు మొబైల్ ను కిందకు దించి "అడుగూ మా స్కూల్లో క్విజ్ పోటీలో ఎప్పుడూ సెకండ్ ప్రైజ్ నాదే..!" అన్నాడు చింటూ.

"సంస్కృతి అంటే ఏమిటో తెల్సా?" అన్నాడు రాఘవయ్య.

"అంటే..?!" పిల్లలిద్దరూ నోరెళ్ల బెట్టారు. వింటున్న కొడుకూ, కోడలూ కూడా అర్థం కానట్లు చూస్తుండిపోయారు.

"పెద్దలు ఇంటికి వస్తే రెండు చేతులెత్తి నమస్కారం చెప్పడం, కాళ్లు కడుక్కోవడానికి నీళ్లివ్వడం, దారినపోయే దానయ్యకు కూడా అన్నంపెట్టి ఆదరించడం ఇట్లాంటివే మన సంస్కృతి. ఈ సెల్ ఫోన్ గేములు, వాట్సాప్ ఛాటింగులు,



కథ

టీవీ సీరియళ్ల గోలలో అవన్నీ మరుగున పడిపోయాయి. ఖాళీ సమయంలో ఒకప్పుడు మంచిమంచి పుస్తకాలు చదివేవారు. ఇప్పుడదీ లేదు. ఒకప్పుడు పిల్లలకు తాతలు, నాయనమ్మలు మంచిమంచి రామాయణ, మహాభారత కథలు చెప్పేవారు. వాటితో పిల్లలకు విలువలు, నడవడిక తెలిసేది. ఇప్పుడు మాలాంటి తాతలు నాయనమ్మలు పల్లెలకే పరిమితమైపోయారు. ఇంక ఎట్లా తెలుస్తుంది...?'' ఇంటిల్లిపాదీ అలా శిలాప్రతిమల్లా స్థాణువులై వింటున్నారు.

రాఘవయ్య చెప్పుకు పోతున్నాడు. “ఫ్యాషన్ పేరుతో సగం వస్త్రాలు, చింపిరి జుత్తు, బొట్టూ బోనం లేని పాశ్చాత్య సంస్కృతి వచ్చిచేరింది. ఒకవైపు పరాయిదేశాలవారు మన కట్టు బొట్టు వైపు ఆకర్షితులవుతుంటే మనవారేమో తెచ్చిపెట్టుకున్న సంస్కృతితో పతనం వైపు పోతున్నారు. మామ్, డాడ్ అంటూ ఇంగ్లీషు వ్యామోహంలో సొంతభాషను, సొంతవారిని, సొంత దేశాన్ని మరచిపోతున్నారు...'' రాఘవయ్య ఆగాడు.

“ఇంగ్లీషు నేర్చుకోవద్దా తాతయ్యా..'' అంది డాలి.

“ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పు కాదు. నువ్వు ప్రపంచంలో ఉన్న ఎన్ని భాషల్నైనా నేర్చుకోవచ్చు. కానీ మాతృభాషను , మాతృభూమినీ మరవద్దని చెబుతున్నాను. ఫోన్లు, టీవీలు అవసరమే కావచ్చు.. కానీ అదే లోకం కాదు కదా! కనుక.. సంస్కృతీ సాంప్రదాయాలు లేని ఇట్లాంటి ఇంట్లో నేను ఎక్కువసేపు ఉండలేను.'' రాఘవయ్య లేచాడు. సంచీ పట్టుకొని భార్యను కూడా లేవదీశాడు.

పిల్లలిద్దరూ విచలితులయ్యారు. తాతయ్య వైపు బేలగా చూశారు.

జీవన్ మాధురిలకు ఏం చేయాలో తోచలేదు, తండ్రి తమ పిల్లలపట్లనే అంత ఖచ్చితత్వం ప్రదర్శించాడంటే తమ పెంపకాన్ని, తమను పూర్తిగా అసహ్యించుకుంటున్నట్లే. మొదలే తన తండ్రి చాలా పట్టుదల కలిగిన మనిషి. సాంప్రదాయాల్ని గౌరవించే వ్యక్తిగా ఆయన దృష్టిలో తాము సాంప్రదాయ వ్యతిరేకులుగా ముద్ర పడ్డామే అనుకో.. ఇక జన్మలో తమను క్షమించడు. ఆయన అండదండలు లేకుండా తాము మున్ముందు అభివృద్ధి సాధించలేము. ఇది జీవన్ మాధురిలకూ తెల్సు.

నిముషాల్లో దంపతులిద్దరికీ కనువిప్పు కలిగింది. “ఒక్క పదినిముషాలు ఓపికపట్టండి నాన్నా..'' అంటూ మాధురితో కల్సి లోపలికి నడిచాడు. సరిగ్గా పదినిముషాల తర్వాత రెండు పెద్ద బ్యాగులతో బయటకొచ్చారు. “పదండి నాన్నా! మేమూ వస్తాము. కొన్నాళ్ళు మేమూ పల్లెటూళ్లో ఉండదల్చుకున్నాము, మా పిల్లలకు సంస్కృతీ సాంప్రదాయాలు ఒంటబట్టించాల్సింది మీరే కదా.. పదండి'' అన్నాడు.

**నిముషాల్లో**
**దంపతులిద్దరికీ కనువిప్పు కలిగింది. “ఒక్క పదినిముషాలు ఓపికపట్టండి నాన్నా..” అంటూ మాధురితో కల్సి లోపలికి నడిచాడు. సరిగ్గా పది నిముషాల తర్వాత రెండు పెద్ద బ్యాగులతో బయటకొచ్చారు. “పదండి నాన్నా! మేమూ వస్తాము. కొన్నాళ్లు మేమూ పల్లెటూళ్లో ఉండదల్చుకున్నాము, మా పిల్లలకు సంస్కృతీ సాంప్రదాయాలు ఒంట బట్టించాల్సింది మీరే కదా.. పదండి” అన్నాడు.**

'ఒకరకంగా మాక్కూడా..' అన్నట్లు మొహం పెట్టింది మాధురి.

వారి వాలకం గ్రహించిన వారిలా రాఘవయ్య జానకి దంపతులు మనుమడు మనవరాళ్లను పల్లెబాట పట్టించారు. కారు వెనుకసీట్లో తాతయ్య నానమ్మలకు చెరోవైపు కూచున్న డాలీ, చింటులు పల్లె చేరేవరకూ ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. వాటన్నిటికీ రాఘవయ్య ఓపిగ్గా సమాధానాలు చెబుతూనే ఉన్నాడు.

రెండు గంటలు గడిచాక.. మెల్లగా పట్నం వాసనల జోరు తగ్గి, పల్లె సుగంధాలు నాసికా పుటాలకు సోకి నవోత్తేజాన్ని కలిగిస్తున్నాయి వాళ్లలో.

కవిత

# రాత్రి ధాత్రి



రేడియమ్, 92915 27757

రాత్రి మత్తులో తూగకు
కలల ఊయలలో ఊగకు
నిశి విశ్రాంతి నిలయం
శ్రమ విరామ ఆలయం
కొందరికి శుభరాత్రి
మరి కొందరికి
బాధల గాథల
రెప్పవేయని నిషా రాత్రి
విషాద రాత్రి
ఇది జనజీవన
ధాత్రి రాత్రి

# గురి

**అనువాదం : ఎలనాగ, 98669 45424**

**స్పానిష్ మూలం : ఉక్తావియో పాజ్ (Octavio Paz)**
**ఆంగ్లానువాదం : ఎలియట్ వైన్ బర్గర్**
**ఆంగ్లం నుండి అనువాదం : ఎలనాగ**

అల కప్పుతుంది, కనుగొంటుంది, కోలుకుంటుంది
ఎప్పుడూ నగ్నంగా నడుస్తుంది

అల అల్లుతుంది, అల్లినదాన్ని రద్దు చేస్తుంది
హత్తుకుంటుంది, విడిపోతుంది
ఎప్పుడూ ఒకేరకంగా ఉండదు,
వేరేదాని లాగా ఎప్పుడూ ఉండదు

ఉప్పొంగినంత సేపు నిలిచే
రూపాలను చెక్కే శిల్పి అల

అల శిలల్ని పగులగొడుతుంది
శంఖాలకు మెరుగు పెడుతుంది

అల యెప్పుడూ
తనమీద తనే దాడి చేస్తుంది

చంద్రుడు మాట్లాడే ఆద్యంత రహితమైన,
అక్షతమైన మాట తాలూకు
అక్షరాల ఉత్సవం అల

అల ఆగ్రహిస్తుంది,
కొన్ని రాత్రుల్లో తీరాలమీది బండకు కొట్టుకుని
ప్రపంచపు అంతాన్ని ప్రకటిస్తుంది

అదృశ్యమయ్యే తెల్లటోపీలను
తలపై ధరించిన పారదర్శకత అల

శాశ్వతమైన అల,
స్థిమితం లేని అల,
వేళ తప్పని అల

అల... అలతో పాటు దాని చురకత్తులు,
ఖడ్గాలు, దాని చిరిగిన జెండాలు,
విజితులు, విజేతలు
హరిత లాలాజలం అల

సూర్యుని ఛాతీ మీద పడుకుని
చంద్రుణ్ని స్వప్నించే అల

సూర్యుణ్ని తొడుక్కుని చంద్రుణ్ని విడిచేసే అల,
మధ్యాహ్నపు అగ్నికణం
రాత్రి ఊపిరి తాలూకు వక్షచలనం
అయిన నీలి శ్యామల హరిత
ధూమ్రవర్ణ తరంగం అల

రాత్రిపూట ఇసుక మీద
నగ్నపాదాల గొణుగుడు అల

సూర్యోదయమప్పుడు
దినపు కనురెప్పలను తెరుస్తుంది అల

అల అర్ధరాత్రి దాటాక శ్వాసిస్తుంది
నిద్రపోతూ కలల్లో మాట్లాడుతుంది

తీరం తనవైపు విసిరిన శవాలను
నాలుకతో నాకుతుంది అల

అల ఎగురుతుంది, దౌడు తీస్తుంది,
ఊళ పెడుతుంది, తలుపును పడగొడుతుంది,
సామాన్ను ధ్వంసం చేస్తుంది
తర్వాత తీరం మీద నిలబడి ఏడుస్తుంది మార్దవంగా

అగోచర చిహ్నాలైన మరణపు ఆనవాళ్లను
9 శిలల మీద లిఖించే ఉన్మాద మహిళ అల

అల రహస్యాలను ఇసుక కప్పిపెడుతుంది
రాత్రంతా అల ఎవరితో మాట్లాడుతుంది?

అల నిజాయితీ గలది
అది తనలో మునిగి చనిపోయిన అందరిని
అప్పగిస్తుంది ఎప్పటికైనా

తుఫానులు వస్తాయి పోతాయి కానీ
అల మాత్రం నిలిచి వుంటుంది

సముద్ర తీరం మీద ప్రజలు వదిలిన
అసహ్యమైన మురికిని
కష్టపడి కడిగే రజక స్త్రీ అల

తను ఎక్కణ్నుంచి వచ్చిందో
ఎక్కడికి పోవాలో అల జ్ఞాపకం పెట్టుకోదు
రాకపోకల మధ్యలో, తన మధ్యలో,
తనలోపలే తనను తాను కోల్పోతుంది

కొండల శిఖరాల మీద పిడికిలి బిగించి
భూమ్యాకాశాలను భయపెడుతుంది అల

అల చావు లేనిది, దాని సమాధి ఒక ఊయల
తన ఉత్సవానికి గొలుసుతో కట్టివేయబడిన అల

వర్షధారల కింద
సూర్యోదయపు చిత్తచాపల్యంతో
దుఃఖాన్ని మోస్తూ అల

చెట్లను పడగొట్టి నగరాన్ని మింగేస్తుంది అల
మరణించిన లక్షల జలచరాలతో
అంతటా వ్యాపించే మానెమరక అల

వేడిగాలుల పెదవుల కింద,
బాహువుల మధ్య, స్తనాలతో
ఉదరంతో ఊరువులతో పిరుదులతో అల

తియ్యటి నీళ్ల సెలయేరు
గండశిలల్లోంచి ఎగిరి
చేదు నిండిన అలలోకి దూకుతుంది

అల దేవుళ్లకు జనని, తనే ఒక దేవత
పోతురాజు దేవర మృతికి అయోనియా దీవుల్లోని
దీర్ఘరాత్రుల్లో విలపిస్తుంది అల

రసాయనాలతో కలుషితమైన అల
భూగోళాన్ని విషపూరితం చేసే అల

నక్షత్ర సమూహాలు
పాదాల మునివేళ్ల మీద నడిచే
సజీవ రత్నకంబళి అల

తుఫాను కొరడాతో కొట్టగా చెలరేగే సివంగి అల
చంద్రుడు మచ్చిక చేసుకున్న చిరుతపులి అల

అల ఒక భిక్షుకి, ఒక చిరాకైన ఇబ్బంది, ఒక పీడ
తటిత్తు అల వక్షాన్ని చీలుస్తుంది,
నీళ్లలో మునిగి మాయమౌతుంది
తర్వాత పునర్జన్మను పొంది
చిన్న నురగగా మారుతుంది

పసుప్పచ్చని అల డబ్బులు తీసుకుని ఏడ్చే రుదాలి
దాని శోకాల గుంపులు, పైత్యప్రకోపాలే అది
ఫిర్యాదుల విషయంలో ధనికురాలు అల

అల నిద్ర పోతూ నడుస్తుందా,
లేక మేల్కొని నడుస్తుందా?

పసిఫిక్ మహాసముద్రపు, హిందూ మహాసముద్రపు
పగడాల తోటల్లో, తీరం మీది ఉనవాతునా
పట్టణపు
మరుగు ప్రదేశంలో అలల రాకపోకలే
గుసగుసలు, నవ్వులు, గొణుగుళ్లు

ప్రేమికులను మంత్రముగ్ధుల్ని చేసే
హిప్నాటిస్టు అద్దం అల
దూరాలకు తేలుతూ పోయే దిఙ్మండలం అల

ధ్యానమగ్నులైన మునుల చూపుతో
నిండిన నిర్జన ప్రాంతాలను
తన ద్రవహస్తాలతో తెరుస్తుంది అల

అల ఈ మాటలను పైకి లేపుతుంది
క్షణకాలం పాటు వాటిని ఊపుతుంది

పుస్తక పరిచయం

# సృజనకు పదును పెట్టే 'ఆకురాయి'

వ్యాసాల విశ్లేషణ కొత్త చూపుతో...



సాగర్ల సత్తయ్య
79891 17415

సృజనకారునికి మార్గ నిర్దేశం చేసేదే అసలైన విమర్శ. సృజన ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే దిశగా సాగడానికి విమర్శ దిక్సూచిగా పనిచేయాలి. నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా ఆ సాహిత్యంలోని మంచి చెడులను పరామర్శించగలిగే వివేచన విమర్శకుడికి ఉండగలగాలి. కేవలం సాహిత్యకారులను భుజాలకి ఎత్తుకొని భజన చేసే విమర్శకులను పరిహరిస్తే తెలుగు సాహిత్యంలో నికార్సైన విమర్శకులు కొంత తక్కువనే చెప్పాలి. ప్రత్యేకించి మహిళలలో ఇంకా అరుదు. మహిళలు విమర్శరంగంలో రాణించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సందర్భంలో సాహిత్య కారుల సృజనకు పదును పెడుతూ ఆకురాయి వ్యాసాలను వెలువరించారు వర్ధమాన విమర్శకురాలు ఉప్పల పద్మ. 'సాహిత్యాన్ని కాపాడుకోవడానికి పరిపుష్టం చేసుకోవడానికి విమర్శ చాలా అవసరం. గుణ దోష విశ్లేషణ చేసే రచనను విమర్శ అనవచ్చు (ఆకురాయి-పుట సంఖ్య 117) అని ఉప్పల పద్మ ఒకచోట అన్న మాటలు ఈ గ్రంథానికి అక్షరాలా వర్తిస్తాయి.

డాక్టర్ సి. నారాయణరెడ్డి జయంతి సందర్భంగా సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వర్ధమాన రచయిత్రులను ప్రోత్సహించాలనే



ఉప్పల పద్మ

సంకల్పంతో అముద్రిత రచనలను ఆహ్వానించి అందులో వచన కవిత్వం, కథ, విమర్శ ప్రక్రియలలో ఎనిమిది గ్రంథాలను ఎంపిక చేసుకుని ట్రస్టు స్వయంగా ప్రచురించి ఆవిష్కరించింది. ఈ ఎనిమిది గ్రంథాలలో ఎంపికైన ఏకైక విమర్శ గ్రంథం ఆకురాయి. సుశీలా నారాయణ రెడ్డి ట్రస్ట్ అందించిన ఈ గ్రంథాలు తెలుగు సాహిత్యానికి ఒక మేలైన చేర్పు.

సాధారణంగా విమర్శ గ్రంథాలు ఒక కవి సాహిత్యం పైనో లేదా ఒక ప్రక్రియలో వచ్చిన సాహిత్యం పైనో వస్తూ ఉంటాయి. కానీ పలు ప్రక్రియలలో వేరువేరు రచయితలు రాసిన సృజన పైన, కొందరు సాహితీవేత్తల పూర్తి రచనా వ్యాసంగం పైన వచ్చిన వ్యాసాలు, మరికొన్ని పరిశోధనాత్మక వ్యాసాల సమాహారం 'ఆకురాయి'. ఈ గ్రంథంలోని వ్యాసాల వింగడింపు చదువరులకు సౌకర్యవంతంగా కనిపిస్తుంది. కథా సాహిత్యం, పద్య సాహిత్యం, వచన కవిత, బాల సాహిత్యం, ఇతర వ్యాసాలుగా ఈ వ్యాసాల విభజన కనిపిస్తున్నది.

కథా సాహిత్య విభాగంలో ముదిగంటి సుజాతా రెడ్డి రాసిన సుమారు ఐదు కథా సంపుటాలను అధ్యయనం చేసి ఆ కథల్లో స్త్రీ సమస్యలపై, సాధికారతపై ముదిగంటి సుజాతా రెడ్డి దృక్పథాన్ని విమర్శనాత్మకంగా పరామర్శించారు. దోరవేటి రాసిన ఆచార్యదేవోభవ కథలు ఉపాధ్యాయ వృత్తి ఇతివృత్తంగా వచ్చిన కథలు. ఉపాధ్యాయ వృత్తిలోని సాధక బాధకాలను చర్చించిన కథలు. ఈ కథలలోని విలువలను, ఆదర్శాలను, సామాజిక, కౌటుంబిక సంబంధాలను ఉప్పల పద్మ చర్చించారు. నల్లగొండ జిల్లా స్త్రీల కథా సాహిత్యం అనే వ్యాసం పరిశోధనాత్మకంగా రాసిన వ్యాసం. బండారు అచ్చమాంబ మొదలు ఆధునిక కథా రచయిత్రుల వరకు సుమారు ఇరవై ఆరు మంది కథా రచయిత్రులను పరిచయం చేసిన వ్యాసం ఇది. ఎందరో

విస్మృత కథా రచయితలు ఈ వ్యాసంలో దర్శనమిస్తారు.

పద్య సాహిత్య విభాగంలో నల్లగొండ ప్రాంతం నుంచి విస్మరణకు గురి అయిన ఒక అద్భుత కవి మంగళగిరి వేణు గోపాలాచార్యుల పద్య కావ్యాలను, పద్య రచనా నిపుణతను చక్కగా ఆవిష్కరించారు. సామాజిక మాధ్యమం వేదికగా శంకరాభరణం కవుల సమూహం వారు జడ అనే అంశంపై నూట పదహారు కంద పద్యాలతో వచ్చిన జడ కందములపై హృద్యమైన జడకందములు అనే వ్యాసం రాశారు. వస్తువు ఒకటే అయినా కవుల విభిన్న శైలిపై తనదైన విశ్లేషణ ఈ వ్యాసంలో కనిపిస్తుంది. డాక్టర్ చింతోజు మల్లికార్జునచారి రచించిన మల్లికార్జున శతకంపై రాసిన విశ్లేషణలో ఈ శతకం సమాజ స్థితిగతులకు నిలువుటద్దంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. సామాజిక సంస్కార విలువలకు పట్టం కట్టిన వైనాన్ని నిరూపించారు.

వచన కవిత విభాగంలో కాళోజీ సాహిత్యం పై సాధికారికమైన వ్యాసాన్ని ప్రకటించారు. కాళోజీ నారాయణరావు సంస్కరణ దృక్పథాన్ని, ఉద్యమించే స్వభావాన్ని, ధర్మాగ్రహాన్ని, అన్యాయాన్ని ఎదిరించే ధిక్కార గుణాన్ని ప్రతిఫలించే కవితలను సోదాహరణంగా వివరించారు. కాళోజీ రాజకీయ జీవితాన్ని ప్రస్తావించారు. కథకుడిగా కాళోజీ ప్రస్థానాన్ని, తెలియజేశారు. కాళోజీ సమగ్ర ఆలోకనంగా ఈ వ్యాసం దర్శన మిస్తున్నది. ఈ పుస్తకంలో తలమానికం అనదగిన వ్యాసం 'ఎదను తడిమిన కవిత' డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రాసిన మూలములుపు కవితా సంపుటిలోని 'గాయపడ్డాకే' అనే ఒకే ఒక్క కవితను సమగ్రంగా విశ్లేషించిన వ్యాసమిది. గాయపడ్డాకే అనే కవిత విమర్శకురాలిని ఎంతో ఆకర్షించినట్లు ఈ వ్యాసం చదివితే అవగతమవుతున్నది. సమాజంలోని భిన్న మనస్తత్వాలు, ఆధునిక పోటీ ప్రపంచంలో మనిషిగా చేసే నిత్య పోరాటం అంతర్గత సంఘర్షణ ఆమూలాగ్రం చర్చించింది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము నుంచి దాశరథి పురస్కారాన్ని అందుకున్న వేణు సంకోజు తొలి కవిత్వ సంపుటి మనిషిగా పూచే మట్టి గురించి, ఆ గ్రంథంలోని మానవీయ విలువల గురించి 'కవిత్వమై పుష్పించిన మట్టి' అనే వ్యాసం తెలియజేసింది. వేణు సంకోజు కవిత్వ లక్ష్యాన్ని, తనదైన శైలిని ఈ వ్యాసం ప్రతిఫలిస్తోంది. సమాజ అపసవ్యాలపై స్పందించే హృదయం ఉన్న కవి పెరుమాళ్ళ ఆనంద్. ఆనంద్ కవిత్వంలో సమాజ వేదన ప్రతిధ్వనిస్తుంది. పరిష్కార మార్గాలు కనిపిస్తాయి. 'కాలస్పర్శ'గా వచ్చిన ఈ కవిత్వాన్ని సామాజిక చైతన్య వాహికగా ఈ విమర్శకురాలు అభివర్ణించారు. సమాజ సజీవ చిత్రంగా ఈ గ్రంథాన్ని వ్యాఖ్యానించారు.




బాల సాహిత్యం విభాగంలో తెలుగు బాల సాహిత్యానికి ఎనలేని సేవలందించిన పెండెం జగదీశ్వర్ కథలలో తెలంగాణ భాషకు పట్టం కట్టిన వైనాన్ని ఉప్పల పద్మ తన వ్యాసంలో చిత్రించింది. సాధారణంగా పెద్దల సాహిత్యంలో మాండలికం కనిపిస్తుంది కానీ బాలల సాహిత్యంలో ఈ వరవడిని తెలంగాణ ప్రాంతంలో ప్రవేశపెట్టిన విశిష్ట రచయితగా జగదీశ్వర్ కృషిని ఈ వ్యాసం ప్రశంసించింది. బాలల వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసేవి బాలల కథలు. ఈ లక్ష్యంతో కథలు రాస్తున్న విశిష్ట బాలల రచయిత గరిపల్లి అశోక్. వీరి కథా సాహిత్యాన్ని సమీక్షిస్తూ గరిపల్లి అశోక్ కథలు బాలల మూర్తిమత్వ వికాస సోపానాలుగా నిర్వచించింది. మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో మహాత్ముని 150 వ జయంతి సందర్భంగా డాక్టర్ పత్తిపాక మోహన్, దరిపల్లి అశోక్ సంపాదకత్వంలో తెలంగాణ బడి పిల్లల కవిత్వం 'ఆకుపచ్చని ఆశలతో' వెలువడింది. పర్యావరణ స్పృహ కలిగించే లక్ష్యంతో ప్రచురించిన ఈ కవిత్వంలో తెలంగాణ జిల్లాల్లోని నూట యాభై ఒక్క మంది బాల రచయితలు రాసిన కవితలు ఉన్నాయి. ఈ చిట్టి కలాల కవిత్వ శక్తిని తెలంగాణ బడి పిల్లల పచ్చని కవిత్వం అనే వ్యాసంలో చక్కగా అంచనా వేశారు. బాల సాహిత్యంలో భాగంగా ఇటీవలి

**బాల సాహిత్యం విభాగంలో తెలుగు బాల సాహిత్యానికి ఎనలేని సేవలందించిన పెండెం జగదీశ్వర్ కథలలో తెలంగాణ భాషకు పట్టం కట్టిన వైనాన్ని ఉప్పల పద్మ తన వ్యాసంలో చిత్రించింది. సాధారణంగా పెద్దల సాహిత్యంలో మాండలికం కనిపిస్తుంది కానీ బాలల సాహిత్యంలో ఈ వరవడిని తెలంగాణ ప్రాంతంలో ప్రవేశ పెట్టిన విశిష్ట రచయితగా జగదీశ్వర్ కృషిని ఈ వ్యాసం ప్రశంసించింది.**

పుస్తక పరిచయం

కాలంలో పాఠశాల స్థాయి పిల్లలు రచనలు ముద్రణ రూపం దాల్చడం అధికమైంది. అయితే ఇందులో ఎక్కువగా బాలల కథలు, ఆ తరువాత చిన్న చిన్న వచన కవితలు కనిపిస్తున్నాయి. కానీ మాత్రా బద్ధమైన గేయ ఛందస్సులో పాటల సంకలనం వెలువరించడం విశేషమైనదే. ఆ ప్రయత్నం ఖమ్మం జిల్లా చెరుపు మాదారం పిల్లలు చేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్య సంపాదకత్వంలో కోయిలాలో కోయిలా గేయ సంకలనం వెలువరించారు. ఈ సంకలనాన్ని చిట్టికలాల సృజన సంతకం పేరుతో ఉప్పల పద్మ చక్కగా విశ్లేషించారు. ఈ పాటల్లోని వయసు వైవిధ్యాన్ని విద్యార్థుల సామాజిక స్పృహను ఈ వ్యాసంలో చక్కగా ఉటంకించారు. ప్రక్రియాపరంగా మరో వైవిధ్యభరితమైన పుస్తకం 'రెక్క విప్పిన బాల్యం'. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వట్టిమర్తి బడి పిల్లలు పాపికొండలు యాత్రకు వెళ్లి వారు తరగతి గదిలో పంచుకున్న అనుభవాలకు అక్షర రూపం ఈ పుస్తకం. ఇది యాత్రాస్మృతుల సంకలనం. పెరుమాళ్ళ ఆనంద్, పొట్టబత్తుల రామకృష్ణ సంపాదకత్వం వహించారు. పిల్లల ఆలోచనల్లోని భిన్నత్వాన్ని, వ్యక్తీకరణ నైపుణ్యాన్ని 'సాహితీ వినీలాకాశంలో విహరించిన బాలవిహంగాలు వట్టిమర్తి పిల్లలు' అనే వ్యాసంలో చక్కగా వివరించారు. పిల్లల ఊహాశక్తిని ప్రశంసించారు. కవిత్వాన్ని మెచ్చుకున్నారు.

ఇతరములు అనే విభాగంలో వ్యక్తులపై రాసిన వ్యాసాలు, పరిశోధనా వ్యాసాలు, కథ, వచన కవిత, పద్యం, బాల సాహిత్యం కాకుండా ఇతర ప్రక్రియలకు చెందిన అంశాలు చోటుచేసుకున్నాయి. 'తెలుగు మహిళా తేజోమూర్తులు' అనే వ్యాసంలో గూడూరు శాసనాన్ని వేయించిన విరియాల కామసాని, తొలి తెలుగు కవయిత్రిగా ఇటీవల కాలంలో పరిశోధకులచే ధ్రువీకరించబడుతున్న కుప్పాంబిక వైదుష్యాన్ని ఆవిష్కరించింది. కవిగా కళాకారుడిగా చిరపరిచితుడైన పాలడుగు నాగయ్యను దర్శింపజేసిన వ్యాసం ప్రజా కళలకు పట్టుగొమ్మ పాలడుగు నాగయ్య అనే వ్యాసం. దళితవాదం అంతగా వెలుగులోకి రాకముందే పాలడుగు నాగయ్య దళిత స్పృహతో రచనలు చేశారని సూత్రీకరణ చేశారు. నాగయ్య జానపద శైలిని ఉదాహరణలతో నిరూపించారు. తెలుగు సినీ వినీలా కాశంలో పరిచయం అక్కరలేని పేరు ఆచార్య ఆత్రేయ. ఆత్రేయ సినీ సాహిత్యం ఒక ఎత్తైతే ఆయన నాటకాలు మరో ఎత్తు. ఆత్రేయ నాటకాలలో 'మనసు వయసు' అనే నాటకం ప్రధానమైనది. ఈ నాటకంలోని మనో విశ్లేషణను విమర్శనాత్మకంగా చర్చించారు. ఆయా పాత్రల మనస్తత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపారు. ఆకురాయి గ్రంథంలో చివరి వ్యాసం సహృదయ సాహితీ విమర్శ - కుందెన. సాధారణంగా విమర్శ వ్యాసాలపై విమర్శ రాయడం కత్తి మీద సాము అనవచ్చు. ఈ పనిని ఉప్పల పద్మ సమర్థవంతంగా నిర్వహించారు. కుందెన సాహిత్య వ్యాసాల ఆత్మను ఆవిష్కరించారు.

ఆకురాయి వ్యాసాలు సాహిత్య రంగంలోకి అడుగుపెట్టే వర్ధమాన సాహిత్యకారులతోపాటు పరిశోధక విద్యార్థులు సాహిత్య విద్యార్థులు తప్పక చదవదగిన వ్యాసాలు. ప్రఖ్యాత విమర్శకులు ఎం నారాయణ శర్మ అభిప్రాయపడ్డట్లు 'ఈ వ్యాసాల్లో తీసుకున్న విషయాన్ని పొందిన అనుభవాన్ని అనుభూతిని సమగ్రంగా వ్యక్తం చేయగలిగిన వ్యాఖ్యాన కాంతి కనిపిస్తున్నది' అనే ఈ మాటలతో నేను ఏకీభవిస్తూ విమర్శ రంగంలో మరింత ప్రామాణికమైన పుస్తకాలను ఉప్పల పద్మ వెలువరించగలరని నమ్ముతూ అభినందిస్తున్నాను.

కవిత

# పరిప్రశ్నించేటి హృదయం

యముగంటి ప్రభాకర్, 94401 52258

పర్యాలోచించెడి నేత్రం
తన సంప్రదాయగరిమ నెరిగి
తమ గొప్పలు చెప్పుటను మాని
పరసంప్రదాయములను తెలిసి
వాని మేలినిగ్గుకు నమించి
విరబూసేను విశ్వాత్మగా
విముక్తిస్తూ అధ్యాత్మగా

సాహితీ శిఖరం

1973 జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత

## కన్నడ సాహిత్య సౌరభం...

# దత్తాత్రేయ రామచంద్ర బెంద్రే



దత్తాత్రేయ రామచంద్ర బెంద్రే 1896 జనవరి 31న కర్ణాటకలోని ధారవాడలో జన్మించారు. తండ్రి పేరు రామచంద్ర బట్ట, తల్లి పేరు అంబికె (అంబవ్వ). బెంద్రే తన తల్లిపైన అభిమానం కొద్దీ "అంబికాతనయదత్త" అను కలం పేరు పెట్టుకున్నారు. బెంద్రెకు 13 సంవత్సరాల వయస్సులో తండ్రి మరణించాడు. 1913లో మెట్రిక్యులేషన్ చదువు ముగించుకొని, ఆపై పూనేలోని కాలేజిలో చదువు కొనసాగించి 1918లో బి.ఎ. పట్టభద్రుడయ్యాడు. బి.ఎ.విద్య అనంతరం ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాడు. 1935లో ఎం.ఏ.లో ఉత్తీర్ణత సాధించాడు. ఎం.ఏ. పట్టం పొందిన తరువాత సొలాపూర్లోని డి.ఎ.వి. కాలేజిలో అధ్యాపకుడుగా 1944-1956 మధ్య కాలంలో పని చేశారు. బెంద్రె వివాహం లక్ష్మిబాయితో 1919 లో హుబ్బళిలో జరిగింది. ఈ సమయంలోనే ఆయన ప్రథమ కావ్య సంకలనం కృష్ణకుమారి ప్రచురించారు. బెంద్రె ఉత్సాహపూరితంగా సాహిత్యసృజన చేసే రోజుల్లో భారతదేశంలో స్వాతంత్ర్య సమరం ఉద్రేక పూరితంగా సాగేది. ఆ సమయంలో బెంద్రె వ్రాసిన గరి కవితా సంకలనంలో వున్న "నరబలి" అన్న కవిత నాటి బ్రిటీష్ ప్రభుత్వం ఆగ్రహానికి కారణమైంది. దేశభక్తుడైన బెంద్రె స్వతంత్ర పోరాటంలో పాల్గొని చెరసాల శిక్షను కూడా అనుభవించాడు. ఆయన రచించిన నాకుతంతి కృతికి 1973లో ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది. ఆయన గీతాలు జానపద శైలిలో పాడేందుకు అనుకూలంగా వుండటంతో, గాయకులు మిక్కిలి సునాయసంగా, శ్రావ్యంగా ఆలపించేవారు. కవి, దార్శనికుడు అయిన బెంద్రె క్రీ.శ. 1981 అక్టోబరులో మరణించారు. సార్వకాలికమైన కన్నడ కవిత్వాన్ని కన్నడ సాహిత్యానికి అందించిన అపురూపమైన వ్యక్తిత్వమున్న గొప్ప కవి బెంద్రె.

పుస్తక పరిచయం

# బాలల కోసం 'చంద్ర కిరణాలు' గేయాలు

**మురిపాల బాల్యం కోసం ముచ్చటైన గేయాలు...**



గోపగాని రవీందర్
94409 79882

బాలల కోసం రాస్తున్న సాహిత్యం ఇటీవలి కాలంలో తెలుగులో విరివిరిగా వస్తున్నది. కొంత మంది కవులు, రచయిత్రులు కేవలం బాలల కోసమే రచనలు చేయడం ఆహ్వానించదగిన పరిణామం. కథలు, కవితలు, గేయాలు సరళమైన శైలిలో రాయడం వలన పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాఠశాల స్థాయి పిల్లలకు సాహిత్యం పట్ల అభిరుచిని కల్గించడానికి అనేక సాహితీ సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి. పిల్లల రచనలతో పుస్తకాలను కూడా ముద్రిస్తున్నారు. బాలసాహిత్యం వికాసం కోసం కృషి చేస్తున్న రచయితలను కూడా ప్రోత్సహిస్తున్నారు. ఈ యజ్ఞంలో భాగస్వాములైన వాళ్ళను ప్రశంసించడం మనమంతా బాధ్యతగానే చేయాలి. అందులో భాగంగానే రచయిత్రి గద్వాల కిరణ్ కుమారి రాసిన 'చంద్ర కిరణాలు' బాలల గేయ సంపుటిని

**కొంత మంది కవులు, రచయిత్రులు కేవలం బాలల కోసమే రచనలు చేయడం ఆహ్వానించ దగిన పరిణామం. కథలు, కవితలు, గేయాలు సరళమైన శైలిలో రాయడం వలన పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాఠశాల స్థాయి పిల్లలకు సాహిత్యం పట్ల అభిరుచిని కల్గించడానికి అనేక సాహితీ సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి.**




వెలువరించడం అభినందనీయమైనది.

బాల్యం నిలువెత్తు జీవితానికి పునాది. బాల్యంలోని ఆలోచనల బీజాలకు ఆశయాలను కల్పించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, రచయితలు ప్రధాన భూమికను పోషిస్తున్నారు. పిల్లలు ఆటపాటలతో ఏది చెప్పిన ఆసక్తిగా వింటారు. ఆచరించడానికి ప్రయత్నం చేస్తారు. వాటి మీద అభిమానాన్ని కూడా పెంచుకుంటారు. 40 బాల గేయాలను ఒక సంపుటిగా తీసుకరావడం మంచి ప్రయత్నం. పిల్లలకు రోజువారి జీవితంలో కనిపించే వస్తువులను ఎంపిక చేసుకొని గేయాల్లో వాటిని అందంగా విడమరిచి చెప్పడం బాగున్నాయి. 'బాల్యం, వారములు, వాన, బడిగంట, చందమామ, నేస్తాలు, సెలవులు, గడియారం, పండుగ, చీమలు, జాతర, సూర్యుడు, మంచం, పుస్తకం, చెట్టు, బహుమతి, అడవి, మా ఊరు, ఆకాశం, గురువు, నీడ' వంటి గేయాల్లోని చరణాలు పొందికగా ఉన్నాయి.

*'ఒగరైన పండు/రేగి పండు*
*తింటే మాత్రం/భలేగా వుండు*
*గింజల దండు/ జామ పండు*
*తింటే మాత్రం/ రుచిగా వుండు'*

(పండు)

*'అమ్మా నేను బడికి పోతా*
*అక్షరాలే నేర్చుకుంటా*
*పాఠాలు చదువుకుంటూ*
*మంచి మాటలు తెలుసుకుంటా'*

(బడికి పోతా)

ఇట్లాంటి గేయాలతో ఈ సంపుటి సుసంపన్నంగా ఉన్నది. ప్రతి ఇంట్లో, ప్రతి పాఠశాలలో, ప్రతి ఉపాధ్యాయుడి దగ్గర ఉండాల్సిన పుస్తకమిది. కఠిన పదాలతో కాకుండా అతి సులువైన పదాలతో మంచి వర్ణనలతో నిండుగా ఉన్నది. బాలసాహితీ వేత్త పురస్కార గ్రహీత, కవి పత్తిపాక మోహన్ గారు ఈ పుస్తకానికి అర్థవంతమైన ముందుమాటను రాసి మరింత వన్నెను తెచ్చారు.

కవిత

# భాగమతికో ప్రేమలేఖ



కొండి మల్లారెడ్డి, 94419 05525

ఎడతెగని ప్రయాణంలో
ఎప్పుడో ఒకసారి
ఏదోవొక డివైడర్ వద్ద
యూటర్న్ తీసుకోవాలి

నడిచొచ్చిన తొవ్వను
గడిచిన కాలాన్ని
కలిసిన మనుషుల్ని
ఖచ్చితంగా
మననం చేసుకోవాలి

చిన్నవిగానే అగుపించినా
కొన్నింటినైనా సవరించుకోవాలి

అప్పుడెప్పుడో
అరువుకు తెచ్చుకున్న
చెగువేరా చరిత్ర పుస్తకాన్ని
భావితరానికి
తిరిగి ఇచ్చేయాలి..

నిరసన చూపులతో
నిర్దాక్షిణ్యంగా తిరస్కరించి
పురుగులా తీసిపారేసే
బ్యాచ్ మేట్‌కు
పుష్పగుచ్ఛాన్ని బహుకరించాలి

నామాల క్యాంపస్
మూడోనెంబర్ గదిలో
గోడకు అతికించిన
బ్రాడ్ వే పోస్టర్‌ను తొలగించి
ఇంటి ఓనర్‌ని ప్రసన్నం చేసుకోవాలి

బోటనీలాబ్ ముందు
పూవుల్ని తుంచి
హెర్బేరియంలో బంధించినందుకు
హైబిస్కస్ మొక్కను
మన్నించమని ప్రాధేయపడాలి

ఫేర్ వెల్ రోజు
మెమరబుల్ స్నాప్ మిస్ ప్లేస్ చేసిన
భారత్ స్టూడియో
ఫోటోగ్రాఫర్‌ను
మనస్ఫూర్తిగా మన్నించి
శాపవిముక్తున్ని చేయాలి

డొక్కా సీతమ్మలా
అడగకుండానే కడుపు నింపిన
గుడిసె హొటల్ సావిత్రికి
బాకీపడ్డ వన్ బై టూ టీ డబ్బుల్ని
పూవుల్లో పెట్టి ముట్టజెప్పాలి

బారాహిమామ్ టూ
ఇక్బాల్ మినార్ దారిలో
వొలకబోసుకున్న
సొగసుల ఆనవాళ్ళేమైనా
మిగిలివున్నాయేమో
క్షుణ్ణంగా అన్వేషించాలి

అంతిమంగా....
పొగిడిన మిత్రులను
తెగిడిన శత్రువులను
వొక్కక్కరిని అక్కున చేర్చుకొని
ఆత్మీయంగా
గుండెకి హత్తుకోవాలి

ఇరవైయేళ్ళుగా
తలపుల్లో మెదులుతున్న
అజ్ఞాత ప్రేయసి.....
భాగమతికొక ప్రేమలేఖ రాసి
కానుకగా సమర్పించాలి.

ము
ఖా
ము
ఖి

# తెలంగాణ సినిమానే నా రచనా ప్రాధాన్యత...

## - హెచ్. రమేష్ బాబు

తెలుగు సినిమాల గురించి రాసే వారెవరైనా ఉంటే అప్పట్లో అంతా సీమాంధ్రకు చెందిన వారే అనేమాట వినిపించేది. అలా కాకపోతే కనీసం హైద్రాబాద్ వారైనా అయి ఉండాలి అనే వారు. కానీ తెలంగాణలోని మారుమూల జిల్లా, ఒకనాటి కరవు నేలైన మహబూబ్ నగర్ జిల్లాలో సినిమా రచనకై మొలకెత్తిన కలం ఒకటి ఆ అభిప్రాయాన్ని మార్చి వేసింది. ఆ కలం పేరే హెచ్. రమేష్ బాబు. అతను కవిత్వం, కథలు సాంస్కృతిక అంశాలతో పాటు భారతీయ సినిమా రంగంపై సాధికారికమైన రచనలు చేసి ముప్పైకి పైగా పుస్తకాలు రాసి తన బహుముఖ ప్రతిభను చాటుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ఒక భాగమై రచయితగా, పరిశోధకునిగా కృషి చేస్తూ తెలంగాణ సినిమా చరిత్ర రచన అన్న మాటకు ఆద్యుడైనారు. తెలంగాణ సినీ చరిత్ర రాయడం కోసం తన ఉద్యోగానికి సైతం రాజీనామా చేశారు. ఎంతో పరిశోధనాత్మక విశిష్టతతో మూడు దశాబ్దాలకు పైగా సినీ రచనా ప్రయాణం చేసిన తెలంగాణ సినిమా తొలి చరిత్రకారుడు హెచ్. రమేష్ బాబుతో ఈ పక్షం ముఖాముఖీ...



**మీ కుటుంబ నేపథ్యం ఏమిటి?**

దిగువ మధ్యతరగతి కుటుంబమే మాది. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా, నేటి వనపర్తి జిల్లా ఏదులలో పుట్టాను. ఇంటర్‌తో చదువు ఆగిపోయినా నా వ్యక్తిగత శ్రద్ధతో ఎం.ఏ. తెలుగు దాకా చదువుకున్నాను. ఇంట్లో ఉండే మా నాన్న గారి హెూం లైబ్రరి, రేడియో ఈ రెండు నాకు సాహిత్య సంగీతాలను పరిచయం చేశాయి. ఈ రెండింటి వల్ల నాకు సినిమాలపై ఆసక్తి ఏర్పడింది. మా నాన్న, మామయ్యలు తరుచూ అలనాటి సినిమాల గురించి చర్చించుకునేవారు. పైగా మా నాన్న సాహిత్యాభిమానే కాక మంచి రీడర్ కూడా.

**రచనా వ్యాసంగం ఎలా ప్రారంభమై, తొలిరచన ప్రచురణ ఎప్పుడు జరిగింది?**

హైస్కూలు పూర్తయ్యే నాటికే ఇంట్లో ఉండి లత సాహిత్యం, వి.ఎస్. రమాదేవి, వల్లంపాటి, విశ్వనాథ సత్యనారాయణ, తులికా భూషణ్, ముద్దుకృష్ణ వైతాళికులు వంటి రచనలన్నింటినీ చదివేశాను. వాటిలో శీలా వీర్రాజు మైనా నవల నా మీద చాలా ప్రభావం చూపింది. ఈ నవలే నన్ను కవిత్వం వైపు మళ్ళించింది. ఇంటర్‌లోనే కవిత్వం రాశాను. 1986లో సాహిత్య దుందుభి (వనపర్తి) మాసపత్రికలో తొలిసారిగా నా కవితలు ప్రచురితమయ్యాయి. ఆ తరువాత నాలుగైదు సంవత్సరాలు కవిత్వమే రాశాను. నూరుకు పైగా కవితలు అచ్చుకు నోచుకున్నాయి.

**ఆ తరువాత కథలు కూడా రాసివట్టున్నారు?**

కవిత్వం రాసేవారు ఖచ్చితంగా కథలు కూడా రాస్తాడు. నేనో అరడజను కథలు రాశాను. అవన్నీ కథాంజలి, కామధేను, సాగర సమాచార్ పత్రికల్లో వచ్చాయి. సరిగ్గా ఈ సమయంలోనే కడపలో ఉండే మిత్రుడు చంద్రశేఖర్‌రావు నాతో ఆధునిక కవిత్వాన్ని, నవలా సాహిత్యాన్ని ముందుగా చదవమని సలహా ఇచ్చాడు. ఆ తరువాత ప్రేమ్‌చంద్, శరచ్చంద్ర, గోపిచంద్‌ల సాహిత్యాన్ని శ్రీశ్రీ, తిలక్‌ల కవిత్వాన్ని, కథలను చదివిన తరువాత నేను కవిత్వం, కథలు రాయవలసిన అవసరం లేదు అని,



ఏమిటి?

అవును నిరంతరం నాకు ఆసక్తి ఉన్న అంశాలకు సంబంధించిన సమాచార సేకరణ చేయడం 1985 నుండే ప్రారంభించాను. ఎక్కడికెళ్లినా పత్రికలు, పుస్తకాలు కొనే వాడిని. ఎవరింటికెళ్లినా అన్నిరకాల పాత పత్రికలు సేకరించే వాడిని. దాదాపుగా అదొక వ్యసనంగా మారింది. సంగీతం, సాహిత్యం, చిత్రకళ, నాట్యం, సినిమా ఒకేమిటి ప్రతి అంశానికి సంబంధించిన ఫైల్స్ సుమారు లక్ష పేజీలతో తయారు చేశాను. ఇప్పటికీ గూగుల్, వికీపీడియాలలో లేని సమాచారం నా వద్ద ఉంది. వాటిని బెంగుళూరులోని మనసు ఫౌండేషన్ స్కాన్ చేయడానికి ముందుకు వచ్చింది.

రాయవలసినవారు వేరే అన్నారని భావించి దాదాపుగా కథను, కవితను రాయడం వదిలేశాను. కానీ తెలంగాణ ఉద్యమ కాలంలో మళ్ళీ కవిత్వం రాయవలసి వచ్చింది. ఉద్యమమే నాతో కవిత్వం రాయించింది.

**ఉద్యోగం చేస్తూనే మీరు తొంభైల్లో (1990) విపరీతంగా వ్యాసాలు రాశారు.. అదెలా సాధ్యమైంది?**

నాకు కలిసి వచ్చిందేమంటే మా సొంత ఊర్లోనే పోస్ట్ మాస్టర్ ఉద్యోగం చేశాను. మూడు గంటల పని ఉండేది. మిగతా అంతా సాహిత్య పఠనం, రచనా వ్యాసాంగంతోనే గడిపాను. పదేళ్ల పాటు రోజుకో వ్యాసం రాసి ఉంటాను. అందులో దాదాపు అన్నీ ప్రచురితమయ్యాయి. వ్యాసం రాసి పోస్ట్ చేయడం తీరా అనుకున్న రోజున వెళ్లి పేపర్ చూస్తే అందులో అచ్చులో అది కనిపించేది. ఈనాడులో తప్ప తెలుగు దేశంలో నా వ్యాసాలు అచ్చేయని పత్రికనే లేదు.

**అప్పట్లో ఇప్పటి మాదిరిగా సమాచారం అందుబాటులో ఉండేది కాదు.. కాని మీ వ్యాసాలు విషయ ప్రాధాన్యతతో పరిశోధనాత్మకంగా ఉండడానికి కారణం**

**హెచ్ రమేష్‌బాబు సినీ రచనలు...**

- ఫాల్కే అవార్డు విజేతలు 2003
- సినీ పితామహుడు ఫాల్కే 2004
- వెంకయ్య అవార్డు వెలుగులు 2004
- కాంచనమాల జీవన చిత్రాలు 2005
- నంది అవార్డు వెలుగులు 2006
- మహానటి సావిత్రి 2007
- ధ్రువతార కన్నాంబ 2008
- తొలినాటి సినిమా పాటల పుస్తకాలు 2011
- మార్గదర్శకుడు కేవిరెడ్డి 2012
- దర్శక చక్రవర్తి ఆదుర్తి సుబ్బారావు 2013
- తెలంగాణ తెరకు తొలి వెలుగు బి నరసింగరావు 2017

**మీరు ఇప్పటి వరకు ఎన్ని వ్యాసాలు రాసుంటారు?**

మూడు వేలకు పైగానే వ్యాసాలు ఉంటాయి. అలాంటి వాటిలో సాహిత్యం, సంగీతం, నాటకం, చిత్రకళ, జనపదాలు, చరిత్రకు సంబంధించినవి ఒక ఎత్తైతే, సినిమాలకు సంబంధించినవి లెక్కకు మించిన వ్యాసాలుంటాయి. ఏమి రాసినా ఇష్టంగానూ, సీరియస్‌గానే రాశాను. వీటిలో సినిమా వ్యాసాల్నే ఇంకాస్త ఎక్కువ ఇష్టంగా రాశాను. అవే నాకు ఎంతగానో పేరు తెచ్చాయి కూడా.

**కవిత్వం, కథలు సాహిత్య వ్యాసాలు రాస్తున్న మీరు సినిమా అంశాలు సీరియస్‌గా రాయడానికి కారణం ఏమిటి?**

నిజానికి చిన్నతనంలో మా ఇంట్లో సినిమాల గురించి మాట్లాడకుండా ఏ రోజు గడిచేది కాదు. రేడియోలో వచ్చే సినిమా పాటలు నాకు భాషను నేర్పించినవని చెప్పడానికి ఏ మాత్రం సంకోచించను. పాటకి తోడు మా నాన్న లైబ్రరిలో సినిమా రంగం వంటి పత్రికలు ఎన్టీఆర్ జీవిత చరిత్ర, పాత సినిమా పాటల పుస్తకాలు ఇంకా చాలా ఉండేవి. వాటి వల్ల సినిమా చరిత్రపై ఆసక్తి పెరిగింది. దాంతో సినిమా అంశాలపై అధ్యయనం ప్రారంభించాను. సినిమా అంటేనే ఆకర్షణ కదా అటు సినిమా నటీనటుల జీవితాలు, సినిమా నిర్మాణం లోని చాలా విషయాలు నన్ను విపరీతంగా ఆకర్షించాయి. ఇక ఇతర అంశాలు ఏవి రాసినా సినిమా అంశాలే ప్రధానంగా రాయాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. ఇందుకు రాండార్ గై, ఫిరోజ్ రంగూన్ వాలా, ఏ.వి.కె రంగారావు, థియోడర్ భాస్కరన్, కె.ఎన్.టి.శాస్త్రి, వారాల ఆనంద్ వంటి వారి రచనలు చదివాక నాకు అనిపించిందొక్కటేమిటంటే భారతదేశంలో సినిమా చరిత్రకు, జర్నలిజానికి 1990ల నాటికి చాలా అత్యల్ప ప్రాధాన్యత కనిపించింది. పాశ్చాత్య దేశాలలో సినిమా పుట్టుకతో పాటే సినీ జర్నలిజాన్ని, విమర్శను సీరియస్‌గా తీసుకుంటే అదే

ము
ఖా
ము
ఖి

భారతదేశంలో నవ్య సినిమా యుగం మొదలైన 1950 దశకంలో వీటిని పట్టించుకున్నారనిపిస్తుంది. సత్యజిత్‌రే, గురుదత్‌ల గురించి ముందుగా పాశ్చాత్యులు రాసిన తరువాత గాని మన వాళ్లకు స్పృహ వచ్చింది.

**మీ సినిమా రచనలో విమర్శ, చరిత్ర దేనికి ప్రాధాన్యతనిస్తారు?**

రెండు సమానమే గానీ నాకు చరిత్ర పట్ల అమితాసక్తి. ఎందుకంటే ముందుగా చెప్పినట్లు సినిమా అంశాలను పట్టించుకోక పోవడం వల్ల తారల రంగుల ఫోటోలు, కవరేజీలే సినిమా జర్నలిజమైంది. సీరియస్‌గా సినిమా చరిత్రను పట్టించుకునే పరిస్థితులు మన దేశంలో చాలా తక్కువ. తెలుగు ప్రాంతంలో అయితే అసలు కనిపించదు. వ్యక్తులు తెలుగు సినిమా కోసం చరిత్ర కోసం చేసిన కృషి కన్న పరిశ్రమ, ప్రభుత్వాలు చేసిందేమి లేదు. అందుకే ఎవరేమిటో తెలియకుండా పోయే ప్రమాదముందని సినిమా చరిత్ర పట్ల నాకు మమకారం ఎక్కువ ఏర్పడింది.

**మీ తొలి సినిమా వ్యాసం, తొలి సినిమా పుస్తకం ఏది?**

1989లో నేను రాజ్‌కపూర్ గురించి రాసిన వ్యాసం ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో 1989జూన్ 2 సంచికలో వచ్చింది. అదీ కవర్ స్టోరీగా. సినిమా వ్యాసానికి అంత ప్రాధాన్యత ఉంటుందని నాకప్పటి దాకా తెలియదు. తొలి బంతే సిక్సర్ పోయినంత ఆనందం. అప్పటి నుంచే సినిమాలపై ఇంకా రాయడం ఎక్కువ చేశాను. రెండేళ్లు దాటేసరికి



'దర్శక చక్రవర్తి ఆదుర్తి సుబ్బారావు' పుస్తకావిష్కరణోత్సవం (18-11-2013)లో హెచ్. రమేష్ బాబు, విజయనిర్మల, కృష్ణ, కె. విశ్వనాథ్, మహేష్‌బాబు, నమ్రతా మహేష్‌బాబు, మంజుల

మయూరి, చిత్రభూమి వంటి పత్రికల్లో కాలమ్స్ రాసే స్థాయికి వచ్చాను. 2003లో తొలిసారిగా ఫాల్కే అవార్డు విజేతలు నా తొలి సినిమా పుస్తకం వచ్చింది. 1969 నుండి 2001 వరకు ఫాల్కే అవార్డు అందుకున్న వారిని గురించిన పుస్తకం ఇది. ఈ కాంసెప్ట్ తో ఇండియాలో వచ్చిన తొలి పుస్తకం ఇదే. దీనిని చూసి దర్శకుడు దాసరి నారాయణరావు తాను ఎంపి అయ్యాక ఇంగ్లీష్‌లో బి.పి మిశ్రాతో "గ్రేట్ మాస్టర్స్ ఆఫ్ ఇండియన్ సినిమా'' అనే పుస్తకంగా రాయించారు.

**తెరమరుగైపోయిన కాంచనమాల, కన్నాంబల గురించి పుస్తకం అచ్చువేయాలని ఎందుకు అనిపించింది?**

ఇవి రెండు సంకలనాలే. వాస్తవిక సమాచారాన్ని ఉన్నది ఉన్నట్టుగా ఈ తరం వారికి తెలియాలని చేసిన ప్రయత్నం ఇది. అయితే తెలుగు సినిమాలో తొలి రెండు దశాబ్దాలను శాసించిన తారలు కాంచనమాల, కన్నాంబ. నాటక రంగం నుండి వచ్చిన వీరి ఆంగికం, అభినయం, గాత్రం అన్నీ వారి సొంతమే. సమాచారం అందుబాటులో ఉన్నప్పుడే వారి జీవితాలను గ్రంథస్థం చేయాలనే తలంపుతో చేశాను. ఈ రెండూ మలిముద్రలను కూడా పొందాయి.

**అట్లానే సావిత్రి గురించి కూడా పుస్తకాలు వేశారు కదా?**

అవును సావిత్రి గురించి కూడా కాంచనమాల, కన్నాంబల మాదిరిగా 2007లో మొదటిసారిగా ముద్రించాను. ఇందుకు బలమైన కారణం ఉంది. అప్పట్లో ఒక సీమాంధ్ర ప్రాంతపు రచయిత్రి సావిత్రి గురించి మీకేమి తెలుసు అని నాతో మాట్లాడడంతో నేను పట్టుబట్టి వెంటనే మహానటి సావిత్రి పుస్తకం అచ్చువేశాను. ఆ తరువాత 2015 వరకు ఈ పుస్తకం 5 ముద్రణలు పొంది 10వేల కాపీలు అమ్ముడుపోయాయి. ఆ












తరువాత చాలా పుస్తకాలు అచ్చువేయడానికి సావిత్రి పుస్తకమే కారణం అయింది. ఈ పుస్తకంతోనే తెలుగు వారందరికీ నేను చేరువయ్యాను. 2019లో ఢిల్లీలో జరిగిన బుక్ ఫేర్‌లో ఉమెన్ థీమ్ విభాగంలో కన్నాంబ, కాంచనమాల, సావిత్రి పుస్తకాల కటౌట్లు పెట్టడం నాకొచ్చిన ప్రత్యేక గుర్తింపుగా భావిస్తాను.

**మీ ఇతర సినిమా రచనల గురించి చెప్పండి?**

దీర్ఘకాలిక ప్రయోజనమే నా రచనల లోని ఉద్దేశం. ప్రజలు పాఠకులకు ఏం కావాలో రాయడం ఒక పద్దతైతే పాఠకులు ఖచ్చితంగా ఏం తెలుసుకోవాలో అదే రాయడం ఒక పద్ధతి. నాది రెండో పద్ధతి. అందుకే నంది అవార్డు విజేతలు, వెంకయ్య అవార్డు వెలుగులు, సినీ పితామహుడు ఫాల్కే వంటివి చరిత్రకు, పాఠకులకు ఉపయోగపడతాయనే నమ్మకంతో రాశాను.

**మీరు కె.వి రెడ్డి, ఆదుర్తిల గురించి కాఫీ టేబుల్ బుక్స్ వేశారు కదా?**

మహా దర్శకుడు కె.వి రెడ్డి సెంటినరీ వాల్యూమ్ ఒకటి టి శ్రీనివాస్‌తో కలిసి చేశాను. ఇండస్ట్రీలో చాలా మంచి పేరు వచ్చింది. అది చూసి హీరో కృష్ణ గారు తనను సినిమా రంగానికి పరిచయ చేసిన ఆదుర్తి గురించి సుబ్బారావు గురించి పనిచేయమన్నారు. అదే "దర్శక చక్రవర్తి ఆదుర్తి సుబ్బారావు" (2013). ఈ పుస్తకం ఆవిష్కరణకు హీరో మహేష్ బాబు రావడం మరిచిపోలేని అనుభూతి.

**పాటల పుస్తకాల సంగతేమిటి?**

ఇది ప్రాణం పెట్టి చేసిన పని. ఇది కూడా చరిత్రను నిక్షిప్తం చేయడానికి చేసిన ప్రయత్నమే. నేను సినిమా వ్యాసాలు రాసే కొత్తలో సమాచారం అందుబాటులో ఉండేది కాదు. పాటలపై పుస్తకాలే కొన్ని అందుబాటులో ఉండేవి. అందుకే సాధికారికంగా రాసేవాడిని. వీటి విలువ తెలిసి ఎక్కడ పాటల పుస్తకాలున్నా వెళ్లి సేకరించేవాడిని. తెలుగు రాష్ట్రాల్లో నేను తిరుగని చోటు లేదు. సుమారు 2 లక్షల రూపాయలు వీటికే వెచ్చించి ఉంటాను. అయితే షాద్‌నగర్ చెవులపల్లికి చెందిన వెంకటేశ్వరరావు నా ఉత్సాహం చూసి తన వద్ద ఉన్న వెయ్యి పాటల పుస్తకాలను ఉచితంగా ఇచ్చి వీటి ఉపయోగం నాకన్న నీకే ఎక్కువ అన్నారు. అట్లా నేను తెలుగు, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో 3500కు పైగా పాటల పుస్తకాలను సేకరించాను. వాటిలో తొలి సినిమా పాటల పుస్తకం "సతీసావిత్రి" (1933) ప్రతి మొత్తం తెలుగు రాష్ట్రాల్లో నా దగ్గర మాత్రమే ఉంది. ఆ తరువాత ఇవన్నీ స్కాన్ చేయించాను. అయితే తెరగమరుగైన వీటిని మళ్లీ ఈ తరం వారికి పరిచయం చేయాలని 2011లో "తొలి నాటి తెలుగు సినిమా పాటల పుస్తకములు"అనే పేర 1933, 1940 కాలంలో వచ్చిన పాటల పుస్తకాలను 1200 పేజీలతో రెండు వాల్యూములుగా యథాతథంగా అచ్చు వేశాను. అట్ల తెలుగు సినిమా తొలి దశాబ్దపు చరిత్రను నిక్షిప్తం చేసినట్లయ్యింది. అవి భువన చంద్ర, వెన్నెలకంటి, చంద్రబోస్ వంటి సినీ కవుల ప్రశంసలందుకున్నాయి. చంద్రబోస్ గారైతే 10 సెట్లు కొని పంచారు. తెలుగు పత్రికలు వాటి గురించి గొప్పగా రాశాయి. త్వరలో నేను 1940 - 50ల మధ్య వచ్చిన పాటల పుస్తకాలు కూడా వెలువరించబోతున్నాను.

**తెలుగు సినిమా చరిత్ర సరే, తెలంగాణ సినిమా గురించి ఎలా రాయగలిగారు. ఏమిటి మీ ధైర్యం?**

నిజంగా ఇది ధైర్యమే. మొదటి నుండే ప్రశ్నించే తత్వం. అన్వేషణాభిలాషనే తెలంగాణ సినిమా చరిత్ర పట్ల ఆసక్తి రేపినవి. 2009 నుండే తెలుగు ఉద్యమం తారా స్థాయికి చేరుకుంది. 2001 నుండే ఉద్యమంతోనే ఉన్నాను. ఈ సమయంలో తెలంగాణ చరిత్రను రాస్తున్న సంగిశెట్టి, సుంకిరెడ్డి నారాయణరెడ్డిల కృషి నన్ను ఎంతో ప్రేరేపించింది. సినిమా కోణంలో తెలంగాణను ఎలా చూడాలో ఆలోచించి సినిమా తొలుత మొత్తం భారతీయ సినిమాలో తెలంగాణ పాత్ర ఏమిటో రాయగలిగాను. అందుకు అల్లం నారాయణ, కందుకూరి రమేష్ బాబుల

**అందుకున్న అవార్డులు...**

- మహబూబ్‌నగర్ జిల్లా నెహ్రూ యువక కేంద్రం యువ సాహితీవేత్త అవార్డు 1997
- జయప్రకాశ్ నారాయణ్ అవార్డు 2002
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం 2017
- తెలంగాణ అమెరికా అసోసియేషన్ వారి ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు 2017
- తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం 2018
- తెలంగాణ సినీ స్వర్ణ కమలం అవార్డు 2018.











ప్రోత్సాహం చాలా ఉంది. ఇవన్నీ చూసిన ప్రసిద్ధ దర్శకుడు బి. నర్సింగరావు 40 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నాకే తెలియని విషయాలు రాస్తున్నావు, తెలంగాణ సినిమా చరిత్ర నీవే రాయాలి, రీసర్చ్ చేయడానికి అన్ని రకాలుగా తోడుంటాను అన్నారు. ఆ తరువాత వారు, అల్లాణి శ్రీధర్‌లు నన్ను బాంబే పంపించి కొంత వర్క్ చేయించారు. 2015 నాటికి హైద్రాబాద్‌లో కూడా బొంబాయితో సమాంతరంగా మాకు సినిమా చరిత్ర ఉందని, 1896 నాటికే సికింద్రాబాదుకు సినిమాలు వచ్చాయని రాయగలిగాను. ఇది తెలంగాణ ఉద్యమం చేయించిన పనిగానే భావిస్తాను. 1896 నుండి 1932 వరకు హైద్రాబాదులో జరిగిన మూకీ సినిమాల నిర్మాణ చరిత్రను "లోటస్ ఫిలిమ్ కంపెనీ హైద్రాబాద్'' పేరుతో తెలంగాణ సినిమా చరిత్ర మొదటి భాగంగా త్వరలో వెలువరించబోతున్నాను. ఆ తరువాత 500 పేజీలతో "125 ఏండ్ల తెలంగాణ సినిమా చరిత్ర'' రాబోతున్నది.

**మీరు సినిమాఎంత ఇష్టపడ్డారో స్థానిక చరిత్రలను కూడా రాసినట్టున్నారు?**

కవిత్వం రాసిన నాడు చరిత్రను కూడా ప్రేమిస్తారు. స్థానిక చరిత్రలు ప్రధాన స్రవంతిలో అంతర్భాగంగానే ఉంటాయి. కాని విస్మృతంగా కనిపిస్తాయి. వీటిని పట్టించుకోకపోతే కాలగర్భంలో కలిసిపోయి రేపటి తరాలను వారి చరిత్ర వారికే తెలియకుండా పోతుందని భావించి మా మిత్రుడు బాల్‌రామ్ ఇచ్చిన ప్రోత్సాహంతో "సోషల్ సైన్సెస్'' కాన్సెప్ట్ తో జిల్లాలో పది సంచికలకు సంపాదకత్వం వహించాను. అరడజను జీవిత చరిత్రలు రాశాను. ఇదంతా నేను పుట్టి పెరిగిన ప్రాంతానికి చేయగలిగిన సేవగానే ఎప్పటికీ భావిస్తాను.

**మీరు ఉద్యోగానికి రాజీనామా ఎందుకు చేశారు?**

దీనికి బలమైన కారణం తెలంగాణ ఉద్యమ కాలంలో మొదలు పెట్టిన తెలంగాణ సినిమా చరిత్ర పరిశోధన ఇంకా పూర్తవ లేదు. 2014 తరువాత పూర్తిగా ఉద్యోగ బాధ్యతలలో ఉండడం వల్ల పరిశోధన ఆగిపోయింది. నిజానికిది నా లైఫ్ టైమ్ వర్క్. ఇందు కోసం పలుచోట్లకు తిరిగి పరిశోధన చేయవలసి ఉంది. అయిదేళ్లు గడిచింది. ఒక్క అడుగు ముందుకు పడలేదు. నా ప్యాషన్ సినిమానే కావడంతో తెలంగాణ సినిమా చరిత్ర పరిశోధన కోసం 2019 సెప్టెంబరులో ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఆ తరువాత కరోనా రావడంతో రెండేళ్లు ఇంట్లోనే ఎంతో ఖాళీగా, పెన్నీలెస్‌గా ఉన్నప్పుడు "తెలంగాణ జాగృతి'' అందించిన సహకారం మరువ రానిది. ప్రస్తుతమైతే సాధారణ జర్నలిస్టుగానే కొనసాగుతున్నాను.

**ఇన్ని చేస్తూ తెలంగాణ సంగీత చరిత్ర ఎలా రాశారు?**

అది తంగేడు చలవనే. కొత్తలో ఎడిటర్ గారు శతాబ్దాల తెలంగాణ సాంస్కృతిక వైభవం అనే వ్యాసం 2020 నవంబర్‌లో రాయించారు. అది చూసిన జె. చెన్నయ్య నీవు రాసిన ఆర్టికల్‌ని ఇంకా విస్తరించి రాస్తే తక్షణం తెలంగాణాకు ప్రాథమిక సంగీత చరిత్ర అవుతుందని చెప్పి, దాన్ని రాయించి తెలంగాణ సంగీత నాటక అకాడమి వారి పుస్తకంలో అచ్చు వేయించారు.

**మీ నుండి త్వరలో రాయబోతున్న రచనలు ఏవి?**

చిల్లర దేవుళ్లు దర్శకుడు తాళిబొట్టు మధవరావు, తెలంగాణ సినిమా మూకీ యుగం, తెలంగాణ దర్శకులు బిఎస్. నారాయణ , ఎడిటర్, డైరెక్టర్ టి కృష్ణ , పైడి జయరాజ్, గండి చంద్రశేఖర్, అజిత్, ప్రభాకర్‌రెడ్డిల మోనోగ్రాఫ్‌లు రానున్నాయి.

**మీరు చేయాలనుకున్న డ్రీమ్ ప్రాజెక్ట్ ఏమైనా ఉన్నదా?**

ఉన్నది. అది తెలుగు సినిమా సర్వస్వం. 1896 నుండి 1995 వరకు వందేళ్లలో జరిగిన అన్ని తెలుగు సినిమా అంశాలను రికార్డు చేయాలనేది నా జీవితాశయం. అందుకు పరిశ్రమ పెద్దల సహకారం కావాలి. అది ఐదేళ్ల ప్రాజెక్టు. ఏం జరుగుతుందో చూద్దాం. చేయగలిగింది మాత్రం చేస్తూ పోవడమే నా పని. అయితే ఏం చేసినా తెలంగాణనే నా రచనా ప్రాధాన్యం.



ఇంటర్వ్యూ...
**తిరువగరి శ్రీనివాస్**
**8466053933**



# కలేజాయున్నకవి

## కాళన్న



సుదర్శనం వేణుశ్రీ, 83280 67855

సీ॥ కార్మిక కర్షక కష్టాల బాపగ
పౌరహక్కులను కాపాడు కొఱకు
ఎల్లవేళల యందు యేటికెదురునిల్చి
పోరాట బాటకు స్ఫూర్తినిచ్చె
కవితా రచనలతో కలమును ఝులిపించి
దేశ ప్రజలగొడ్వ దేన్నివిడక
నాగొడవన జెప్పి నాలోచనలరేపి
కర్తవ్య బోధన గరిపినాడు
మాతృభాషను మర్చె మానవులందర్కి
కవితలచురకల్తొ కదలజేసె
వలసవాదులు చేయు పాలనతోబాటు
ప్రాంతీయదోపిడి పాలకులను
పాతరేయుడనుచు ప్రజలకు తెల్పను
నర్సింహుడెమొదటి నక్సలైటె
యనియు సభలలోన యాదికిజేయంగ
కాళోజియెకలేజ కల్గినోడు

తే.గీ. జవము కల్గియు దేశపు జనులు కదిలి
కుటిల రాజకీయాలను కూల్చి వేసి
దేశ సౌభాగ్యము కొఱకు దిశను మార్చ
తెలుగువాడ కదులుమింక తిరుగులేక

సాహితీ శిఖరం

1974 సాహిత్య నోబెల్ విజేత....

## శ్రామికవర్గ రచయిత...

# ఐవింద్ జాన్సన్






ఐవింద్ జాన్సన్ 29 జూలై 1900న జన్మించిన స్వీడిష్ నవలా రచయిత మరియు చిన్న కథా రచయిత. ఆధునిక స్వీడిష్ సాహిత్యంలో అత్యంత సంచలనాత్మక నవలా రచయితగా పరిగణించబడ్డాడు. అతను 1957లో స్వీడిష్ అకాడమీలో సభ్యుడు అయ్యాడు. 1974లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని హ్యారీ మార్టిన్‌సన్‌తో పంచుకున్నాడు. జాన్సన్ ఓలోఫ్ ఎడ్విన్ వెర్నర్ జాన్సన్ నార్బోటెన్‌లోని బోడెన్ పట్టణానికి సమీపంలోని ఓవెర్లూలియా పారిష్‌లోని స్వార్ట్‌బ్జోర్న్స్‌బైన్ గ్రామంలో జన్మించాడు. స్టాక్‌హోమ్‌లో అతను ఇతర యువ శ్రామికవర్గ రచయితలతో స్నేహం చేసాడు. అతను రాసిన డి ఫైరా ఫ్రమ్లింగర్నా అనే చిన్న కథల సంకలనం 1924లో ప్రచురించబడింది. స్వీడన్‌లో ఆధునికవాద సాహిత్యానికి అతి ముఖ్యమైన ప్రతినిధి అయ్యాడు. అతను 1929లో రాసిన నవల కమ్మెంటర్ టు ఎట్ స్జార్న్‌ఫాల్ ("కామెంట్ ఆన్ ఎ ఫాలింగ్ స్టార్"), పెట్టుబడిదారీ సమాజంపై దాడి విమర్శనాత్మక విజయం సాధించింది. నవలలలో జాన్సన్ వాస్తవికతను అద్భుత కథలు మరియు అంతర్గత ఏకపాత్ర మరియు మారుతున్న దృక్కోణం వంటి విలక్షణమైన ఆధునికవాద లక్షణాలతో మిళితం చేశాడు. 1930లలో పెరుగుతున్న నిరంకుశవాదంతో కలత చెందుతూ, జాన్సన్ ఫాసిజం మరియు నాజీయిజానికి వ్యతిరేకంగా బలంగా నిలబడ్డాడు. 1946లో అతను ట్రోజన్ యుద్ధం తర్వాత ఇథాకాకు తిరిగి వచ్చిన ఒడిస్సియస్ కథ ఆధారంగా అతని అత్యంత ప్రసిద్ధ నవలలలో ఒకటైన రిటర్న్ టు ఇతాకా (స్ట్రాండర్నాస్ స్వాల్)ను ప్రచురించాడు. ఇటలీ మరియు ఫ్రాన్స్‌లకు ప్రయాణాలు అతనిని అనేక మంచి ఆదరణ పొందిన చారిత్రక నవలలు రాయడానికి ప్రేరేపించాయి. కార్డినల్ రిచెలియస్ 17వ శతాబ్దపు ఫ్రాన్స్‌లో సెట్ చేయబడిన డ్రీమ్స్ ఆఫ్ రోజెస్ అండ్ ఫైర్ (డ్రోమ్మార్ ఓమ్ రోసోర్ ఓచ్ ఎల్డ్, 1949) మరియు మోల్నెన్ ఓవెర్ మెటాపోన్షన్ ("ది క్లౌడ్స్ అబౌ మెటాపాంషన్", 1957) అతని తర్వాతి నవలలు మంచి పేరు తెచ్చాయి. 1957లో స్వీడిష్ అకాడమీ సభ్యునిగా ఎన్నికయ్యారు. అంతర్జాతీయంగా జాన్సన్ యొక్క అత్యంత ప్రసిద్ధ రచనలలో రిటర్న్ టు ఇతాకా మరియు ది డేస్ ఆఫ్ హిస్ గ్రేస్ (హాన్స్ నాడెస్ టిడ్, 1960) ఉన్నాయి. 25 ఆగస్టు 1976న ఆయన మరణించాడు.

## తెలంగాణ సాహిత్యంపై జాగృతి సెమినార్

అక్టోబర్ 15, 16 తేదీలలో తెలంగాణ జాగృతి సాహిత్య సభల నిర్వహణ సందర్భంగా విడుదల చేసే సంచిక కొరకు "తెలంగాణ సాహిత్యం" అనే అంశంపై మీ వ్యాసాన్ని, అలాగే సభలో 15 నుంచి 20 నిమిషాల మీ ప్రసంగాన్ని ఆహ్వానిస్తున్నాం. మీరు ఇది వరకు ఇచ్చిన అంశాలపై అందజేసిన వ్యాసకర్తలకు మరియు వక్తలకు ధన్యవాదాలు. వాటికి సంబంధించిన టైప్ సెట్టింగ్ పనులు జరుగుచున్నవి. ఈ సెమినార్ కోసం పత్రాలు రాస్తున్న వ్యాసకర్తలు అక్టోబర్ 5వ తేదీలోగా తమ వ్యాసాలను పూర్తిచేసి tjsahithisabhalu @gmail.com నకు మెయిల్ చేయగలరని ప్రార్థన.

## ప్రజల భాష కాళోజీ కవిత్వం....

**- కాంచనపల్లి**



సెప్టెంబర్ 15 2022 రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీతాఫల్‌మండిలో కాళోజి 109వ జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో తంగేడు సహసంపాదకుడు కాంచనపల్లి గోవర్ధన్ రాజు మాట్లాడుతూ కాళోజీ కవిత్వం ప్రజల భాషేనని, అరమరికలు లేని భాషా ప్రేమికుడు కాళోజి అని పేర్కొన్నారు. కాంచనపల్లి తన సుదీర్ఘ ప్రసంగంలో కాళోజి కవిత్వం నిత్యం కవులు అందరికీ అనుసరణీయమని ఏ సిద్ధాంత చట్రంలో ఇమడని కవి కాళోజీ అని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ రఘు మాట్లాడుతూ కాళోజి భాషాభిమానం బేరీజు వేయడానికి మనం సరిపోమని పేర్కొన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాణాల శ్రీనివాసరావు కాళోజి పూర్తి పేరు నాటి సమాజానికి సంకేతం అని అన్నారు. ఈ కార్యశాలకు కళాశాల ప్రిన్సిపల్ ఎం. రామచంద్రం అధ్యక్షత వహించగా తెలుగు శాఖ అధ్యక్షులు కృష్ణమూర్తి సంచాలకులుగా వ్యవహరించారు. పలువురు విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆసక్తికరంగా కొనసాగింది.

## కాళోజీ స్వేచ్ఛా జీవి...

**- డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి**



సెప్టెంబర్ 12వ తేదీన ఖైరతాబాద్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి మరియు ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేడ్చల్ మల్కాజ్గిరి అదనపు కలెక్టర్, ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ కాళోజీ స్వేచ్ఛా జీవిగా తన బ్రతుకంతా ప్రజల కోసం కవిత్వం కోసం ధారపోసాడని, ఆయనకు కుటుంబ సభ్యులు, సాహితీ వేత్తలు, ప్రజలు ఎంతో స్వేచ్ఛగా, స్వచ్ఛంగా గౌరవాన్ని అందించారని అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ అసత్యానికి, భయానికి తావివ్వని జీవితం కాళోజీదని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షత వహించగా, డా.సంగనభట్ల నరసయ్య గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ భాష సాంస్కృతిక మండలి అధ్యక్షులు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ కాళోజీ అడుగుజాడల్లో సాహిత్య సృజనకారుల జీవితాలను సమాజానికి మార్గదర్శకంగా అందించడంలో విశేషమైన కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి చీకోలు సుందరయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజేందర్ కుమార్, డాక్టర్ గురజాల రామశేషయ్య, కళాశాల ఉప ప్రధానాచార్యులు డాక్టర్ వి. విజయలక్ష్మి, డాక్టర్ ఎం. వాణి, కే. భరత్ కుమార్. అనూష డాక్టర్ మంత్రి మల్లేశ్, శ్వేత, వెన్నెల, నగేశ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రముఖ తెలంగాణ సాహితీవేత్త నిజాం వెంకటేశం ఆకస్మిక మృతి



సెప్టెంబర్ 18 ఆదివారం సాయంత్రం ప్రముఖ సాహితీవేత్త నిజాం వెంకటేశం ఈ లోకాన్ని విడిచిపెట్టారు. అనే వార్త సాహితీ లోకాన్ని దిగ్భ్రాంతిలో ముంచింది. నిజాం వెంకటేశం తెలంగాణ సాహితీవేత్తలతో చేదోడువాదోడుగా ఉంటూ సాహితీ పురోగతికి దోహదం చేశారు. స్నేహశీలి విమర్శనా దృక్పథం గల వెంకటేశం మృతి తెలంగాణ సాహితీ రంగానికి తీరనిలోటు ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు తోపాటు పలువురు సాహితీవేత్తలు, సాహితీ సంస్థలు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. తంగేడు సంపాదక వర్గం కూడా హాజరై కుటుంబాన్ని పరామర్శించారు. తంగేడు ఆయన మృతికి తీవ్రమైన సంతాపం ప్రకటించి, వాళ్ల కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేసింది.



## తెలంగానా వేగు చుక్కలు

కొండపల్లి నీహారిణి
రంగారెడ్డి జిల్లా
సెల్ : 9866360082

వెల : రూ.800/-



## 34 గోఖలే రోడ్ నార్త్

డా॥ తాటి నరహరి
93224 00551

తెలుగు రైటర్స్ అసోసియేషన్
మహారాష్ట్ర (త్వమ్)
వెల : రూ. 150/-



## మహాకవి కాళిదాస విరచిత ఋతుసంహారః

రఘువర్మ
సెల్ : 92900 93933

నవచేతన, నవోదయ బుక్ హౌస్
వెల : రూ.125/-



## మా నవ భారతం

అవుసుల భానుప్రకాశ్
సంగారెడ్డి
సెల్ : 96032 04507

మెతుకుసీమ



## శ్రీ శివస్తుతి

బండకాడి అంజయ్య గౌడ్
మల్లంపేట, మేడ్చల్ జిల్లా
సెల్: 90961 63962

వెల : రూ.50/-



## సీతమాట (ద్విశతి)

డా॥ చీదెళ్ళ (పరిమి) సీతాలక్ష్మి

అశ్విని ప్రచురణలు
సెల్ : 94407 20324
వెల : రూ. 150/-



## గేయ భారతి

అవుసుల భానుప్రకాశ్
సంగారెడ్డి
సెల్ : 96032 04507

మెతుకుసీమ
వెల : రూ.75/-



## నీరుడు - నిజాలు

డా॥ లింగయ్య నీరుడు
హైదరాబాద్
సెల్: 93966 97070

వెల : రూ.15/-



## ఆసు

డా॥ వెల్దండి శ్రీధర్

హాసిని ప్రచురణలు
వెల : రూ. 150/-



## పయనమెచటికోయి..!

దోరవేటి చెన్నయ్య
సంగారెడ్డి
96636 83558

వెల : రూ.120/-


విజయదశమి
శుభాకాంక్షలు